తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

ఏప్రిల్ 2025
వెల రూ. 20/-
పుటలు - 56

SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:55, Issue: 11
April - 2025, Price Rs.20/-.



## తిరుమల శ్రీవారి వసంతోత్సవాలు


(2025, ఏప్రిల్ 10 నుండి 12 వరకు)



శ్రీనివాసమంగాపురం,
శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారికి
2025, ఫిబ్రవరి
18 నుండి 26 వరకు
వైభవంగా జరిగిన
బ్రహ్మోత్సవ దృశ్యాలు.



తిరుపతి,
శ్రీకపిలేశ్వరస్వామివారికి
2025, ఫిబ్రవరి
19 నుండి 28 వరకు
వైభవంగా జరిగిన
బ్రహ్మోత్సవ దృశ్యాలు



# గీతాశ్లోకార్థసారం

**శ్లో : జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య చ।**
**తస్మాదపరిహార్యేऽర్థే న త్వం శోచితుమర్హసి ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-27వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** జాతస్య=పుట్టినవానికి; మృత్యుః= చావు; ధ్రువో హి= నిశ్చయముగదా!; మృతస్య= చచ్చినవానికి; జన్మ చ= పుట్టుకయు; ధృవం= నిశ్చయము; తస్మాత్= ఆ కారణమువలన; అపరిహార్యే= తప్పింప శక్యముకాని; అర్థే= (ఈ) విషయమందు; త్వమ్= నీవు; శోచితుమ్= దుఃఖించుటకు; న అర్హసి= తగవు.

**భావం:** ఒకవేళ నీ వీ ఆత్మను చావుపుట్టుకలు కలవానినిగ తలంచెదవేని అత్తఱి పుట్టినవానికి చావు తప్పదు, చచ్చినవానికి పుట్టుక తప్పదు, తప్పనిసరియగు ఆ విషయమున నీవిక శోకించటం యుక్తము కాదు.

## కడుపులోని శిశువు- కన్నతల్లిఁ దన్నితేను

సొమ్ము గలవాఁడు తన- సొమ్ము చెడ నిచ్చునా
కమ్మి నీ సొమ్మును నేను- కాపాడవే హరీ!

పసుర మడవిఁబడ్డ- పసురము గలవాఁడు
దెసలు వెద కింటికిఁ- దెచ్చుకొన్నట్టు,
వసగా నాసలలోన- వడిఁబడ్డ నా మనసు
యెసగ మళ్ళించవే న- న్నేలిన గోవిందుఁడా.

గొందిఁ బంటసేయువాఁడు- కొలుచులు పరకళ్ళఁ
జిందకుండా గాదెఁ బోసి- చేరి కాచీని,
కందువ మమ్ముఁ బుట్టించి- కన్నవారి వాకిళ్ళఁ
జెంది కావనియ్యకువే- జీవునిలో దేవుఁడా.

కడుపులోని శిశువు- కన్నతల్లిఁ దన్నితేను
బెడగు లెంచక కని- పెంచీ నటా !
యెడమీక శ్రీ వేంక- టేశ నీ కుక్షిలో నేను
తడవి తప్ప సేసినా- దయఁగావవే..

అధ్యాత్మ సంకీర్తన-సంపుటం-03; సంకీర్తన-437





శ్రీహరీ! సొమ్ముగల యజమాని ఏ పరిస్థితులలోనైనా తన సొమ్ము చెడనిచ్చునా? జీవుడనైన నేను దేవుడవైన నీ సొమ్మును. కావున నన్ను వదలక కాపాడుకొనుమా!

ఒక పశువు అడవిలో చిక్కుకొన్నచో దాని యజమానుడు అన్ని దిక్కులు వెదకి చివరికి దానిని ఇంటికి తెచ్చుకొంటాడు. అట్లే నీ సొమ్మైన నా చిత్తము ఆశలకు వశమై అందు చిక్కుకొన్నది. నాకు ప్రభువైన గోవిందా! ఈ చిత్తమును ఆశలనుండి మంచి త్రోవలోనికి మళ్ళించు.


పైరు పెట్టినవాడు కోత పూర్తి కాగానే ధాన్యము ఇటు నటు చిందిపోకుండా ఒకమూల గాదెబోసి రక్షించుకొంటాడు. నేర్పుతో నీవు మమ్ము సృష్టించావు. మేము కన్నవారి వాకిళ్ళ కెల్ల బోయి కావలి గాయు దుఃస్థితికి వచ్చినాము. జీవునిలో అంతర్యామిగా ఉన్న ఓ దేవుడా! ఈ దుస్థితినుండి మమ్ము తొలగించవయ్యా!

కడుపులో ఉన్న శిశువు కన్నతల్లిని తన్నినా ఆమె ఆ బిడ్డ తప్పులెంచక కని పెంచుతోంది గదా! శ్రీవేంకటేశ్వరా! నీ గర్భంలో ఉన్న నేను అజ్ఞానంతో తప్పుచేసినా నన్ను అనుగ్రహించి నా చెయ్యి విడువక దయతో కాపాడుమా!

# శ్రీరాముడు పెట్టిన పరీక్ష

–శ్రీమతి కె.కీర్తిగీత,
92460 62967

అయోధ్యానగర పొలిమేరలో త్రిజటుడు అన్న ఒక పేదవిప్రుడు ఉండేవాడు. ఇతను నిత్య అనుష్ఠానపరుడు. ఆనాటికి దొరికినదాంతోనే భగవత్ప్రసాదంగా స్వీకరించి సంతృప్తితో ఉంటాడు. భార్య అనుకూలవతి. ఓ రోజు భర్తతో– "నాథా! ఒక విన్నపం. శ్రీరాములవారు వనవాసానికి వెళ్తూ తన సంపదనంతా సర్వజనులకు విరివిగా దానాలు చేస్తున్నారని తెలిసింది. మీరుకూడా వెళ్లి శ్రీరాములవారిని దర్శించండి.



ఆయన సమర్పించినదానిని మహాప్రసాదంగా స్వీకరించి రండి. మేలు జరుగుతుంది.

ఒక చిరిగి ఉన్న శాటీ భుజాన వేసుకొని ఒక దండము (ఒక మూర ఉన్న కఱ్ఱముక్క) చేత ధరించి బయలుదేరాడు. అలా వెళ్లి శ్రీరాముణ్ణి కలిశాడు త్రిజటుడు. శ్రీరామునిదర్శనంతో తన జన్మ ధన్యమైందని భావించాడు. ఆ విప్రుని దీప్తి, వర్చస్సు శ్రీరాముని ఆకట్టుకొన్నాయి. వెంటనే శ్రీరాముడు– "విప్రవర్యా! మీకేమీ ఇవ్వను" అని పలికాడు. కాని త్రిజటుడు నిరాశ చెందలేదు. వెంటనే వెనుదిరిగాడు. అంతలో శ్రీరాముడు– ఆగండి విప్రవర్యా! నీ తేజస్సు, ఠీవి నన్ను ఆకర్షించింది. మీ చేతిలోని దండమును చూస్తున్నాను. ఒక పరీక్షను పెట్టదలచాను సిద్ధమా! మీరు ఈ దండమును దూరంగా విసిరివేయండి. అది ఎంతదూరంలో పడుతుందో అంతమేరకు ఉన్న గోవులను మీకు సమర్పిస్తాను అన్నాడు.

అప్పుడు విప్రుడు శాటీ తీసి నడుముకు గట్టిగా బిగించి, చేతిలోని దండమును గిరగిరా త్రిప్పి బలంకొద్దీ విసిరాడు. ఆశ్చర్యం! ఆశ్చర్యం!! ఆ దండము సరయూనదిని దాటి, ఆవలితీరందాటి అక్కడ మేస్తోన్న ఆలమందమధ్యలో ఉన్న ఒక వృషభంవద్ద పడింది. అక్కడ ఉన్న వారితోపాటుగా శ్రీరాముడుకూడ ఆశ్చర్యపోయాడు. వేదబలంతోపాటుగా ఆత్మబలం, శరీరబలంకూడా ఉన్నదే ఈ విప్రునకు అని అనుకొన్నాడు శ్రీరాముడు. వెంటనే సంతోషంతో శ్రీరాముడు "మహానుభావా! నీకు అంతమేర ఉన్న వందలాది గోవులను మీ ఇంటికి ఇప్పుడే చేరుస్తాను" అన్నాడు.

ఇంకా ఏమి కావాలో కోరుకోండి అన్నాడు.

అందుకు త్రిజటుడు "శ్రీరామచంద్రప్రభూ! నిరంతరం మీ నామస్మరణ ఉండేలాగు అంత్యదశలో మీ దర్శనం మాత్రం నాకు కల్పించండి." సంతుష్టుడైన శ్రీరాముడు 'తథాస్తు' అన్నాడు.

"శ్రీరామా! మీ ఈ వనవాసదీక్షలో తలపెట్టిన కార్యం సాధించి జయప్రదంగా అయోధ్యాప్రవేశం చేసి రామరాజ్యంను స్థాపిస్తారు గాక!" అని దీవించి వెనుదిరిగాడు త్రిజటుడు.

*(వాల్మీకిరామాయణంలో అయోధ్యాకాండలోగల త్రిజటునివృత్తాంతం ఆధారంగా...)*

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 55    ఏప్రిల్, 2025    సంచిక : 11



**వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥**

గౌరవ సంపాదకులు
శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,
పి.జి.డిప్లమో ఇన్ ఎపిగ్రఫీ, డిప్లమో ఇన్ యోగా,

సంపాదకులు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకురాలు
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

ముద్రాపకులు
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సంపాదకులు -0877 -2264360
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777 / 2233333

## ఈ నెలలో....

| | | |
|---|---|---|
| శ్రీరాముడు పెట్టిన పరీక్ష | శ్రీమతి కె.కీర్తిగీత | 04 |
| శ్రీరామనవమి విశిష్టత | శ్రీ అనంతాత్మకుల రంగారావు | 07 |
| ఋగ్వేదంలో హనుమద్వైభవం | డా॥రామచంద్రుని రమేష్‌కృష్ణ | 09 |
| సందేహాలు-సమాధానాలు | శ్రీమతి యం.గీతాకుమారి | 11 |
| ఒంటిమిట్ట కోదండరామాలయవైశిష్ట్యం | 'ఆంధ్రరత్న' ప్రొ॥ జి.వి.శేషారెడ్డి | 12 |
| గోటితలంబ్రాల గొప్పతనం | శ్రీ యం.వి.యస్.రామశేషు | 14 |
| తిరుమల శేషాచలపర్వతంలోని దివ్యతీర్థం "తుంబురుతీర్థం" | శ్రీ బందారు పురుషోత్తం | 16 |
| అక్షయతృతీయ | డా॥దేవులపల్లి పద్మజ | 18 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 19 |
| అభీష్టసిద్ధి క్షేత్రం తిరుచెందూర్ | శ్రీ ఎం.రవితేజ | 21 |
| భక్తరామదాసు | డా॥కే.ఎస్.ఇందిర | 23 |
| వాల్మీకిరాముడు | భారత్‌భాషాభూషణ్ ఎ.రామసుబ్బారెడ్డి | 24 |
| తిల్లైతిరుచ్చిత్తిరకూటం (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| మహాకుంభమేళా వైభవం | డా॥మైలవరపు లలితకుమారి | 27 |
| జోల-లాలిపాటల మధురిమలు | డా॥మైలవరపు లలితకుమారి | 31 |
| విశ్వాసం | పి.శాలిని | 33 |
| తులసి పాతివ్రత్యము | శ్రీ అవసరాల లక్ష్మీపతిరావు | 34 |
| శరణాగతవత్సలుడు | డా॥ఎ.బి.సాయిప్రసాద్ | 35 |
| స్నేహం | డా॥డి.ఊర్మిళాదేవి | 36 |
| స్వామి చల్లనిచూపు.. | శ్రీ నీలంరాజు రాధాకృష్ణమూర్తి | 38 |
| మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు | ఆంగ్లమూలం- శ్రీలక్ష్మీనరసింహన్ శ్రీధర్<br>తెలుగు - శ్రీదేవీ మురళీధర్ | 39 |
| అన్నమయ్య కల్యాణకీర్తనలు | డా॥యస్.పద్మావతి | 40 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 43 |
| జ్ఞాన, మోక్షధామం-రామేశ్వరము | శ్రీ వద్దిరాజు జనార్దనరావు | 44 |
| కోదండపాణి | డా॥ఎన్.సిహెచ్.సుధామైథిలి | 45 |
| తన కోపమే తన శత్రువు | శ్రీ జె.నరసింహారావు | 47 |
| సుగుణాభిరాముడు (చిత్రకథ) | కథ : శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు<br>చిత్రాలు: శ్రీ కె.వి.కోటిలింగాచారి | 48 |
| బాలవినోదం | | 50 |
| పరిపూర్ణ ఆరోగ్యానికి బాదం | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 51 |
| క్విజ్ | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |

ముఖచిత్రం : శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారు, తిరుమల
వెనుకచిత్రం: శ్రీసీతాలక్ష్మణసమేత పట్టాభిరామస్వామివారు, వాయల్పాడు



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# శ్రీరామరక్ష! సర్వజగద్రక్ష!!

వ్యక్తి ఆదర్శప్రాయుడైతే కుటుంబం ఆదర్శంగా నిలుస్తుంది. వ్యక్తి ఎంత ఆదర్శంగా ఉండాలి అన్నదానికి శ్రీరాముని మించిన ఉదాహరణ లేదు. ఈ ఆధునికయుగంలో రామాయణం పారాయణం చేస్తున్నాం. కాని, అందులోని అర్థాన్ని, పరమార్థాన్ని సరిగ్గా గ్రహించలేకపోతున్నాం.

రామాయణకావ్యంలో అడుగడుగునా ఒకే సతి, ఒకే మాట, ఒకే బాణం అన్న శ్రీరాముని నియమాలు, స్నేహానురక్తి, ప్రతిజ్ఞాపాలన, శిష్టరక్షణ, ఔదార్యం– అలాగే సీతాదేవి పాతివ్రత్యం, ఓర్పు, ఆదర్శ ధర్మనిర్వహణ, పుత్రవాత్సల్యం, దశరథుని పుత్రప్రేమ, భరతాదుల సోదరప్రేమ, లక్ష్మణుని సేవ, రామకార్యదురంధరుడైన హనుమంతుని స్వామి భక్తి, సమయజ్ఞత, అకుంఠిత బ్రహ్మచర్యము, భక్తులపాలిట అభయప్రదానం– ఇవన్నీ కలిసి రామాయణ పవిత్రతకు, ప్రచారానికి దోహదం చేశాయి.

తమ వాడుగా, తమలో వాడుగా, తమలా కష్టసుఖాలు అనుభవించిన వాడుగా ఉండటం వల్లనేమో రాముడంటే అంత ఇష్టం అందరికీ.

కామాంధునకు మరణశిక్షే అన్న ధర్మసూక్ష్మాన్ని వాలికి శ్రీరామచంద్రమూర్తి ఉపదేశించాడు. సనాతనధర్మాన్ని విడిచిపెట్టి తమ్ముడైన సుగ్రీవునియొక్క భార్య రుమను చెట్టపట్టి పాపం చేశాడు. కేవలం కామంతో పాపానికి ఒడిగట్టాడు. అందుకే వాలికి మరణశిక్ష శ్రీరాముడు విధించాడు. సీతమ్మను అపహరించిన రావణాసురునికీ మరణం తప్పలేదు.

కైక కోరికమేరకు పితృవాక్యపాలనకోసం అడవికెళ్లి "మాతృదేవో భవ, పితృదేవో భవ..." లాంటి వేదవాక్కులకు భాష్యమై నిలిచాడు శ్రీరామచంద్రుడు. సహధర్మచారిణి జానకిమీద తప్ప ఆయన దృష్టి ఏనాడు అన్య స్త్రీలకేసి అలవోకగా కూడా సోకలేదు. విభీషణుడు శత్రువర్గంవాడైనా శరణంటూ వచ్చేసరికి అడ్డు చెప్పక ఆశ్రయం ఇచ్చాడు. ఏకపత్నీవ్రతం, శరణాగతరక్షణం అను కార్యద్వయంతో దృఢదీక్షతో సంచరించి దృఢవ్రతుడుగా పేరుపొందిన కల్యాణచక్రవర్తి అయోధ్యా రామయ్య!

సోదరులు పరస్పరం ఎలా నడుచుకోవాలి? ఎలా నడుచుకుంటే మంచి ఫలితాలు కలుగుతాయో ఉదాహరణంగా రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులను; అన్నదమ్ములు ఎలా ఉండకూడదో అన్న దానికి ప్రతీకలుగా వాలి–సుగ్రీవులను; రావణ–కుంభకర్ణులను మన ముందు ఉంచుతూ మనల్ని నిత్యజాగృతం చేస్తూ ఉన్నది శ్రీమద్రామాయణ మహాకావ్యం!

ధార్మికశక్తికి, జీవన్ముక్తికి ఆయన అతి సులభమార్గాన్ని చూపించాడు. తెలియక చేసిన తప్పు తప్పే కాదు. అందులోనూ ప్రాయశ్చిత్తం అనుభవించినవారికి దోషం ఏ మాత్రం అంటదని భావించి, నిర్వీర్యమైన చలనరహిత స్థితిలో పడి ఉండిన అహల్యామాతను చైతన్యవంతమైన స్త్రీమూర్తిగా చేసిన పతితపావనుడు ఈ కల్యాణరాముడు. సామాన్యుడైన గుహుని అచంచల భక్తిని గుర్తించి ఆలింగన భాగ్యాన్ని అందించిన సమతాశీలి ఈ పరంధాముడు. అలాగే గిరిజనస్త్రీ శబరి ప్రేమగా అందించిన ఎంగిలిఫలాలను ప్రీతిగా ఆస్వాదించి నిష్కల్మషమైన భావనతో తరతమ భేదాలను పాటించకూడదన్న పరమసత్యాన్ని ప్రవచించిన ప్రేమమయమూర్తి ఈ జగదభిరాముడు.

జటాయువు, శబరి, విభీషణుడు, సుగ్రీవుడు, వానరులు, కాకాసురుడు, జంతువులు, పశువులు, పక్షులు మొదలగువాటియందు హితుడిగ, సన్నిహితుడిగ మెలగుతూ సంచరించి "సర్వభూతేషు హితః" అని పేరు పొందిన శ్రీరాముడు సర్వగుణాభిరాముడు. వాగ్దానంమేరకు వాలిని సంహరించి సుగ్రీవునికి రాజ్యమును, భార్యను అప్పగించి సత్యవాక్య పరిపాలకుడిగా, ధర్మపరిరక్షకుడిగా నిలిచాడు అయోధ్యారాముడు!

శ్రీరాముడిని దేవుడిగా కొలవడమే కాదు. నిత్యజీవితంలో ప్రతిమనిషీ ఆయనను ఆదర్శంగా తీసుకొని జీవించగల్గితే ఈ ప్రపంచమే అయోధ్యగా అలరారుతుంది. అప్పుడు ప్రతిఒక్కరూ ధర్మపరిరక్షకులవుతారనడంలో ఏమాత్రం సందేహంలేదు. అదే పరమసత్యం కూడా!

*2025, ఏప్రిల్ 06న శ్రీరామనవమి సందర్భంగా...*



# శ్రీరామ నవమి విశిష్టత

- శ్రీ అనంతాత్మకుల రంగారావు, 79894 62679

చైత్రమాసం ఉగాదిపండుగ వచ్చిందంటే అప్పటినుంచి తొమ్మిదోరోజు శ్రీరామనవమివరకు వసంతనవరాత్రులు జరుపుకుంటారు. వసంతనవరాత్రుల్లో శ్రీరామాయణం చదువుకోవడం, సుందరాకాండపారాయణంవంటివి ఎన్నో కార్యక్రమాలు చేసి, తొమ్మిదవరోజు శ్రీరామనవమిరోజున ఊరూ వాడా ప్రతీ మారుమూలప్రాంతాల్లోకూడా ఘనంగా వేడుకలు జరుపుకోవడం పరిపాటి. ఆ రోజు అంటే చైత్రమాసం, వసంతఋతువు, శుద్ధనవమి, పునర్వసునక్షత్రంలో శ్రీరాముడు జన్మించాడు. అందుకే ఆ రోజున ఆబాలగోపాలం శ్రీసీతారాములకల్యాణం జగత్కల్యాణంగా నిర్వహిస్తారు.

## ఎందుకు సీతారాముల కల్యాణం చేస్తాం?

రామావతారం ప్రజల జీవనవిధానానికి అత్యంత సన్నిహితంగా ఉంది. ఆయన ఆదర్శపుత్రుడు, ఆదర్శపతి, ఆదర్శసోదరుడు, ఆదర్శప్రభువు. ఇలా షోడశగుణాలు మన జీవనవిధానంలో ప్రేరణ కలిగించడానికి సకలశుభాలు, సకల సుగుణాలు, సకలసౌఖ్యాలు, ధర్మాన్ని అనుసరించే ఉన్నాయి. అటువంటి ధర్మాన్ని అనుసరించి నడిచినవాడు శ్రీరాముడు. ఒక సందర్భంలో మారీచుడు "రామో విగ్రహవాన్ ధర్మః" అన్నాడు. అటువంటి మహనీయుని ధర్మాచరణ మనకు ఆదర్శమై ఉన్నందున సీతారాముల కల్యాణం చేస్తాం.

## శ్రీరామనవమి జన్మదినోత్సవం కదా?

శ్రీరామనవమి శ్రీరామ జన్మదినోత్సవమే. అవతారం జరిగినరోజే యుగపురుషులకు, మహనీయులకు కల్యాణం చేయాలి అని శాస్త్రవచనం. అలా భద్రాచలంలో సీతారాముల కల్యాణం జగత్కల్యాణంగా నిర్వహించడం ప్రారంభమైంది. అప్పటినుండే మనంకూడా అదే శ్రీరామనవమిరోజున శ్రీసీతారాముల కల్యాణం చేసి తరిస్తున్నాం. శ్రీరాముడు అవతారపురుషుడు. సీతాదేవి అయోనిజ. వీరిద్దరూ సాధారణవ్యక్తులు కారు. యజ్ఞపురుషులు. ఐతే వాల్మీకిరామాయణంలో బాలకాండలో సీతాకల్యాణసర్గలో ఫాల్గుణమాసం, శుక్లపౌర్ణమి, ఉత్తరఫల్గునీనక్షత్రంలో కల్యాణం జరిగినట్లు వివరించబడింది. కల్యాణం అభిజిత్‌లగ్నంలో (సుమారు మధ్యాహ్నం 12-1 గం॥ల మధ్య)చేస్తారు. అదే దేవతల కల్యాణం సుముహూర్తం.

శ్రీరామనవమిరోజున సీతారామకల్యాణంలో చిన్న పెద్ద అని తేడాలేకుండా అందరూ పాల్గొనడం విశేషం. ఆ రోజు సీతారాముల కల్యాణం అక్షతలు తలపై వేసుకొంటే శుభాలు కలుగుతాయని విశ్వాసం. అంతేకాకుండా, ఆ రోజు కల్యాణంలో వధూవరులకు (సీతారాములకు) పెట్టిన జీలకర్ర బెల్లంముద్ద అవివాహితులు కనుక శిరస్సుమీద ధరిస్తే తప్పక వివాహం జరిగి తీరుతుంది.

## కల్యాణంరోజు ప్రసాదాల వితరణ

శ్రీరామనవమిరోజున సీతారాముల కల్యాణం పూర్తైన తదుపరి కల్యాణం చూడటానికి వచ్చినవారికి బెల్లంపానకం, వడపప్పు ఇస్తారు. ఇందులో రెండు పరమార్థాలున్నాయి. మొదటిది ఆయుర్వేదంప్రకారం శ్రీరామనవమినుండి ఎండలు ముదురుతాయి. శక్తిని, శరీరంలో కొన్ని లవణాలను కోల్పోతాం. అందుకే తిరిగి ఆ శక్తిని పొందడానికి పానకం, వడపప్పు ఇస్తారు. ఇవి సాత్త్వికఆహారం. మనలో సాత్త్వికగుణాలు పెంపొందించాలనేదే ఈ ఉద్దేశ్యం. బుద్ధిని పెంచుతుంది. వివేకాన్ని కలిగిస్తుంది. కొత్తబెల్లంతో పానకం చేస్తారు. ఇక రెండవ కోణంలో రాముడు వనవాసంలో ఉండగా, తన జన్మదినం సందర్భంగా మునులకు పానకం ఇచ్చేవారు. అపుడు మహర్షులు వడపప్పుకూడా ఇచ్చేవారు అని పండితులు, పెద్దలు చెబుతారు.

## ఆ రోజు గొడుగు, చెప్పులు దానం ఎందుకు చేస్తారు?

శ్రీరామనవమిరోజునుండే ఎండలు ముదురుతాయి. కాబట్టి పురోహితులు ప్రతీఇంట్లో కార్యక్రమం నిర్వహణకు వెళ్ళాలి. అటువంటప్పుడు వారికి ఇబ్బందిలేకుండా బ్రాహ్మణులకు చెప్పులు, గొడుగులు దానం చేస్తారు. దీనికి సంబం

ధించిన కథ జమదగ్నిమహర్షి- సూర్యుడు మధ్య జరిగిన సంవాదం మహాభారతంలో ఉంది.

## జమదగ్నిమహర్షి-సూర్యుడు సంవాదం

సప్తఋషుల్లో ఒకరైన జమదగ్నిమహర్షి తన భార్య రేణుకతో ఆశ్రమానికి కొంచెందూరంలో ఉన్న బహిరంగ ప్రదేశంలో శస్త్రప్రయోగం చేస్తూంటే, రేణుక దూరంగా పడుతున్న అస్త్రాలు పట్టుకొచ్చి ఇస్తోంది. సూర్యుడు నడిమింటికి (మిట్టమధ్యాహ్నం) వచ్చాడు. ఎండతీవ్రతకు రేణుక అలసిపోయి బాణాలు తీసుకురావడంలో జాప్యానికి కారణం తెలుసుకుని జమదగ్నిమహర్షి కోపంతో “నా అస్త్రాలవంటలతో నిన్నేంచేస్తానో చూడు” అని సూర్యునిమీద బాణం ప్రయోగించబోయాడు. అప్పుడు సూర్యుడు బ్రాహ్మణవేషంలో వచ్చి “మహర్షీ! నీవు శాంతచిత్తుడవు కదా! క్రోధాన్ని వీడు. సూర్యరశ్మివల్లనే మేఘాలు ఏర్పడతాయి. వర్షాలు కురుస్తాయి. పంటలు పండుతాయి. వృక్షసంపదకు మూలం సూర్యరశ్మే కదా పంచభూతాలకు ఆధారమవుతుంది.”, “నేనే ఆ సూర్యుడను” అని చెప్పి, జమదగ్ని, రేణుకలను సంతుష్టిపరచడానికి గొడుగు, చెప్పులు సృష్టించి ఇచ్చి “ఎండవేడిమికి గొడుగు, భూతాపంనుండి రక్షణకు చెప్పులు” అని ఇచ్చి శాంతింపచేశాడు. “ఈ వస్తువులు విప్రులకు,




పండితోత్తములకు, వృద్ధులకు ఎవరికైనా దానం చేస్తే ఇహపరసౌఖ్యాలు లభిస్తాయి” అని చెప్పి వెళ్ళిపోయాడు. పవిత్రత ఉండబట్టే బ్రహ్మోపదేశం సమయంలో, వివాహం సమయంలో, సన్యాసదీక్షసమయంలో, శ్రాద్ధదినాల్లో దానాలు ఇస్తారు. అలా దానం చేసినవారికి ఎంతో పుణ్యం లభిస్తుంది. సూర్యుని అనుగ్రహం, భూమాత అనుగ్రహం కల్గుతాయి.

## శ్రీరామనవమిరోజున మన కర్తవ్యం ఏమిటి?

శ్రీరామనవమిరోజున వేకువనే లేచి అభ్యంగనస్నానమాచరించి నిత్యానుష్ఠానంతోపాటుగా సీతారాములను అష్టోత్తరశతనామావళితో పూజించి, నిత్యనైవేద్యంతోబాటు పానకం, వడపప్పుకూడా సమర్పించాలి.

ఆ రోజు రామాయణంలోనుంచి శ్రీరామజననం, సీతారాముల వివాహఘట్టం చదువుకోవాలి. సాయంత్రం దేవాలయం సందర్శించి శ్రీసీతారాముల దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందాలి.

## తిరుమలలో శ్రీరామనవమి ఉత్సవాలు

శ్రీరామ, సీతాసమేత లక్ష్మణ హనుమ దేవతా మూర్తులను ప్రతిష్ఠిస్తారు. “ఆస్థానం” పేరుతో (అంటే కొలువై ఉన్న అని) తిరుమలలో శ్రీరామనవమిఉత్సవాలు, మరునాడు దశమిరోజున పట్టాభిషేకమహోత్సవం నిర్వహిస్తారు. శ్రీరామనవమిరోజున ఆనందనిలయంలో కొలువైఉన్న శ్రీరామాదిచతుర్మూర్తులకు ఆకాశగంగాజలంతో అభిషేకం చేసి, పట్టువస్త్రాలను సమర్పించి సర్వాభరణాలు, పుష్పమాలాలంకృతులను చేస్తారు. సాయంత్రం సీతారామలక్ష్మణ మూర్తులను ఒకే పల్లకిలో ఉంచి “హనుమద్వాహనం” పై తిరుమలలోని మాడ వీథుల్లో ఊరేగింపు చేస్తారు. తదనంతరం ఆ మూర్తులను ఆలయంలో ప్రవేశపెడతారు.

అన్నమయ్యకూడా ఒక సంకీర్తనలో “శ్రీరామచంద్రుడు ఇతడు” అంటూ కీర్తించారు.

త్రేతాయుగంలో జన్మించిన శ్రీరాముణ్ణి నేటికీ మనం ఆదర్శపురుషుడుగా భావించబట్టే కల్యాణం చేసుకొంటున్నాం. ఎన్ని యుగాలు మారినా శ్రీరాముని చరిత్ర ఆదర్శప్రాయంగానే నిలిచిపోతుంది.

**రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే**
**రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః!!**

# ఋగ్వేదంలో హనుమద్వైభవం


–డా॥ రామచంద్రుని రమేష్‌కృష్ణ, 98494 53966

హనుమంతుడు కేవలం రామాయణం ద్వారానే పరిచయం అయినప్పటికీ హనుమంతునియొక్క స్వరూపం వేదకాలంనుండి ఎంతో ప్రధానంగా మనకు కనబడుతోంది. వేదాల్లో మొట్టమొదటి వేదం ఋగ్వేదంలో హనుమంతుని వైభవాన్ని మనం ఎంతో చక్కగా దర్శించవచ్చు. ఋగ్వేదానికి మొట్టమొదటి మంత్రమైన 'అగ్నిమీళే పురోహితం' అనే మంత్రాన్ని తీసుకుంటే అక్కడే మొట్టమొదటిగా హనుమంతుని స్వరూపాన్ని మనకు తెలియచేస్తున్నట్లుగా తెలియవస్తుంది.

**"అగ్నిమీళ పురోహితం యజ్ఞస్య దేవం ఋత్విజమ్।**
**హోతారం రత్నధాతమం" – (ఋగ్వే 1.1.1)**

యజ్ఞానికి పురోహితుడు అయినవాడు, ఋత్విక్ అయినవాడు, దేవతలను మేల్కొలిపేవారిని ఉన్ముఖులను చేసేవాడు, రత్నదాత అయిన అగ్నిని స్మరిస్తున్నాను అని ఈ మంత్రానికిఉన్న సాధారణ అర్థం. కానీ ఇది మంత్రానికి హనుమంతుని స్తుతిమంత్రంగా మన పూర్వీకులు చక్కని అర్థాన్ని తెలియజేశారు. ఇందులో ఉన్న ఒక్కొక్క పదంయొక్క అర్థం తెలుసుకుంటే అందులో హనుమంతుని వైభవం మనకు ప్రకటితమౌతుంది.

అగ్ని శబ్దానికి అర్థం చెబుతూ ఋగ్వేదానికి నిరుక్తమనే పేరిట గొప్ప అర్థాన్ని తెలియజేసిన యాస్కుడు "అగ్నిః కస్మాత్? అగ్రణీర్భవతి" అని అగ్ని అంటే 'అగ్రణీ' అనగా ఎవరైతే




ముందుగా ఉండి పనిచేస్తారో అతనిని అగ్ని అని అంటాం అని వివరణ ఇచ్చారు. రామాయణంలో అటు రామసుగ్రీవుల మైత్రికికానీ, సీతాన్వేషణకుగాని, రావణుని కనిపెట్టి అతని గర్వాన్ని అణచడంలోకానీ, వానరసైన్యానికి అంతటికీ ముందు ఉండి నడిపించిన అగ్రగామి హనుమంతుడు కనుక అటువంటి వానిని అగ్రణి అని, అగ్ని అని అనడంలో ఎటువంటి సందేహమూ లేదు. తరువాతి రెండుపదాలు హోతారం, పురోహితం. రామసుగ్రీవులమైత్రి అగ్నిసాక్షిగా జరిగింది అని మనకు తెలిసిన విషయమే. ఆ యజ్ఞానికి పురోహితుడైనవాడు సాక్షాత్తు స్వామి హనుమయ్య. అంతేకాదు సీతాన్వేషణకు హనుమంతుడు పంపబడి ముందుగా సీతను కనిపెట్టి రావణుడితో రామునికి యుద్ధం జరగటానికి మొట్టమొదటిగా రావణుని లంకానగరానికి పంపబడినవాడు అతడే. యుద్ధ సమయంలో ఆ విధంగా ముందుగా పంపబడేవాడు పురోహితుడు కనుక ఆ విధంగాకూడా పురోహితుడు అయినవాడు హనుమ. తరువాతి శబ్దం 'హోతారం' అనగా ఆహ్వానించువాడు అని అర్థం. మొట్టమొదటగా రాక్షసులందరినీ యుద్ధానికి ఆహ్వానించినవాడు హనుమంతుడే అని సుందరకాండద్వారా మనకు తెలిసిన విషయమే. తరువాతిశబ్దం 'ఋత్విజమ్', దీని అర్థమేమిటి అంటే ( ఋత్వా ఏజం) ఎవరు సముద్రాన్ని దాటి రాక్షసులను కంపింపచేశాడో అతను అని, తరువాత మరొక ముఖ్యశబ్దం 'రత్నధాతమం', సీతాదేవిని గుర్తించడానికి వీలుగా రామనామాంకితమైన ఉంగరాన్ని హనుమంతునికి శ్రీరాముడు ఇవ్వగా ఆ రత్నాన్ని తనవద్ద జాగ్రత్తగా ఉంచుకున్నవాడు. అదేవిధంగా సీతాదేవి తన గుర్తుగా ఇచ్చిన చూడామణిరత్నాన్నికూడా అంతే భద్రంగా

దాచుకొని వాటిని చేరవలసినవారికి చేర్చినవాడు. కనుక ఆయనను రత్నదాత అనడంలో ఎటువంటి సందేహమూ అవసరం లేదు. ఈ అన్నిపదాల అర్థాన్ని సమన్వయం చేసుకుంటే రామ సుగ్రీవులమైత్రిని ముందుండి నడిపినవాడు, సముద్రలంఘనం చేసి రాక్షసులను భయకంపితులను చేసినవాడు, రాక్షసమూకలను యుద్ధానికి ఆహ్వానించినవాడు, రామరావణ యుద్ధానికి పురోహితుడైనవాడు, సీతారాములకు సంబంధించిన అమూల్యమైన రత్నములను కలిగినవాడు, సమస్తవానరసైన్యానికి ముందుగా ఉండి లోకకల్యాణకరమైన రావణసంహారం మరియు సీతారామసంయోగం కలిగించిన అగ్రగణ్యుడైన హనుమంతుని స్మరిస్తున్నాను అని ఈ మంత్రానికి అర్థం.

కేవలం ఋగ్వేద ప్రారంభంలోనేగాక ఇతర ఋగ్వేద మంత్రాలలో మరెన్నో సందర్భాలలోకూడా మనకు స్వామి వైభవం ప్రస్తావించబడినట్లుగా తెలుస్తుంది.

"యజ్ఞో వై విష్ణుః" అని శతపథబ్రాహ్మణం చెబుతోంది. అంటే సాక్షాత్తు విష్ణుభగవానుడి యజ్ఞం అంటే ఆయనే శ్రీరామచంద్రుడిగా అవతరించాడు కనుక ఆ రాముని దూత హనుమంతుడే అగ్ని. అతను చేసిన సుక్రతువు (శోభనం కర్మణం) ఏమిటి అంటే సముద్రాన్ని లంఘించడం, సీతాన్వేషణ చేయడం, సంజీవని తీసుకురావడం, ఇటువంటి కర్మలు చేసినటువంటివాడు, ఇక విశ్వవేదసుడు అనే పదానికి అర్థం చూస్తే సర్వజ్ఞుడైన మహాపండితుడు సూర్యనారాయణుడి శిష్యుడై నవవ్యాకరణవేత్తగా ఖ్యాతిగాంచి, వేదవేదాంగాలను సునిశితంగా అభ్యసించినవాడని సాక్షాత్తు శ్రీరామచంద్రునిచేతనే ప్రశంసింపబడినవాడు. అలాంటి హనుమంతుడిని మనం ఇక్కడ స్మరిస్తున్నాం అని ఈ మంత్రంద్వారా తెలుస్తున్నవిషయం.

**మమచ్చన తే మఘవన్ వ్యంసో నివివిద్వాన్ అప హనూ జఘాన।**
**అధా నివిద్ధ ఉత్తరో బభూవాఞ్ఛిరో దాసస్య సం పిణగ్వధేన ॥**
**(ఋగ్వే 4.18.1)**

(ఓ ఇంద్రుడా! నీ సన్నిధిలో ఉన్న విశాలమైనటువంటి మూపురం కలిగిన ఐరావతమును చూసి దానిని ఒక పండుగా భావించి దాన్ని తినాలనే ఉద్దేశ్యంతో మహావీరుడైన అంజనీ పుత్రుడు మిమ్ములను నిరంతరం సతాయిస్తూ ఉంటే మీరు వానిమీద వజ్రాయుధాన్ని ప్రయోగించగా అతని కిందిపెదవి క్రిందనున్న చిబుకము దెబ్బ తినగా "హను" అను ఆ ప్రదేశం ఉబ్బిపోగా హనుమంతుడని నాటినుండే పేరుపొందినవాడు, మూర్ఛితుడైన తన కుమారుని చూసి దుఃఖితుడైన వాయుదేవుడు ఒక కొండగుహలో కూర్చుని ఉండగా ప్రాణవాయువు లేకుండా ప్రపంచమంతా తల్లడిల్లిపోగా వాయుదేవుని ప్రసన్నుని చేసుకోవటంకోసం బ్రహ్మాదిదేవతలు అక్కడకు విచ్చేసి హనుమంతునికి ఎన్నోవరాలు ఇవ్వగా అతను మరింత బలవంతుడైపోయాడు కనుక అలాంటి బలవంతుడైన భగవంతుని స్మరిస్తున్నాం అని మరొకమంత్రానికి అర్థం. కనుక ఈ మంత్రంద్వారాకూడా వాయుపుత్రుడైన హనుమంతుని స్మరించడమే కనబడుతున్నది.

"అపాం నపాత్" అనే శబ్దంద్వారా అసాధారణ రూపంలో ప్రతిపాదించబడిన దేవుడు హనుమంతుడే అని మన పూర్వాచార్యులు ఎంతో స్పష్టంగా తెలియజేశారు. హనుమత్ ఉపాసకులైన మంత్రశాస్త్రవేత్తలు మరొక అడుగు ముందుకేసి వేదాల్లో తెలియజేసిన హిరణ్మయపురుషుడు సాక్షాత్తు హేమశైలాభదేహుడైన హనుమంతుడే అని మరింత స్పష్టతను ఇచ్చారు.

వైదికసంప్రదాయంలో ఏ విషయమైనాకూడా నేరుగా చెప్పకుండా దానిని సూచించడానికి పరోక్షశబ్దములను ప్రయోగించడం మనకు తెలుస్తున్న విషయం. ఐతరేయోపనిషత్తు "పరోక్షప్రియా హి దేవాః" అని స్పష్టంగా చెబుతోంది. ఈ విధంగా మనం ఋగ్వేదంలో ఎన్నోప్రదేశాల్లో హనుమంతుని వైభవాన్ని దర్శించవచ్చు. హనుమంతుడు కేవలం రామదక్షుడనేకాక మంత్రశాస్త్రములలో ప్రతిపాదింపబడిన మహాబలవంతుడైన భగవత్స్వరూపంగాకూడా తెలుసుకుని ఆయనను అర్చించడంద్వారా మరెన్నో శుభాలు పొందగలం.

శ్రీవైష్ణవసంప్రదాయంలో ఆయనకు 'శిరియ తిరువడి' అని పేరు. తన సేవలద్వారా పరమాత్మకు సంతోషాన్ని కలిగించి ఆయన పదదాసుడిగా ఉండటానికి ఇష్టపడిన భక్తాగ్రేసరుడు స్వామి హనుమ. పాదదాసుడైనంతమాత్రాన తక్కువవాడు కాదనీ, తన మహనీయగుణాలకు కారణ భూతుడైన పరమాత్మను సేవించడంలో అందరమూ అదే దాస్య భావన కలిగి ఉండాలనీ ఆయన మనకు అందించే పరమ దయాసందేశం.

# సందేహాలు



# సమాధానాలు

– శ్రీమతి యం.గీతాకుమారి

**ప్ర) గోవులలో కపిలగోవు శ్రేష్ఠమైనది ఎందుకు?**

**జ)** "గావః విశ్వస్య మాతరః"– అన్నది వేద వాక్కు. ప్రాచీనభారతీయసంస్కృతీ, సంపదలకు గోమాత దైవము. గోవులన్నింటిలో కపిలగోవు శ్రేష్ఠమైనది. కపిల గోవును ఎలా గుర్తించాలి? కపిలవర్ణము అంటే ముదురుఎరుపువర్ణమని, నలుపు వర్ణమనికూడా కొందరు చెబుతారు. గోవులో ముక్కోటి దేవతలు కొలువై ఉంటారు. ఒకసారి గోవులన్నీ హిమగిరి ప్రాంతాలలో మేతకై తిరుగాడుతున్నాయి. ఆ సమయంలో ఒక లేగ పాలు తాగుతుండగా దాని పొదుగునుండి స్రవిస్తున్న పాల నురగ గాలికి ఎగిరి ఆ సమీపంలో తపస్సు చేసుకుంటున్న పరమేశ్వరునిపై పడింది. ఆ స్పర్శకు కన్నులు తెరిచిన ముక్కంటి ఫాలనేత్రమునుండి వెలువడ్డ సెగకు అక్కడ సంచరిస్తున్న గోవులన్నీ నలుపెక్కాయి. అవే కపిలగోవులు. అప్పుడవి పరమేశ్వరుని శరణు కోరి ప్రార్థించగా ఈశ్వరుని దృష్టియొక్క శక్తిని పొందటంవలన ఆ గోవులకు శ్రేష్ఠత లభించింది. పరమేశ్వరుడు వాటికి ప్రత్యేక పూజలు వరంగా అనుగ్రహించాడు. కపిల గోవు శరీరమంతా నలుపు లేదా ముదురు గోధుమవర్ణంలో మెరిసిపోతూ ఉంటుంది. శరీరమంతాకాక మూపురం, గంగడోలు కపిలవర్ణంలో ఉన్నా అవికూడా శ్రేష్ఠమైనవని, వాటి పాలు, వాటిని సేవించడం, వాటికి ప్రత్యేకపూజలు చేయడం శ్రేష్ఠమని భారతీయుల నమ్మకం.

**ప్ర) మంత్రము, తంత్రము, యంత్రము గురించిన విశ్లేషణ తెలుపండి?**

**జ)** దైవాధీనం జగత్ సర్వం
మంత్రాధీనం తు దైవతం!

అని వేదవాక్కు. మంత్రంలో భగవంతుడు ఉన్నాడు. మహర్షులు మంత్రాన్ని అనుసరించి తపస్సు చేసేవారు. మంత్రం అంటే మనం ఏ నామాన్ని జపిస్తామో దాన్ని పదేపదే ఉచ్చరిస్తే అదే మంత్రం అవుతుంది. మననాత్ త్రాయతే యితి మంత్రం అంటారు. శ్రీరామా, శ్రీమాత్రే నమః, పంచాక్షరి, అష్టాక్షరి, ద్వాదశాక్షరీ నామములను మంత్రము అంటారు. ఈ మంత్రాక్షరములను స్వర్ణ, రజత, రాగి, పంచలోహ రేకులమీద బీజాక్షరములతో వ్రాయిస్తే దానిని యంత్రము అంటారు. ఆ యంత్రమును పూజాగృహంలో ఉంచి పూజచేస్తే బాధలు తొలగిపోతాయని నమ్మకం. కొందరు చిన్నరేకుమీద వ్రాయించి తాయెత్తులో వేయించి చేతికి ఆ యంత్రాన్ని కట్టుకున్నా కష్టాలు తొలగుతాయని చెబుతారు. "తన్యత యితి తంత్రం", "తను విస్తా" అని చెబుతారు. మంత్రసిద్ధిని పొంది యంత్రాన్ని అధిదేవతను చేసి నిర్దిష్ట పూజాద్రవ్యాలతో, ముద్రలతో పూజించే విధానాన్ని తంత్రము అంటారు. కానీ తంత్రవిద్యలో సత్ఫలితాన్ని పొందటానికి గురువు అవసరం. గురువు లేకపోతే తంత్రవిద్య బెడిసికొడుతుందంటారు. పగ తీర్చుకోవటంకన్నా పగ లేకుండా చేసే తంత్రం ఎవ్వరిని బాధించదు. వాటిని మంచికోసం వాడాలికానీ ఇతరులకు కీడు చేయటానికి ఉపయోగిస్తే ప్రయోగించినవారికే ఆపదలు కలుగుతాయి. మంత్రం మంచిచేస్తే, యంత్రం ఆపదలు తొలగిస్తే, తంత్రం చెడుకోసంకాక మంచికి వాడితే అందరికి మంచి జరుగుతుంది.

**ప్ర) మానవునికి అంత్యకాలంలో అనాయాస మరణం కలగాలంటే ఏమి చేయాలి?**

**జ)** భూమ్మీద జీవి జననం ఎంత సాధారణమో మరణంకూడా అంతే సాధారణం. అయితే పుట్టుకను ఆహ్వానించినట్లు మరణాన్ని జీర్ణించుకోలేరు. జీవి ఎంత కాలం ఎలా బతికాడనేది ముఖ్యం కాదు. ఎలా మరణించాడు అన్నది సత్యం. ఆకలి, జీర్ణక్రియ సక్రమంగా ఉన్నన్నాళ్ళు మనిషి హాయిగా బ్రతుకుతాడు. కానీ తరువాత సంభవించే మరణమే భయంకరమైనది. మనిషి మంచితనం మరణంలో తెలుస్తుంది అన్నది జనవాక్యం. వ్యాధిగ్రస్తుడై పీడింపబడుతూ మరణించడమంత దురదృష్టం మరొకటి లేదు.

అనాయాసేన మరణం
వినా దైన్యేన జీవితం!
దేహాంతే తవ సాయుజ్యం
దేహి మే పార్వతీపతే!!

అని ఆ పరమేశ్వరుని ప్రార్థించమంటారు. ఎందుకంటే లయకారకుడు ఈశ్వరుడే కదా. జీవి ఆ కైలాసపతిని చేరుకోవటంకన్నా అన్యమేమున్నది. బాధ లేని మరణాన్ని పొందటానికి ఈశ్వర స్మరణ అత్యంత ఆవశ్యకం. పై శ్లోకాన్ని పఠించి తరిద్దాం.

# ఒంటిమిట్ట కోదండరామాలయవైశిష్ట్యం

– 'ఆంధ్రరత్న' ప్రొ।। జి.వి.శేషారెడ్డి, 80748 26819

***2025, ఏప్రిల్ 06 నుండి 14 వరకు ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం సందర్భంగా....***

ఒంటిమిట్ట విశేషాలపుట్ట. ఇక్కడి కోదండ రామాలయం ప్రత్యేకతలకు నిలయం. చారిత్రక, రాచరిక ఘట్టాలకు నిలువెత్తు దర్పణం. ఆంధ్రభద్రాచలంగా పేరుపొందిన ఒంటిమిట్ట వైఎస్ఆర్‌జిల్లాలో (కడపనుండి తిరుపతి వెళ్ళే మార్గంలో కడపకు 27 కి.మీ.దూరంలో) ఉంది. ఇక్కడి మూలమూర్తులు కోదండరాముడు, సీతారామలక్ష్మణులు.

**విభిన్న ఐతిహ్యాలు:** ఒక (ఒంటి) మిట్టపైన రామాలయం నిర్మించబడింది కాబట్టి ఒంటిమిట్ట అని పేరు వచ్చిందని ఒక నమ్మకం.

ఇంకొక కథనం ప్రకారం, ఒంటడు, మిట్టడు అనే ఇద్దరు ఇక్కడి రాముణ్ణి కొలిచి నిజాయితీగా బ్రతికారని, వారిపేరుమీదుగా ఒంటిమిట్ట అనే పేరు వచ్చిందంటారు.

ఉదయగిరి పాలకుడు కంపరాయల ఆజ్ఞతో ఒంటడు, మిట్టడు రామాలయనిర్మాణంలో, చెరువునిర్మాణంలో కీలకపాత్ర పోషించారని మరొక కథనంకూడా ఉంది. అందువల్ల ఒంటిమిట్ట అనేపేరు ఏర్పడిందంటారు.

సీతారామలక్ష్మణుల విగ్రహాలు ఏకశిలతో (అయినా విడివిడిగా) ఉన్నందువల్ల ఈ క్షేత్రం ఏకశిలానగరం అనే పేరుతోకూడా పిలువబడింది.

**స్థలపురాణం:** రామలక్ష్మణులు బాలురుగా ఉన్నపుడు విశ్వామిత్రుని యాగరక్షణ చేసిన విషయం మనకు తెలిసిందే. ఇక్కడి స్థలపురాణంప్రకారం శ్రీరాముని వివాహానంతరం అలాంటి సందర్భం ఒకటి ఏర్పడిందట. అదేమిటంటే మృకండుడు, శృంగి అనే ఇద్దరు ఋషులు దుష్టశిక్షణకోసం శ్రీరాముని ప్రార్థించడంతో సీతాలక్ష్మణసమేతుడైన స్వామి కోదండం, అమ్ములపొది, పిడిబాకు పట్టుకుని వచ్చి యాగరక్షణ చేశాడని అంటారు. అందుకు ప్రతిగా ఆ మహర్షులు సీతారామలక్ష్మణుల విగ్రహాలను ఏకశిలగా చెక్కించారని, తర్వాత జాంబవంతుడు ఈ విగ్రహాలను ప్రాణప్రతిష్ఠ చేశాడని ఇక్కడి ప్రజల విశ్వాసం. ఈ దేవాలయంలో సీతాదేవికోరికపై శ్రీరాముడు రామబాణంతో పాతాళగంగను పైకి తెచ్చాడని అంటారు. దానిపేరు శ్రీరామతీర్థం.

**ఆలయనిర్మాణం:** ఈ కోదండరామాలయానికి విశాలమైన ఆవరణముంది. ఆలయముఖద్వారం ఎత్తు సుమారు 160 అడుగులు. గోపురాలు చోళపద్ధతిలో నిర్మించబడ్డాయి. 32 శిలాస్తంభాలతో రంగమండపం నిర్మించబడింది. ఇది విజయనగరశిల్పాలతో పోలి ఉంది. పొత్తపిచోళులు, విజయనగరరాజులు, మట్లిరాజులు ఈ ఆలయాన్ని మూడుదశలుగా నిర్మించారు, గుడికి ఎదురుగా సంజీవరాయ దేవాలయం ఉంది. ఈ దేవాలయం ప్రక్కగా రథశాల, రథం ఉన్నాయి. చోళ, విజయనగర వాస్తుశైలులు కనిపించే ఆలయ స్తంభాలపైన రామాలయ రామాయణ భారత భాగవత కథలు చూడవచ్చు.



**విదేశీయుల ప్రశంసలు :** ఫ్రెంచ్‌యాత్రికుడు ట్రావర్‌నియర్ 16వశతాబ్దంలో ఈ ఆలయాన్ని దర్శించి భారతదేశంలోని గొప్ప గోపురాల్లో ఈ రామాలయగోపురం ఒకటి అని అన్నాడు.

**బ్రహ్మోత్సవాలు:** ప్రతిసంవత్సరం చైత్రశుద్ధనవమినుండి బహుళ విదియదాకా బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. స్వామివారికి వివిధవాహనసేవలు మరియు కల్యాణోత్సవం అత్యంత కమనీయంగా, కనులపండువుగా జరుగుతాయి.

**వెన్నెలవెలుగుల్లో సీతారామకల్యాణం:** క్షీరసాగరమథనం తర్వాత మహాలక్ష్మీదేవిని నారాయణుడు సతీమణిగా స్వీకరించాడు. పగలు జరిగే వివాహాలన్నీ తాను చూడలేకపోతున్నానని ఆమె సోదరుడు చంద్రుడు స్వామికి విన్నవించాడు. అప్పుడు స్వామి వెన్నెలవెలుగులలో తన కల్యాణాన్ని వీక్షించవచ్చుని వరం ఇచ్చాడు. దానిప్రకారమే రాత్రుల్లో ఇక్కడ స్వామివారి కల్యాణోత్సవాలను నిర్వహిస్తారు.

ఇమామ్‌బేగ్‌బావి ఒంటిమిట్ట రామాలయంలో సందర్శకులను ఆకర్షించే అంశాల్లో ఒకటి. ఇమామ్‌బేగ్ కడపను పాలించిన అబ్దుల్‌ఖాన్ ప్రతినిధి. ఒకసారి ఆయన ఈ ఆలయానికి వచ్చిన భక్తులను మీ దేవుడు పిలిస్తే పలుకుతాడా అని ప్రశ్నించాడట. చిత్తశుద్ధితో పిలిస్తే ఖచ్చితంగా పలుకుతాడని వారు సమాధానం ఇచ్చారు. ఆయన రామా అని మూడుసార్లు పిలవగా అందుకు ప్రతిగా మూడుసార్లు సమాధానం వచ్చిందట. ఆశ్చర్యపడిన ఇమాంబేగ్ స్వామి భక్తుడుగా మారిపోయాడు. అక్కడ నీటి అవసరాలకోసం ఒక బావిని తవ్వించాడు. అది ఆయనపేరుతో ఇమామ్‌బేగ్‌బావిగా వ్యవహరించబడుతోంది. అందువల్ల ప్రతి శనివారం ముస్లింలు కూడా ఈ ఆలయాన్ని దర్శించుకుంటారు. ఈ విధంగా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకంగా ఈ ఆలయం నిలుస్తూ ఉంది.

**రామకవితార్చన చేసిన కవులు:** ఈ స్వామికి కవితార్చన చేసిన కవులెందరో. అందులో ముఖ్యులు ప్రౌఢదేవరాయుల ఆస్థానంలోని అయ్యల తిమ్మరాజు. ఈయన ఈ ప్రాంతవాసి. స్వామిపైన శ్రీరఘువీరశతకం వ్రాశాడు. ఇతని మనుమడే శ్రీకృష్ణదేవరాయుల అష్టదిగ్గజాల్లో ఒకరైన అయ్యలరాజు రామభద్రుడు. మరో సుప్రసిద్ధ కవి, సహజ పండితుడు బమ్మెర పోతన. ఈయన భాగవతాన్ని మాత్రం ఈ కోదండరాముడికి



అంకితం ఇచ్చాడు. అన్నమయ్యకూడా ఈ ఆలయాన్ని దర్శించి స్వామివారిమీద కొన్ని కీర్తనలు వ్రాశాడు. ఇంకా ఉప్పుగుండూరు వెంకటకవి, వరకవి మొదలైనవారందరూ స్వామిపై కవితార్చన చేసి తరించారు. ఒంటిమిట్టకు పూర్వవైభవంకోసం ప్రయత్నించిన ఆధునికుల్లో సుప్రసిద్ధులు 'ఆంధ్రవాల్మీకి' అని పేరుపొందిన వావిలికొలను సుబ్బారావు(1863-1938) ఈ ప్రాంతవాసి. ఈయన రామాలయాన్ని పునరుద్ధరించాడు. స్వామివారికి నగలు చేయించడంతోపాటు రామసేవకుటీరాన్నికూడా నిర్మించాడు. ఈయన వాల్మీకి రామాయణాన్ని తెలుగులో వ్రాసి దానికి సుందరమైనపేరుతో వ్యాఖ్యానంకూడా వ్రాశాడు.

**ప్రస్తుత ప్రభుత్వ కార్యక్రమాలు:** ఆంధ్రప్రదేశ్‌ప్రభుత్వం శ్రీరామనవమిరోజున ఈ ఆలయంలోనే అధికారికంగా ప్రత్యేకకార్యక్రమాలను నిర్వహిస్తుంది. ప్రభుత్వంతరఫున పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పిస్తారు. ఈ ఆలయ నిర్వహణను ప్రభుత్వం తిరుమల తిరుపతి దేవస్థానంవారికి అప్పగించింది. భద్రాచలం తెలంగాణప్రాంతంలోకి వెళ్లిన నేపథ్యంలో ఒంటిమిట్టకు పూర్వవైభవం ఆరంభమైంది. ఆధ్యాత్మిక సాంస్కృతిక చారిత్రకవికాసంలో ఇది శుభపరిణామం. దేవాలయాలను పరిరక్షించుకోవడం, ఆ అనంతమైన సంపద పరులపరం కాకుండా చూసుకోవడం, ఆధ్యాత్మిక సాంస్కృతిక చారిత్రకవైభవాన్ని నిలబెట్టుకోవడం మనందరి ప్రాథమిక బాధ్యత.

ఒంటిమిట్ట కోదండ రామాలయం అపూర్వవైభవంతో అనంతకాలం అలరారుతుందని ఆశిద్దాం.

*శ్రీసీతాలక్ష్మణసమేత శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః*

2025, ఏప్రిల్ 11న
ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా...

# గోటితలంబ్రాల గొప్పతనం

- శ్రీ యం.వి.యస్.రామశేషు

**జా**నక్యాః కమలామలాంజలి పుటేయాః పద్మరాగాయితాః
న్యస్తా రాఘవమస్తకే చ విలసత్ కుంద ప్రసూనాయితాః।
స్రస్తా శ్యామలకాయకాంతి కలితాః యాః ఇంద్ర నీలాయితాః
ముక్తాః తాః శుభదాః భవంతు భవతాం శ్రీరామ వైవాహికాః॥

తలంబ్రాల వైశిష్ట్యమును తెలియజెప్పు ఈ శ్లోకంలేని శుభలేఖ మనకు కనబడదు. వివాహఘట్టములలో మంగళ సూత్రధారణం తరువాత ప్రధానమైనది తలంబ్రాలఘట్టమే.

వధూవరులిరువురు పసుపుతో కలిపిన అక్షతలను దోసిళ్ళతో ఒకరిపై ఒకరు పోసుకోవడాన్ని తలంబ్రాలు, అక్షతలు అంటే క్షతంగానివి. తలంబ్రాలకు పోసే బియ్యము విరిగి పోకుండా బాగుండాలి. విరిగినవి ఉంటే తీసివేయాలి. అందుకే ఆవునెయ్యి, పసుపుతో తలంబ్రాలు కలుపుతారు. ఈ ఘట్టం చూడటానికి ఎంతో వేడుకగా ఉంటుంది. పెండ్లికి వచ్చిన వారందరూ వివాహఘట్టాలలో దేనిని చూడకపోయినా తలంబ్రాలు చూడటానికి పిన్నా పెద్దా అందరూ వధూవరులచుట్టూ చేరతారు. చిన్నవారు రాబోయే వారి వివాహసంబరాన్ని తలచుకొంటే, పెద్దవారు తమ వివాహమునాటి రోజులను గుర్తు చేసుకొంటారు. అంత గొప్పది ఈ తలంబ్రాల ఘట్టం. సంపదలు, ఆయుష్షు, సంతానం, కీర్తిప్రతిష్ఠలు వృద్ధి పొందాలని, సుఖశాంతులతో నిండునూరేళ్ళు కలిసి జీవించాలని వేదమంత్రాల నడుమ సాగుతుందీ తలంబ్రాల ప్రహసనం.

సామాన్యమానవుడు పోసుకునే తలంబ్రాలలోనే ఇంతటి వైశిష్ట్యముంటే ఆ భగవంతుడికి పోసే తలంబ్రాలు ఇంకెంత గొప్పవో కదా! ఆ తలంబ్రాలను మనమంతా పరమాత్మ నామాన్ని జపిస్తూ తలపై వేసుకుంటాం. అందువలన మనకన్నీ శుభాలు కలుగుతాయన్నది భక్తుల నమ్మిక.

శ్రీరామనవమికి జరిగే కల్యాణ ఉత్సవసమయంలో అనేక ప్రదేశాలనుంచి తలంబ్రాలు తరలివస్తాయి. వాటికి ఒక విశిష్టమైన చరిత్ర ఉంది. తలంబ్రాలకు పూర్వం మర ఆడించగా వచ్చే బియ్యమును వాడేవారు. ఇదివరకు దేవుని కల్యాణానికి అలాంటి బియ్యాన్నే వాడేవారు. కాని గత కొన్ని సంవత్సరాలనుండి శ్రీసీతారామచంద్రుల కల్యాణానికి భక్తులందరూ కలిసి రామనామస్మరణ చేస్తూ ధాన్యాన్ని గోటితో ఒలిచి దానిపై పొట్టుతీసి ఆ బియ్యాన్ని తలంబ్రాలకు పంపుతున్నారు. మొదట్లో గోదావరిజిల్లాలనుంచి భద్రాద్రిరాముని కల్యాణానికి పంపేవారు. ఆంధ్రప్రదేశ్ రెండుగా విభజింపబడిన తరువాత భద్రాచలం తెలంగాణరాష్ట్రంలో చేరింది.

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధక్షేత్రం ఒంటిమిట్ట కోదండరామాలయంలోకూడా శ్రీరామనవమిఉత్సవాలు జరుపుతున్నారు. ఇక్కడ జరిగే కల్యాణానికి గోదావరిజిల్లాలు, గుంటూరు, బాపట్ల, చీరాల, పర్చూరు మొదలగు అనేక పట్టణాలు, పల్లెలనుంచి ఈ గోటితలంబ్రాలు స్వామికి పంపిస్తారు. ఈ ధాన్యాన్ని కృత్రిమ ఎరువులు వేయకుండా, గోమూత్రం, గోమయం ఎరువుగా వేసి పండిస్తారు. విజయదశమినాడు ధాన్యానికి పొట్టుఒలిచేపనికి అంకురార్పణ చేస్తారు. భక్తులందరూ ఆలయంలోగాని, ఏదైనా పవిత్రప్రదేశంలో చేరి రోజుకు కొంతధాన్యాన్ని తమముందు పోసుకొని, రామనామస్మరణం చేస్తూ పొట్టుతీసి వాటిని ఒకచోట రాశిగా పోస్తారు. ఆ తరువాత వాటికి సంప్రదాయపు సొబగులద్ది అంటే ఆవునెయ్యి, పసుపుతో కలిపి చిన్న చిన్న మూటలుగా కట్టి వాటిని శిరస్సున పెట్టుకొని కాలినడకన బయలుదేరుతారు. వాటిని భద్రాచలం, ఒంటిమిట్టల్లో భక్తితో స్వామికి సమర్పిస్తారు. గోటితో కోటిగింజలను ఒలవటమే ఒక క్రతువు! ఆ యజ్ఞంలో భాగస్వాములవటమే తమ పూర్వజన్మసుకృతంగా భావిస్తారు భక్తులందరూ.


దీనికై దాదాపు 300 క్వింటాళ్ళధాన్యాన్ని ఉపయోగిస్తారు. ఈ తలంబ్రాలు అత్యంత విశిష్టతను సంతరించుకున్నాయి. స్వామికి చేసిన కల్యాణ తలంబ్రాలు శిరస్సున ధరిస్తే తమకన్నీ శుభాలే కలుగుతాయని, తమ దాంపత్యం ఆనందంగా సాగుతుందని నమ్మిక. వివాహం


మనిషి మనుగడను నిర్దేశించేవి మన పూర్వీకులు మనకిచ్చిన సుగుణాల సంపదలే

కానివారు ఈ అక్షతలను శిరస్సున ధరిస్తే త్వరగా కల్యాణం జరుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ కోటి గోటి తలంబ్రాలు సీతారామకల్యాణంలోని అక్షతలకోసం భక్తులు ఎంతగానో ఎదురుచూస్తారు. ఈమధ్య కాలంలో కల్యాణోత్సవానికి ఎవరైనా వెళ్ళలేకపోతే అక్షతలు కావలసినవారికి వాటిని అందించే బాధ్యతని తపాలాశాఖవారు నిర్వర్తిస్తున్నారు.

భద్రాచలంలో నవమిరోజున అభిజిత్‌లగ్నం అంటే మధ్యాహ్నం 12గం॥లకు సీతారామకల్యాణం నిర్వర్తిస్తారు. కాని ఒంటిమిట్టలో చైత్రశుద్ధనవమినాడు కాకుండా చైత్ర పున్నమి నాటి రాత్రి పండువెన్నెలవెలుగులలో సీతారామకల్యాణం జరుపుతారు. దానికి ఒక ఐతిహ్యాన్ని పండితులు చెబుతారు.

విష్ణుమూర్తి లక్ష్మీదేవిల కల్యాణాన్ని సాగరుడు పగటి పూట నిర్వహించాడు. అప్పుడు లక్ష్మీదేవి సోదరుడయిన చంద్రుడు తాను సోదరి లక్ష్మీదేవికల్యాణాన్ని చూడలేకపోయా నన్న బాధను మహావిష్ణువుతో పంచుకున్నాడు. ఆర్తత్రాణ పరాయణుడయిన స్వామి త్రేతాయుగంలో రామావతారంలో నీ కోరిక తప్పక తీరుతుందని వరమిచ్చాడు. చంద్రునికిచ్చిన వరం



కారణంగా ఒంటిమిట్టలో కోదండరాముని కల్యాణం నవమిరోజున కాకుండా చైత్రపున్నమినాడు వెండివెన్నెలలో జరుపుతారని ప్రతీతి.

స్వామికల్యాణసమయంలో భక్తులిచ్చే కోటిగోటి తలంబ్రాలతోపాటుగా ప్రభుత్వంవారు స్వామికి ముత్యాలను కూడా సమర్పిస్తారు. ఆనాడు తానీషా తలంబ్రాలను సమర్పించే వాడు. ఇది భక్తుడైన రామదాసు కాలంనుండి వస్తున్న ఆనవాయితీ. ఇదికూడా చంద్రునికిచ్చిన వరప్రభావమే. చంద్రుడు మనఃకారకుడు. నవగ్రహాలలో ఒకడై మానవుల మనశ్శాంతికి, మనోవైకల్యాలకుకూడా ప్రాతినిధ్యం వహిస్తాడు. మనస్సుమీద ప్రభావాన్ని చూపే ముత్యాలను తలంబ్రాలలో కలపటానికి ఒక కారణమున్నది. ముత్యం చంద్రుని సంకేతం. మనస్సుకు ప్రశాంతత కలిగించేవాడు చంద్రుడు. చంద్రగ్రహం అనుకూలంగా లేకపోతే ముత్యం పొదిగిన ఉంగరాన్ని ధరించ మంటారు. అందుకై తలంబ్రాలలో ఈ ముత్యాలను కలుపు తారు. ఆలుమగల దాంపత్యం మనస్సుపై ఆధారపడి ఉంటుంది. ముత్యాలు కలిపిన తలంబ్రాలు శిరస్సుపై పోసుకోవడంద్వారా భార్యాభర్తలయందు అనురాగం పెంపొంది, అన్యోన్యంగా జీవించడానికి ప్రతీక ముత్యాలతలంబ్రాలు అని పండితవాక్కు.

**స్వామి కల్యాణం**
**లోక కల్యాణ కారకం**
**స్వామి తలపై జాలువారిన**
**ముత్యాల తలంబ్రాలు**
**మనశ్శాంతి కారకమై**
**ఆలుమగలనడుమ**
**అనురాగ అన్యోన్యతలను**
**స్వామి పెంపొందించు....**

అని భక్తులు స్వామిని వేడుకుంటూ భక్తిపారవశ్యంతో పునీతులవుతారు.

సీతారామకల్యాణాన్ని దర్శించిన భక్తులు ముత్యాలు కలిపిన తలంబ్రాలనందుకొని స్వామి కృపాకటాక్షవీక్షణములు తమపై సమృద్ధిగా ప్రసరిస్తాయని ప్రగాఢవిశ్వాసం.

**"లోకా స్సమస్తా స్సుఖినో భవన్తు"**

**2025, ఏప్రిల్ 12న**
**తుంబురుతీర్థముక్కోటి సందర్భంగా...**

**తిరుమల శేషాచలపర్వతంలోని దివ్యతీర్థం**

# "తుంబురుతీర్థం"

- శ్రీ బందారు పురుషోత్తం, 94415 26803

తిరుమలలోని శేషాచలపర్వతంమీద శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం అలరారుతోంది. కలియుగంలో వేంకటేశ్వరుడుగా వెలసిన మహావిష్ణువును సేవించేందుకు అవతరించిన ఆదిశేషుని కలియుగఅవతారమే ఆ దివ్యపర్వతం. శేషుని తలభాగం తిరుమలపర్వతంకాగా, అది విస్తరిస్తూ పడమటివైపు కడప, నంద్యాల, కర్నూలుప్రాంతాలమీదుగా వెళ్ళి శ్రీశైలమై అక్కడ తోకభాగమై అంతమైంది.

ఆదిశేషుని తలభాగమైన తిరుమలక్షేత్రం ఆయన తల మీది మాణిక్యంలా ప్రకాశిస్తూంది. తిరుమల పరిసరప్రాంతమైన పాపవినాశనంతీర్థంనుండి, సుమారు ఏడు కి.మీ. దూరంలో ఈ దివ్యమైన "తుంబురుతీర్థం" ఉంది. సుమారు నూరుఅడుగులఎత్తున్న కఠినశిలాజనితమైన రెండుకొండలమధ్య విశాలంగా ప్రవహిస్తున్న జలధార, స్వచ్ఛమైననీరు పారదర్శకంగా గోచరిస్తూ ఉంటుంది. అదే తుంబురుతీర్థం. ఎరుపు మరియు మట్టివర్ణం కలిసినవర్ణంతో దర్శనమిస్తున్న ఆ రెండుకొండలమధ్య ఆదిత్యతీర్థం ప్రవహిస్తూ ఉన్నది.

తిరుమల పరిసర అటవీప్రాంతాలలో సుమారు అరవై నాలుగు దివ్యతీర్థాలున్నట్లు ప్రతీతి. అందులో ప్రథమంగా చెప్పుకోదగిన తీర్థరాజం ఈ తుంబురుతీర్థం.

శేషాచలంలోని పవిత్రత, అక్కడి భూగర్భజలంలోని రసాయనాలు, వృక్షాలకు చెందిన మూలికలు మిళితమై భూగర్భ జలంతో కలిసి ఈ తుంబురుతీర్థంలో ప్రవహిస్తున్నది. ఈ విషయం పూర్వం అక్కడ తపమాచరించిన మునులు ప్రవచించేవారు. ఈ తీర్థం పేరు ఎలా వచ్చిందనడానికి ఒక కథ ఉంది.

పూర్వం తుంబురుడు, నారదులకు పరస్పరం గానకళలో, ఎవరు గొప్ప అను అనుమానం వచ్చింది. వారిద్దరు ఒక నిర్ణయానికి వచ్చి, బ్రహ్మను మధ్యవర్తిగా పెట్టుకొని, వారి గానకళను ప్రదర్శించారు. విధివశాత్తు తుంబురుడు అపజయం పొందాడు. బ్రహ్మ తుంబురుని అనునయించి, "వత్సా! నీవు శేషాచలపర్వతానికెళ్ళి అక్కడ ప్రవహిస్తోన్న పవిత్రతీర్థంలో తపమాచరించు. నీ గానకళ ప్రసిద్ధమై నాదయోగివి ఔతావు అని పలికి ఆశీర్వదించాడు. తుంబురుడు బ్రహ్మచెప్పినట్లే ఆ పర్వతప్రాంతానికి వెళ్ళి ప్రశాంతంగా ఒక తీర్థంవద్ద కొన్నిసంవత్సరాలు ఘోరతపస్సు చేశాడు. ఒకరోజు సరస్వతీదేవి ప్రత్యక్షమై, "గొప్పనాదయోగివి ఔతావు" అని వరం ప్రసాదించింది.

బ్రహ్మవాక్కుననుసరించి, అతని ప్రత్యర్థి నారదుడు, ఆ శేషాచలపర్వతానికి వచ్చి, ఈర్ష్యాద్వేషాలు వదలి తుంబురుని ఆశీర్వదించాడు.

ఆ కారణంగా ఆ తీర్థం తుంబురునిపేరుమీద తుంబురుతీర్థంగా ప్రసిద్ధిగాంచింది. అక్కడ నారదుడు ఉన్నచోటుకు "నారదమంటపం" అని పేరు వచ్చింది. అది తుంబురుతీర్థం ప్రవేశద్వారానికి ముందు కనిపిస్తుంది. దానినే నారదాశ్రమంగా వ్యవహరిస్తారు.

ఈ తీర్థాన్నే "ఘోణ" తీర్థమని పిలుస్తారు. ఇంతకు ముందు చెప్పుకున్నట్లు ఆదిశేషుని తలభాగమైన తిరుమలక్షేత్రం సమీపాననున్న ఈ తీర్థంలోని కొండ ఆదిశేషుని నాసికలాగా ఉంది. అందువల్ల దీనిని ఘోణతీర్థమని అన్నారు. ఘోణ మనగా "నాసిక" అని అర్థం.


తుంబురుతీర్థంలో సంవత్సరానికొకసారి "తీర్థముక్కోటి" అని ఉత్సవం చేస్తారు. ఆ ఉత్సవం ప్రతి సంవత్సరం, ఫాల్గుణమాసం, ఉత్తరఫల్గునీనక్షత్రంతో కూడిన పున్నమినాడు వస్తుంది.

ఆ రోజు తీర్థపర్వదినంనందు వందలాదిమంది భక్తులు ఇక్కడికొచ్చి పవిత్రస్నానాలు ఆచరిస్తారు. ఈ పర్వదినం ఫాల్గుణమాసంలో వస్తుంది. కాబట్టి, ఈ తీర్థాన్ని ఫల్గుణీతీర్థమని కూడా పిలుస్తారు. సన్యాసులు, సిద్ధులు ఈ తీర్థప్రాంతంలో జపతపాలాచరించి సిద్ధిపొందారు. అక్కడ రాతిగుహలు చక్కగా గదులను పోలి ఉన్నాయి. ప్రవాహం రాపిడివల్ల ఆ విధంగా తొలచబడిందేమో అనిపిస్తుంది. దానినే "సన్యాసుల గుహ" అని అంటారు. ఈ గుహలలో అన్నిటికన్నా పెద్దగా కనుపించే గుహ

పేరు "తరిగొండ వెంగమాంబ గుహ". ఆమె కవయిత్రి. శ్రీవేంకటేశ్వరుడు ఆమె ఇష్టదైవం. ఆమె తిరుమలనుండి వచ్చి అక్కడ తపస్సు చేసి, సిద్ధి పొందింది. పలుగ్రంథాల్లో స్వామి మాహాత్మ్యాలను ప్రస్తుతిస్తూ రచించింది. ఈ గుహకు పైభాగాన, ఒక చిన్నగుహ ఉంది. దానిమీదికి ఎక్కడానికి వెదురుకర్రలతో నిర్మించిన నిచ్చెనలాంటిది అక్కడ ఉంచారు. సన్యాసులు అక్కడ తపస్సు చేసుకొనేవారు.

శ్రీ మళయాళస్వామివారు ఇక్కడ కొన్నిసంవత్సరాలు తపస్సు చేసి సిద్ధిపొందారు. తరువాత ఆయన శ్రీకాళహస్తి సమీపాన ఏర్పేడుగ్రామంలో ఒకమఠం నిర్మించి అక్కడే శిష్యులతో, ఆశ్రమం నిర్వహిస్తూ ఉండేవారు. ఆయన పలు ఆధ్యాత్మికగ్రంథాలను రచించి ప్రసిద్ధిగాంచారు.

ఈ తుంబురుతీర్థం అందచందాలు వర్ణనాతీతం. ఎత్తైన రెండుకొండలనడుమ పారే జలధార. దాని గట్టుమీదినుండి పైకిచూస్తే, ఎత్తుగా రెండువైపులా కనిపించే బృహత్స్వరూపం. మూడురకాల శిలాజాతులు కలిసిన




కఠినశిలా సహజనిర్మాణం. ఎరుపు మరియు మట్టివర్ణం కలిసిన వర్ణంతో సూర్యకిరణాలలాగా మెరుస్తూ కనులపండువుగా ఉంటుంది. భూగర్భరసాయనాలు, వృక్షమూలికలు, దివ్యపవిత్రత మిళితమైన ఆ జలధార ఔషధగుణం కలిగి ఉంటుందంటే అతిశయోక్తి కాదు. ఎందరో భక్తులు ఈ తీర్థజలంలో స్నానమాచరించి స్వస్థతను, శాంతిని పొందారు. ఆధ్యాత్మికత, ప్రకృతితత్త్వం, సహజసౌందర్యం కలగలిసి భక్తులకు, పర్యాటకులకు, కళాకారులకు తుంబురుతీర్థసందర్శనం ప్రశాంతతను చేకూరుస్తుందన్నది ముమ్మాటికి సత్యం.

తుంబురుతీర్థముక్కోటిపర్వదినంనాడు భక్తులు పొందే అసలైన మానసికానందం ఒక్కటుంది. ఆ రోజు అక్కడికి వచ్చిన భక్తులు, పర్యాటకులు పగలంతా స్నానాలు గావించి పూజలు, మొక్కుబడులు తీర్చుకొని, చేసుకున్న ప్రసాదాలు, తెచ్చుకున్న భోజనాలు భుజించి, ఆ సాయంకాలం సేద తీరుతారు. చీకటిపడగానే రెండుకొండలమధ్య ప్రవహించే జలధారకు ఇరువైపులా ఉన్న గట్టుమీద వరుసగా పడుకొని విశ్రమిస్తారు. ఆ రోజు పౌర్ణమి. ఐనా గాని పున్నమివెలుగుకు రెండుకొండలు అడ్డుపడి కొంతచీకటిని ప్రసరింపజేస్తుంది. పడుకొని విశ్రమించే భక్తులకు పున్నమివెలుగు గోచరిస్తూఉంటుంది. ఆకాశంవైపు చూచినప్పుడు వారికి నల్లని రెండుకొండలమధ్య నీలిరంగువస్త్రం కప్పినట్లు కనిపిస్తుంది. కొంతమంది మేల్కొని రాత్రి పండ్రెండుగంటలవేళ ఆ రెండుకొండలమధ్యకు వచ్చే చంద్రదర్శనంకోసం వేచిచూస్తూంటారు. సమయం ఆసన్నమై చంద్రుడు ఆ రెండుకొండలమధ్యకు రాగానే, ఈలలతో, అరుపులతో అందరిని లేవగొట్టి ఆ దృశ్యాన్ని చూడమని హెచ్చరిస్తారు. రెండుకొండలమధ్య పొడవైన నీలాకాశంలో, శ్వేతవర్ణంతో ధగధగా మెరిసిపోతున్న పున్నమిచంద్రునిదర్శనం అక్కడున్న భక్తజనావళికి అమితమైన ప్రశాంతతను, అద్భుతమైన మానసికోల్లాసాన్ని కలిగిస్తుంది. అదే ఆ తుంబురుతీర్థముక్కోటి పర్వదినాన కలిగే పరమవిశిష్టమైన మానసికానందం.

ఆనాటి, అక్కడి చంద్రదర్శనం అక్కడి తీర్థప్రజలకు దివ్యమైన అనుభూతిని, సాక్షాత్తు మలయప్పస్వామిని దర్శించినంత సంతృప్తిని ఇస్తుంది.


**2025, ఏప్రిల్ 30న అక్షయతృతీయ సందర్భంగా...**

# అక్షయతృతీయ

- డా॥ దేవులపల్లి పద్మజ, 98496 92414

అన్ని జన్మలలోకి ఉత్తమమైనది మానవజన్మ. దీనిని సద్వినియోగం చేసుకుని అనంతమైన పుణ్యఫలాలు అందుకోవాలని అందరూ ఆకాంక్షిస్తారు. అక్షయ అంటే తరిగిపోనటువంటిది. నేడు చేసే పుణ్యకార్యాలఫలం అక్షయం చేస్తూ తరిగిపోకుండా చేయమని చేసే వ్రతమే అక్షయతృతీయవ్రతం. ఈ రోజు చేసే దేవతా ప్రీతికర్మలు, జపదానహోమాలు క్షయం కానంత మంచి ఫలితాన్నిస్తాయి. ఈ రోజు చేసే దానాలు అనుష్ఠానపరులకు, యోగ్యులకు చేసినట్లయితే శ్రీ మహావిష్ణువు సంతృప్తిచెంది అనుగ్రహిస్తాడని శాస్త్రవచనం. మనలో జీవుడు మరొకశరీరంలో ప్రవేశించినతరువాతకూడా అన్నవస్త్రాలకు లోటు లేకుండా అక్షయమై సంపదలు కలుగచేసేదే ఈ పండుగ.

సంకల్పసహిత సముద్రస్నానం విశేషఫలితాన్నిస్తుంది. నక్తవ్రతం, ఏకభుక్తం విశేషం. ఈ రోజు పరశురామజయంతిగాకూడా కొలుస్తారు. క్లిష్టసమస్యలకు పరిష్కారం కావాలనుకునేవారు "పరశురామస్తుతి" ఈ రోజునుంచి మండలకాలం పారాయణ చేసినట్లయితే అద్భుతఫలితాలు కలుగుతాయి. రోజంతా ఉపవసించి రాత్రిసమయంలో స్త్రీలు లక్ష్మీదేవిని పూజించి కనకధారాస్తోత్రం, శ్రీ సూక్తం, అష్టలక్ష్మీస్తోత్రం మొదలైనవి పారాయణ చేసినట్లయితే సౌభాగ్యవంతులై, వారి కుటుంబాలు సుఖసంతోషాలతో వర్ధిల్లుతాయి. ఈ రోజున చల్లనిపానీయాలైన నారికేళం, తేనె, చెరకురసం, గోక్షీరం మొదలైనవాటితో అభిషేకం చేసి, వాటిని గృహమంతా చిలకరించినట్లయితే క్షేమ సౌభాగ్యాలతో, శాంతిప్రదంగా జీవించగలుగుతారు.



అక్షయతృతీయ శుభకాలంలో పితృదేవతలను తలచుకుంటూ అన్నం, నెయ్యి, పప్పు కలిపిన చిన్నముద్దను ఎండుకొబ్బరిలో నిక్షిప్తంచేసి ఆహుతి చేసినట్లయితే వంశపారంపర్యంగా శుభఫలితాలు పొందవచ్చునని జ్యోతిషపండితులు చెబుతారు. అక్షయతృతీయనాడు శ్రీమహావిష్ణువుకి చందనం సమర్పిస్తే విశ్వమంతా చల్లగా సుభిక్షంగా ఉంటుంది. దేవాలయాల్లో ధవళవర్ణానికి అధిక ప్రాధాన్యమిస్తారు. ధవళపీతవస్త్రాలతో విగ్రహాలంకారాలు చేస్తారు. ఈ రోజు చేసే ఏ దానానికైనా అక్షయ ఫలితం ఉంటుంది. మనం చేసే దానఫలితం మన తరువాత తరాలు కూడా అనుభవించవచ్చు అనే నమ్మకం. కొన్ని ముఖ్యదానాలు–

**స్వయంపాకం-**బియ్యం, కందిపప్పు, రెండుకూరలు, చింత పండు, మిరపకాయలు, పెరుగు, నెయ్యి, తాంబూలంతోసహా దానమిస్తే అన్నానికి లోటుండదు అని భావిస్తారు.

**వస్త్రదానం-** ఎర్రని అంచు కలిగిన పంచెలచాపు, కండువా, తాంబూలంతో బ్రాహ్మణునికి దానమిస్తే వస్త్రాలకు లోటుండదు.

**ఉదకదానం-** కుండనిండుగా మంచినీటిని నింపి దానంచేస్తే ఉత్తరకర్మలద్వారా పరలోకయాత్రకు సహకరించే చక్కని సంతానం కలుగుతుంది. ఉత్తమగతులు సంప్రాప్తించటానికి ఇది ఎంతో సహకరిస్తుంది.

ఈ రోజు సింహాచలనరసింహుని చందనోత్సవం జరుగుతుంది. సంవత్సరకాలమంతా చందనంపూతలో సేదదీరే స్వామి తన నిజస్వరూపాన్ని భక్తులకు చూపి కనువిందు చేస్తాడు. స్వామివారిది ఉగ్రరూపం కావటంవల్ల వారికి శాంతి కలగటానికి చందనాన్ని ఆయనపై లేపనంగా పూస్తారు. ఈ రోజు లక్షలాదిభక్తులు స్వామివారి నిజస్వరూపాన్ని చూడటానికి అన్నిరాష్ట్రాలనుండి తరలివస్తారు. శ్రీపార్వతీపరమేశ్వరులను, శ్రీలక్ష్మీనారాయణులను భక్తిశ్రద్ధలతో పూజించి, శక్తిమేరకు దానధర్మాదులు ఆచరించి ఉత్తమగతులు పొందుదాం. మన తోటివారినికూడా సుఖసంతోషాలతో జీవించేలా సహకరిద్దాం. పండుగలలోని పరమార్థాన్ని గ్రహించి వ్యవహరిస్తే లోకానికి ఎంతో కొంత మేలును చేసినవారమౌతాం.

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



## గత సంచిక తరువాయి..

"ఈ పర్వతమే సర్వస్వంగా భావించి నేను ఇక్కడే జీవించాను. ఈ పర్వతపరిసరతీర్థాలలోనే పవిత్రస్నానం ఆచరించాను. ఇక్కడే 'కరాళనారసింహ' మంత్రజపం కొనసాగించాను. చివరకు మీతో సమరంకూడా చేశాను. భౌతికంగా నేను మరణించిన ఈ పర్వతం నా పేర ప్రసిద్ధం కావాలని నా చిన్నికోరిక" అన్నాడు. స్వామి సరేనంటూ వృషభాసురునికి ముక్తి ప్రసాదించాడు. ఆ సమయంలో దేవతలు పూలవానలు కురిపించారు. గుహల్లో దాగిన మునులు గుహనుండి బయటకువచ్చి స్వామిని వేనోళ్ళ కీర్తించారు. అప్పుడా స్వామి మునులతో-

"మునులారా! ఇక మీరు నిర్భయంగా ఈ పర్వతపరిసరాలలో సంచరించవచ్చు. మీ జపతపాదులకు ఎలాంటి ఆటంకాలు ఉండవు" అని అభయమిచ్చి అంతర్ధానం అయ్యాడు.

ఈ కథను శతానందుడు జనకునికి చెప్పగా అతడు అత్యంత కుతూహలంతో "మునివర్యా! 'వృషభాద్రి' అనేపేరుకు కారణం ఇప్పటికి తెలుసుకున్నాను. మరి ఈ కొండకే "అంజనాద్రి' అనేపేరు రావడానికి కారణాలేమని ప్రశ్నించాడు. ముని సంతోషంతో అలాగే చెబుతాను అన్నాడు.

కేసరి ఒక వనచరోత్తముడు. అతని భార్య అంజన. ఆ తల్లి మతంగముని దగ్గరకెళ్ళి "మునివరేణ్యా! పుత్రహీనులకు పుణ్యగతులు లేవని అంటారు గదా! నేను పుత్రవిరహితను. ఒక వరకుమారునికి తల్లి కావాలని నా చిరకాలవాంఛ. ఈ కోరిక తీరాలంటే ఏలాంటి తపస్సు చేయాలి? అని ప్రశ్నించింది. మతంగుడు అంజనతో...

"అమ్మా పుత్రార్థివి అయిన నీ కోరిక సమంజసమే. నేను చెప్పేది విను. ఇక్కడి నుంచి పంపాసరోవరానికి తూర్పున యాభైయోజనాల దూరంలో నృసింహ ఆశ్రమం ఉంది. ఆ ఆశ్రమానికి దక్షిణదిక్కులో నారాయణాద్రి. ఆ అద్రికి దగ్గరలో స్వామిపుష్కరిణి. ఆ పుష్కరిణికి ఉత్తరదిక్కున రెండుక్రోసుల దూరంలో ఆకాశగంగ. నీవు ఆ ప్రదేశం చేరుకుని ఆ గంగలో త్రికాలస్నానం చేస్తూ పన్నెండు సంవత్సరాలు జపతపాదులు కొనసాగించు. తప్పక నీకు పుత్రోదయం సిద్ధిస్తుంది." అని ఉపాయం చెప్పాడు.

అంజనాదేవి అలాగేనంటూ మతంగ ముని ఆనతిప్రకారం నారాయణాద్రి చేరుకుంది. స్వామిపుష్కరిణిలో మునకలు వేసింది. ఆ తీర్థం దగ్గరలోనే ఉన్న అశ్వత్థవృక్షానికి ప్రదక్షిణలు చేసింది. అక్కడి వరాహస్వామికి మొక్కింది. తదనంతరం ఆకాశగంగప్రాంతానికి వెళ్ళి మతంగముని చెప్పినప్రకారం మూడు పూటలా స్నానంచేస్తూ, ఉపవాసవ్రతం పాటిస్తూ, ఒకసంవత్సరకాలం తపం కొనసాగించింది. అంజనాదేవి తపస్సును గుర్తించిన వాయుదేవుడు ప్రసన్నుడై ఒక్కొక్క మధురఫలం ఇచ్చేవాడు. అలాగే అంజనాదేవి పన్నెండేళ్ల కఠినవ్రతం పూర్తిచేసింది. వాయుదేవుడు సత్‌వీర్య గర్భితం అయిన ఫలం ప్రసాదించడంతో అంజనాదేవి గర్భవతి అయింది.

ఈ సన్నివేశమంతా అక్కడ తపస్సు చేసుకునేవారికి ఎంతగానో కలలో సాక్షాత్కరించడంతో వారెలాంటి సంశయ ఆందోళనలలో పడక, యథాప్రకారం అంజనను గౌరవప్రదంగాచూస్తూ, తపస్సు కొనసాగించారు. పదవనెల పూర్తికాగానే అంజన ఒక కుమారుని ప్రసవించింది.

గొప్పవాళ్లు తమ చేతలతో ఆదర్శవంతంగా నిలిస్తే, మూర్ఖులు తమ మాటలతోనే మూలన పడుంటారు

ఒక మహాబలుడు జన్మించాడని దేవతలందరూ పూలవాన కురిపించారు.

అంజనకు పుట్టినవాడు వజ్రదేహుడు. పెద్ద తోక కలవాడు. విశిష్టకాంతితో మెరిసేవాడు. అంతేకాదు బలస్థైర్యాదులు కలవాడు కావడంతో మునులు 'ఈ కుమారుడు ఈ జగతిలో మహాముఖ్యుడౌతాడని ఆ శిశువుకు హనుమంతుడ'ని నామకరణం చేశారు.

ఇదంతా త్రేతాయుగంలో జరిగిన సన్నివేశం. అంజన తపస్సుచేసిన స్థలం కావడం, అక్కడ ఆమెకు సత్పుత్రభాగ్యం కల్గడంకారణంగా ఆ కొండకు 'అంజనాద్రి' అనే పేరు ప్రసిద్ధి అయింది.

"మహారాజా! అంతేకాదు. సర్పరాజైన ఆదిశేషుడు వాయుదేవునిచేత పరాజితుడై ద్వాపరంలో శైలస్వరూపుడు కావడంతో ఈ కొండకు శేషాద్రి" అనేపేరు ప్రఖ్యాతి అయిందని శతానందుడు చెప్పగా జనకమహారాజు ఆదిశేషుడు ఓడిపోవడమా! వాయువు విజేత కావడమా! వారిద్దరు కయ్యానికి కాలు దువ్వడమా! వారి కలహాలకు కారణమేమిటని ప్రశ్నించగా, శతానందుడు శేష, మారుతసంవాదాన్ని సవిస్తరంగా చెప్పాడు. వైకుంఠంలో ఆదిశేషుడు హరిమందిర

### వైకుంఠపాళి
### :: 111 – సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 శ్రీ | రా | 2 మ | న | 3 వ | మి | | 4 మాం | డ | 5 వి | |
| మ | | నో | | రూ | | 6 ధ | | | త | |
| తి | | ర | | ధి | | 7 రు | క్మ | ర | థు | డు |
| | 8 సా | మ | | 9 నీ | లు | డు | | | డు | |
| 10 భ | | | 11 కౌ | | | | 12 కా | | | 13 ధ |
| ద్రా | | 14 కం | స | వ | తి | | మ | | | ర |
| చ | | | ల్య | | | | 15 దా | క్షా | 16 య | ణి |
| 17 లం | 18 క | | | | | | | | శో | |
| | 19 బం | ధు | మం | తు | డు | | 20 మ | | 21 ద | త్త |
| | ధు | | | | | | రు | | | |
| | డు | | 22 బం | గా | రు | క | డు | పు | వా | డు |

ద్వారపాలకుడుగా తన ధర్మాన్ని చక్కగా నెరవేరుస్తున్నాడు. ఒక రోజు వాయుదేవుడు విష్ణుమందిరంద్వారందాకా వచ్చి లోపలికి వెళ్ళాలని తహతహలాడుతుంటే శేషుడు...

"వాయుదేవా! నీవు మందిరంలోపలికి వెళ్ళడానికి వీల్లేదు. అక్కడే నిలు! నిలు!" అని గద్దించాడు. ఆ గద్దింపుతో వాయుదేవుడు అవాక్కయ్యాడు. "శేషా! నేను వనజాక్షుని దర్శించడానికే వెళుతున్నాను. నీవు నన్ను ఆపడమేమిటి? నన్ను ఆపేటంతటి మొనగాడివా! ఏమిటి నీ గొప్ప? నన్ను తక్కువగా అంచనా వేసినట్టున్నావు. సరే నేను తక్షణం రమాపతిని దర్శించాలి" అంటూ శేషుని తోసుకునిపోబోయాడు. అప్పుడా శేషుడు బుసకొడుతూ, కళ్ళెర్రజేస్తూ మందిరంకేసి వెళుతున్న వాయుదేవుని మెడపట్టి తోసేశాడు.

ఈ చేతను వాయుదేవుడు ఊహించలేదు. అయినా తమాయించుకుని

"నాగకులాధమా! నన్ను మెడబట్టి తోస్తావా! నేను నీలాగే చేస్తే ఏమవుతావో ఊహించుకో, పోతేపోనీ ఇకనైనా పక్కకు తప్పుకో" అని గద్దించాడు.

"అనిలా! ఇది హరి అంతఃపురం. నీవు అన్యుడివి. నిన్ను లోపలికి పోనీయను. కాకపోతే స్వామికి నీరాకగురించి నివేదిస్తాను. హరి అనుజ్ఞ ఇస్తే నేనే నిన్ను వెంటబెట్టుకుని వెళ్తాను. అంతేగానీ, ఇప్పటికి నేను మాత్రం నిన్ను లోపలికి పోనివ్వను" అని ఖరాఖండిగా చెప్పాడు.

ఈ జవాబుతో వాయుదేవుడు శేషునికి బుద్ధి వచ్చేలా

'శేషా! అంతఃపురపాలకుడవని విర్రవీగుతున్నావా? అంతఃపురాలలో పిల్లి ఉంటుంది. అంతమాత్రాన ఏనుగుకన్నా పిల్లి ఎక్కువా? నన్ను లోపలికి పోనివ్వనన్నావు. సరే నేను నీ దగ్గరికి రాను. నీవెక్కడున్నావో అక్కడే ఉండు. నేను ఉన్నచోటనే ఉంటాను. ఇది నాకొక అవమానం కానే కాదు. అధమా! మరీ మిడిసిపడవద్దు' అని గట్టిగా చెప్పాడు.

వాయుదేవునిమాటలతో శేషుడు రెచ్చిపోయాడు. అతనికున్న ఆత్మాభిమానం కోపావేశాన్ని పెంచింది.

"మారుతా! నీవెవరు? నాకు నీవు ఆహారమని మరచి పోతున్నావు. నీ గొప్పతనం నా ముందు ప్రకటించుకోకు" అన్నాడు.

(ఇంకా ఉంది)




# అభీష్టసిద్ధి క్షేత్రం తిరుచెందూర్

- శ్రీ ఎం.రవితేజ

"షణ్ముఖ నాథ - సుబ్రహ్మణ్యం
స్వామినాథ - సుబ్రహ్మణ్యం
ప్రణవ స్వరూప - సుబ్రహ్మణ్యం
తిరుచెందూర్ - సుబ్రహ్మణ్యం
తిరుత్తణి - సుబ్రహ్మణ్యం"

అని షణ్ముఖనాథుని భక్తులు కీర్తిస్తారు.

తిరుచెందూర్‌క్షేత్రం తమిళనాడులోగల కన్యాకుమారికి దాదాపు 100 కి.మీ.దూరంలో ఉన్నది. ట్యూటికోరంజిల్లాలో సముద్రపుఒడ్డున గల కొండపై స్వామి వెలసినట్లు ప్రసిద్ధి. ఇది స్వామియొక్క ఆరుఅంశలలో రెండవఅంశకు సంబంధించిన దేవాలయం. ఈ ఆలయంలోని గర్భగృహం ఒక చిన్నగుహలో ఉంటుంది. ఇక్కడ స్వామి ఆసనంపైన కూర్చుని సతీసమేతంగా దర్శనం ఇవ్వటం ఇక్కడి ప్రత్యేకత. అంతేకాక పన్నెండుచేతులతో నెమలిపై స్వారీచేస్తూ ఆరుముఖాలదేవతగా ఆలయగోడలపై చిత్రీకరించబడి ఉంటుంది.

తారకాసురుడు అతని సోదరుడైన శూరపద్ముని సంహరించడంకోసం స్వామి ఇక్కడ విడిది చేశాడని స్కాంద పురాణం చెబుతున్నది. బ్రహ్మవరగర్వితుడైన తారకాసురుడు దేవేంద్రుని, దేవతలను, మునులను హింసించి బాధిస్తున్నాడు. ఆ రాక్షసునిబాధలను భరించలేక దేవతలందరూ ముందుగా బ్రహ్మను, మహావిష్ణువును ప్రార్థించారు. వారందరూ కలసి పరమేశ్వరుని ప్రార్థించగా పార్వతీపరమేశ్వరులకు ఉదయించిన కుమారునివలనమాత్రమే తారకాసురునికి మరణం సంభవిస్తుందని బ్రహ్మ చెప్పగా, పరమేశ్వరుడు ఆ బాధ్యతను కుమారస్వామికి అప్పగించాడు. కుమారస్వామి పార్వతీదేవిని గురించి తపస్సు చేయగా ఆ జగన్మాత ఆదిశక్తిరూపాన ప్రత్యక్ష మైంది. ఆ తల్లి తన శక్తిని అంతా ఒక బల్లెంలో నిలిపి కుమారునికి ప్రసాదించింది. ఆ తర్వాత త్రిమూర్తులు, మిగిలిన దేవతలందరూ కలిసి వారి వారి శక్తులను అన్నింటిని ఆ ఆయుధమున పొందుపరిచారు.

కుమారస్వామి తారకాసురునితో యుద్ధం చేసి తల్లి ప్రసాదించిన శక్తి ఆయుధంచే వానిని సంహరించాడు. ఈ తారకాసురసంహారం జరిగిన స్థలం తిరుచెందూరు. తారకాసురసంహారం జరిగిన తరువాత అతని సోదరుడగు శూరపద్ముని సంహరించడంకొరకు సుబ్రహ్మణ్యుడు ఇక్కడ విడిదిచేసి పరమశివుని పూజించిన దివ్యక్షేత్రం. ఇక్కడ శూరపద్మాసురుడు అనే రాక్షసుడు షణ్ముఖుని యుద్ధంలో గెలవలేక పారిపోయి ఒక మామిడిచెట్టురూపాన్ని పొందాడు. స్వామి శక్తిఆయుధంతో ఆ చెట్టుని మధ్యకు రెండుగా చీల్చాడు. అప్పుడా రాక్షసుడు స్వామిని శరణువేడగా ఆ చెట్టులో ఒక భాగం కుక్కుటముగా, రెండవభాగం నెమలిగా మారాయి. అప్పుడు స్వామి వాటిలో నెమలిని వాహనంగా, కుక్కుటమును ధ్వజంగా చేసుకొని వాటికి మోక్షం ప్రసాదించాడు.

రాక్షససంహారం కావించిన ఆ బల్లెం "వేల్ ఆయుధము", "శక్తి ఆయుధము" అను పేర్లతో భగవంతునిచేతిలోనుండి పూజలు అందుకుంటున్నది. అందుకే స్వామిని వేలాయుధుడని కూడా కీర్తిస్తారు.

ఇక్కడ వెలసిన స్వామి సౌందర్యమును వర్ణించటం అసాధ్యం. ఇక్కడ స్వామి ముగ్ధమోహనరూపంతో, ద్వాదశహస్తములతో, ఆయుధములతో నెమలిపై స్వారీచేస్తూ సతీసమేతంగా దర్శనమిస్తాడు. ఇక్కడ స్వామిని సేవిస్తే ఎంతటి అనారోగ్యసమస్యలైనా తొలగిపోతాయని భక్తులనమ్మకం.

ఇక్కడ స్వామివారి విబూదికి అత్యంత మాహాత్మ్యమున్నది. ఇక్కడ స్వామికి చేసే విబూది అభిషేకం అత్యద్భుతం. స్వామివారికి అభిషేకంచేసిన విబూదిప్రసాదాన్ని ఇంటికి తెచ్చుకొని పూజామందిరంలో ఉంచుకుంటే భూత, ప్రేత, పిశాచ, గ్రహబాధలు ఉండవు. అంతేకాక శత్రుబాధలు



నశించిపోతాయి. ఈ విబూదిని సేవించడంవలన దీర్ఘకాలిక చర్మవ్యాధులు సమసిపోతాయి. నాగదోషమున్నవారు ఈ క్షేత్రం దర్శిస్తే ఆ దోషం పోయి వారి కోరికలు నెరవేరతాయి.

ఒకసారి స్వామిని దర్శించడానికి సాక్షాత్ శంకర భగవత్పాదులవారు ఈ ప్రదేశానికి విచ్చేశారు. ఆయన ఆలయంలోపలికి వెళ్లకుండా స్వామిదర్శనం చేసుకోకుండా ఆలయం వెలుపలనే ధ్యానముద్రలో కూర్చున్నారు. అలా కూర్చున్న శంకరభగవత్పాదులకు ధ్యానంలోనే స్వామిదర్శనం అయింది. స్వామిని దర్శించిన శంకరాచార్యులవారు

"సదా బాల రూపాపి విఘ్నాద్రి హంత్రీ
మహాదంతి వక్త్రాపిపంచాస్యమాన్యా!
విధీంద్రాది మృగ్యా గణేశాభిధానే
విధత్తాం శ్రియం కాపి కల్యాణమూర్తిః!!"

అంటూ గణేశుని ప్రార్థనతో ప్రారంభించి, ముప్పై మూడు శ్లోకములలో భుజంగస్తోత్రం చేసి సుబ్రహ్మణ్యస్వామిని స్తుతించారు. నిత్యము ఈ స్తోత్ర పఠనంవలన మనలను, మన వంశాలను పీడించే కొన్ని దోషాలనుండి నివారణకూడా కలుగుతుందని అంటారు.

ఇక్కడ సుబ్రహ్మణ్యుని ఆలయమేకాక శ్రీభూనీళా సమేతకృష్ణస్వామిఆలయం, విఘ్నేశ్వరాలయం, శివుడు, విష్ణువు, సరస్వతిదేవి, వివిధదేవతలు కొలువైన అనేక ఆలయాలకు నెలవైన ప్రదేశం తిరుచెందూర్.

ఇక్కడ ఆలయంలో ప్రతిరోజు స్వామికి షట్కాలములలో అర్చనలు, పూజలు నిర్వహింపబడతాయి. సంవత్సరానికి రెండుసార్లు స్వామికి బ్రహ్మోత్సవాలు జరుపుతారు. అంతేకాక ఇక్కడ స్వామికి భక్తులు సంవత్సరం పొడుగునా కావళ్లు సమర్పిస్తారు. ఈ కావడిలో పాలు, నెయ్యి, తేనె, విబూది, పూలు, పళ్ళు తీసుకునివచ్చి స్వామి దర్శనం చేసుకొని, స్వామికి సమర్పిస్తే దాంపత్యదోషాలు తొలగుతాయని, సత్సంతానం కలుగుతుందని భక్తుల ప్రగాఢవిశ్వాసం. మార్గశిరమాసంలో వచ్చే స్కంధషష్ఠికి స్వామికి ఆరురోజులు బ్రహ్మాండమైన ఉత్సవాలు జరుగుతాయి. వివిధప్రాంతాలనుండి వచ్చిన అనేకమంది భక్తులు ఆరురోజులు ప్రాంగణంలోనే విశ్రమిస్తారు. ఈ సమయంలో రైతులుకూడా తమ తొలిపంటను స్వామివారికి సమర్పించడం ఇక్కడి సంప్రదాయం. ఈ ఆలయం అందమైన శిల్పాలతో అలరారుతూ సముద్రతీరాన ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రశాంతతతో, ఆధ్యాత్మికత పరిఢవిల్లుతూ ఉంటుంది. అంతేకాక ఆలయం సముద్రతీరానఉన్నా ఆలయములోని బావినీరు కొబ్బరినీటివలే తియ్యగా ఉంటాయి. ఇక్కడ స్వామికి పీచులేని కొబ్బరికాయలు సమర్పించటం ఒక ఆచారం. ఆలయానికి వచ్చి వెళ్లే భక్తులకు గంధాన్ని, అభిషేకవిబూదిని ఆకులలో పెట్టి ప్రసాదంగా ఇస్తారు అర్చకస్వాములు.

మహిమాన్వితుడైన ఇక్కడి స్వామి మాహాత్మ్యముచేత 2006వ సంవత్సరంలో వచ్చిన సునామీకి ఆలయం ఏ మాత్రము చెక్కుచెదరకపోవడానికి కారణం స్వామి మాహాత్మ్యమేనని చెప్పవచ్చు.

"దేవాది దేవసుత దేవగణాధినాథ
దేవేంద్ర వంద్య మృదుపంకజ మంజుపాద!
దేవర్షి నారద మునీంద్ర సుగీత కీర్తే
వల్లీసనాథ మమదేహి కరావలంబమ్!!"

సర్వాభీష్టములను తీర్చే జగద్రక్షకుడు స్వామి సుబ్రహ్మణ్యుడు.



# భక్తరామదాసు

– డా॥ కే.ఎస్. ఇందిర, 98491 00248

భక్తి అనే మాటకు సమానమైన అర్థం భక్తరామదాసు. ఆధ్యాత్మికత అనే పదానికి నిండైన రూపం శ్రీరామదాసుది. కొండంతదేవుణ్ణి గుండెగుడిలో నిలుపుకోవడమే కాకుండ కోవెల కట్టించిన మహనీయుడు.

పరమభక్తాగ్రేసరుడు, వాగ్గేయకారుడు అయిన ఈయన అసలుపేరు 'కంచర్ల గోపన్న'. చిన్ననాటినుండే రామభక్తిని అలవరుచుకుని రామసంకీర్తనలను రచించి పాడటం మొదలుపెట్టాడు. గోపన్న తన తల్లిదండ్రులు గతించినతర్వాత విరక్తుడై ఆస్తినంతా దానధర్మాలు చేసి హైదరాబాద్ చేరుకొన్నాడు. అక్కడ ఉన్నప్పుడు శ్రీరామచంద్రుడు ఒకనాడు స్వప్నంలో కనబడి భద్రాచలంలో అక్కన్న మాదన్నలను దేవాలయం కట్టించమని ఆదేశించాడట. అంతట గోపన్న తన మేనమామలను అర్థించి భద్రాచలంలో తహసీల్దారు పదవి పొందాడు.

పదవిలో ఉన్న గోపన్న రైతులను ఆదరాభిమానాలతో చూసుకుంటూ, పన్నులరూపంలో వసూలుచేసిన డబ్బుతో అక్కడ సీతారామాలయాన్ని కట్టించాడు. సమస్త ఆభరణాలు చేయించాడు. గోపన్న భక్తి, దాన, ధర్మగుణాలు దేశమంతట వ్యాపించి ఆయన 'రామదాసు'గా ప్రసిద్ధికెక్కాడు.



రామదాసు శిస్తుతాలూకు సొమ్ముతో గుడి కట్టించేసరికి తానీషా కోపావేశాలతో జైలుశిక్ష విధించాడు. చెఱసాలలో బాధని తట్టుకోలేక 'గరుడగమన రారా, నన్ను కరుణ నేలుకోరా' అంటూ కీర్తనలు గానం చేశాడు. 'నన్ను బ్రోవమని చెప్పవే, సీతమ్మ తల్లి" అంటూ ఆమెకు మొరపెట్టుకొన్నాడు.

ఆయన చిరకాలంగా ఖైదుజీవితం అనుభవిస్తూ, అనేక కష్టాలు సహిస్తూ, ఎంతో ఆర్తిగా, ఎంతో దీనంగా– 'సీతారామస్వామి, నే చేసిన నేరములేమి' అని ఆలపిస్తూ ఉంటే కన్నీరు కార్చని హృదయం, ద్రవించిపోని మనస్సు ఉంటాయా?

శ్రీరామదాసు ప్రజాకవి. రామనామకాంతిపుంజాన్ని జగమంతా వెదజల్లిన మహనీయుడు. వీరి కీర్తనలు జాలీ, కరుణలతో నిండి ఉంటాయి. లలిత లలితమైన పదాలతో, సామాన్యపదజాలంతో, సరళమైన ధాతుశైలితో వీరి కీర్తనలు మనసుకు దగ్గరగా ఉంటాయి. తన జీవితానుభవసారాన్నంతా వడబోసి, తన హృదయవేదనంతా కలబోసి సృజించిన కీర్తనలతో నిండిన మానవతాభావమే ఆయనను గొప్ప వాగ్గేయకారుడిగా నిలబెట్టాయి.

ఈ కీర్తనల్లో సంగీతంకన్నా సాహిత్యం, భక్తికే ప్రాముఖ్యత ఎక్కువ. వీరి ముద్ర 'రామదాసు'. ప్రతి కీర్తనలోను ఈ ముద్ర ఉంటుంది. సాహిత్యవేత్తలకూ, సంగీతజ్ఞులకు, భక్తాగ్రేసరులకు అత్యంత ప్రీతిపాత్రలు వీరి కీర్తనలు. శ్రీరామదాసు కేవలం ఆలయనిర్మాణం చేసి వదిలివేయలేదు. భావితరాలను దృష్టిలో ఉంచుకుని భద్రాచలకోవెలలో జరిగే పూజావిధానాలకు రూపకల్పన చేశారు.

శ్రీరామనవమికి సీతారాములకు జరిగే కల్యాణోత్సవం లోకమంతటికీ ఆదర్శంగా మారిందంటే అది శ్రీరామదాసు తీసుకున్న నిర్ణయంవల్లనే సాధ్యపడిందన్నది నిజం. భద్రాద్రిపేరు తలిస్తే సీతారాములతోబాటు శ్రీరామదాసుకూడా గుర్తుకురావడం తథ్యం. వీరి కీర్తనలు మహాకావ్యాల్లోకూడా సాధించలేని ప్రయోజనాలను సమకూర్చాయి.

వ్యక్తిత్వ వికాసం

# వాల్మీకిరాముడు

– భారత్‌భాషాభూషణ్ ఎ. రామసుబ్బారెడ్డి,
94906 95409

ఆదికవి వాల్మీకికృతమైన రామాయణం ఒక మహాకావ్యం. ఆ మహాకావ్యం భారతీయసంస్కృతిని సామాన్య మానవునిచెంతకు తీసుకువెళ్లడమే కాదు, భారతీయ సాహిత్యమనే ఇతిహాసానికి, సమాజానికి సరిక్రొత్త మలుపునకు త్రిప్పింది. యథార్థజీవితానికి గతిశీలత, రసాత్మకత, శక్తి–స్ఫూర్తిని ఒసగింది. యథార్థజీవనచిత్రణలే రామాయణానికి సౌందర్యం.

ఎటువంటివాడు వాల్మీకిరాముడు? వాల్మీకి చేతిలోని శ్రీరాముడు దేవుడుకాదు, దానవుడుకాదు, అసురుడుకాదు, సురుడుకాదు. ఆయనగూడా మనలాగే ఎముకలు. మాంసము గల మూర్తియే. మానవుడు–దానవుడు– దేవుడే వీరి పుట్టుక సర్వము సమానమే. కాని వీరిలో మూలప్రవృత్తులే తేడా. సాత్త్వికం, రాజసం, తామసం ఈ మూడింటిలో ఎవరు దేనిని విరివిగా ఆచరిస్తారు? సాత్త్వికప్రవృత్తులు మానవుణ్ణి దేవునివరకు తీసుకువెళ్తాయి. దానిని అణిచివేస్తే రాక్షసతత్త్వంవరకు తీసుకువెళ్తుంది. వాల్మీకిరాముడు మనవంటి మానవుడే!


శ్రీరామచంద్రునిలో మానవునకుండాల్సిన తగిన ప్రవృత్తులు, రతి–హర్షం, శోకం–తేజస్సు–విస్మయం– క్రోధం జుగుప్సా ఇత్యాది వాటితోపాటు దుర్బలత్వంగూడా ఉంది. శ్రీరాముని జననం విఖ్యాతి గాంచిన ఇక్ష్వాకులవంశమందు జరిగింది. ధర్మం– సత్యసంధత–శౌర్యం–పరాక్రమం–ధైర్యం ఇత్యాది ఉత్కృష్టమైన గుణాలు సహజసిద్ధంగా అబ్బాయి. శ్రీరామునిజీవితం నిరంతరం గతిశీలనం, వికాసశీలనమైనట్టిది. మనజీవితంలో ఎదురయ్యే సంఘటనలు ప్రతిఒక్కటిగూడా మనపై ముద్రవేస్తాయి. ఆపదలన్నీ మనకు ఒకవిధంగా శిక్షణనిస్తాయి. వివేకంతో కూడిన ఆలోచన, జీవనగమనమును మెరుగుపరుస్తుంది. రామునికి కష్టాలు కలగడంతో అపరిమితమైన క్షమత, సత్యసంధత, కర్తవ్యనిష్ఠ, వ్యవహారకుశలత తోడయ్యాయి.

వాల్మీకి సృష్టించిన రాముని అంతరాత్మ మనలాగే ఉంటుంది. ఆయనగూడా మనలాగే యోచించాడు. గంగానదిని దాటునపుడు, ఏకాంతంగా గడిపినపుడు తన తండ్రిని తలచుకొని ఇలా అనుకున్నాడు రాముడు మదిలో.

పురుషార్థములు మూడింటిలోను ధర్మ, అర్థ, కామముల నీడనే ఉన్నాడు. దుష్టబుద్ధిని ఏ మాత్రం దరి చేరనివ్వక కైకేయి విషయమందు రాముడు యోచించియే ఉన్నాడు. దీనివల్ల మనకు తెలిసిందేమంటే అనుమానం, ఈర్ష్య, సందేహం– ఈ మూడు ఒక గొప్ప ఆత్మనుగూడా దెబ్బతీస్తాయని మనకు వ్యక్తమౌతుంది. రాముడు స్వగతము చెప్పుకున్న పలుకులు గమనిస్తే ఆయన మదిలోని భావాలు ఎటువంటివో మనకు అవగతమౌతాయి.

వాల్మీకిరాముడు కష్టాల్లో మునిగి శంకాగ్రస్తుడయ్యాడు. ఓర్పును పోగొట్టుకున్నాడు. అప్పుడు లక్ష్మణుడు ఓదారుస్తూ ఆయన దివ్యగుణాలను స్మరణకు తెచ్చాడు. వ్యథలు, అమితమైన బాధలే రామచంద్రుని జీవితానికి గౌరవం, రామాయణానికి సౌందర్యాన్ని కలిగించాయి. సామాన్యమానవుని మొదలు మహామనీషి హృదయాలవరకు రామాయణం హత్తుకుపోయింది. ఎందుకంటే రాముడు ఏది అధర్మం అని తలుస్తాడో దానిని తన నైతికబలంచేత అణచివేసి ధర్మానికి నూతనశోభను కలిగించాడు.

వాల్మీకిమహర్షి గొప్ప విప్లవకారుడు. ప్రగతిగామి. కోదండపాణి శ్రీరామచంద్రుడు శౌర్యం, ఆత్మబలంచేతనే అస్థిరత్వం గల దేశానికి స్థిరత్వం కలిగించాడు. ఒక యుగమందే కాదు యుగయుగాలనుండి ఈ “రామమంత్రము”, “రామాయణసందేశం” దేశాన్ని రక్షిస్తూ వస్తూంది. అదియే వాల్మీకిమహర్షి సృష్టించిన రామునియొక్క గొప్పశక్తి!!



108 దివ్యదేశాలు

# తిల్లైతిరుచ్చిత్తిరకూటం

## (చిదంబరం)

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

**108** దివ్యదేశాలలో తిల్లైతిరుచ్చిత్తిరకూట దివ్యదేశం ప్రసిద్ధిగాంచినది. తెన్‌పులియూర్‌కోవిల్, తిల్లైవనంకోయిల్, చిదంబరం అనే పేర్లతో ఈ దివ్యదేశం వ్యవహరించబడుతున్నది. ఈ దివ్యదేశం తమిళనాడులో చిదంబరం అనే పట్టణంలో వెలసిఉన్నది. కాట్టుమన్నార్ కోయిల్ అనే చోటునుండి పడమర 26 కి.మీ.దూరంలో శ్రీముష్ణం అనే క్షేత్రంనుండి ఉత్తరపడమర తిరువహీంద్రపురం అనే దివ్యదేశానికి ఉత్తరంలో 48 కి.మీ.దూరంలో సుమారు 40ఎకరాలవిస్తీర్ణంలో నాలుగుప్రాకారములతో, నాలుగు రాజగోపురాలతో ప్రతిఒక్కరు ఆశ్చర్యానికి లోనయ్యేరీతిలో ఈ దివ్యదేశం అత్యంత వైభవోపేతంగా అలరారుతోంది.

ఈ దివ్యదేశం మూలమూర్తి, తూర్పుదిశను భోగ(యోగ) శయనభంగిమలో గోవిందరాజన్ అనే దివ్యనామంతో వెలుగొందుతున్నాడు. ఇక్కడ రెండు ఉత్సవమూర్తులు భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఇరువురు కూర్చున్నభంగిమలో ఉపదేశముద్రతో దేవాదిదేవన్, పార్థసారథి అనే తిరునామములతో ఒకరు వేంచేసి ఉండగా, మరొకరు చిత్తరకూడత్తుళ్ళాన్ అనేపేరుతో ఉభయదేవేరులతో విలసిల్లు తున్నాడు. అమ్మవారు ప్రత్యేకసన్నిధిలో పుండరీకవల్లి అనే పేరుతో కొలువుదీరి ఉన్నారు. సాత్త్వికవిమానం, పుండరీకపుష్కరిణి ఈ దివ్యదేశంలో శోభిల్లుతున్నాయి.

### విశేషము-

అష్టాధ్యాయి అనే సంస్కృత వ్యాకరణ సూత్రకర్త మహర్షి పాణిని ఈ దివ్యదేశంలో వేంచేసిఉన్న పరమశివుని ఆనందతాండవ సముద్భూతమైన డమరుకంనుండి వెలువడినటువంటి శబ్దాలలో అఇఉణ్ అనే 14 సూత్రాలను రచించారని అలాగే సాహిత్యశాస్త్రంలో ప్రసిద్ధిపొందిన నాట్య శాస్త్రమనే గ్రంథాన్ని భరతమహాముని ఈ క్షేత్రంలోనే రచించినట్లు ఐతిహ్యం.

భగవంతునియొక్క 5రూపాలలో వ్యూహరూపం, విభవరూపం ఈ రెండూకూడా ఇక్కడ మనకి కనిపిస్తాయి. మూలమూర్తి భోగసాయిగా, ఉత్సవమూర్తి కూర్చున్నభంగిమలో మనకు ఈ దివ్యదేశంలో దర్శనమిస్తున్నారు. తిరుమంగైఆళ్వారులు ఇరవైపాశురాలలో, కులశేఖరఆళ్వారులు పదిపాశురాలలో ఈ గోవిందరాజుస్వామిని మంగళాశాసనం చేయడం విశేషం.

### 1) స్థలపురాణం -

ఈ దివ్యదేశంగురించి స్థలపురాణం భవిష్యోత్తర మరియు బ్రహ్మాండపురాణాలలో కనిపిస్తుంది. తంజకుడు, గజముఖుడు, దండకుడు అనే ముగ్గురురాక్షసులు కఠిన తపస్సుతో విపరీతవరాలను పొంది తత్ఫలితంగా దేవతలందరినీ హింసిస్తూ ఉండగా, దేవతలు భగవంతుని శరణాగతి వేడగా దేవదేవుడు తన వాహనమైన గరుత్మంతుని ద్వారా తంజకగజముఖులని సంహరింపచేసి దండకుణ్ణి తానే వధించాడు. అయినప్పటికీ ఆ ముప్పురియొక్క చెల్లెళ్ళు చిల్లీ, దిల్లీ అనేటటువంటివారు భగవంతునిగూర్చి కఠిన తపస్సుచేసి భగవదనుగ్రహంతో శ్రీముష్ణం అనే దివ్యక్షేత్రంలో చిల్లీ కాపలా దేవతగా, ఈ తిల్లైతిరుచిత్తరకూటంలో దిల్లీ నీడనిచ్చే ఒక చెట్టుగా వరం పొందినట్లు స్థలపురాణం చెప్పడం జరుగుతున్నది.

| | | |
|---|---|---|
| మూలమూర్తి | : | భోగశయనుడు, గోవిందరాజస్వామి |
| ఉత్సవర్లు | : | దేవాదిదేవుడు మరియు చిత్తిరకూడత్తుళ్ళాన్ |
| అమ్మవారు | : | పుండరీకవల్లి |
| తీర్థం | : | పుండరీకపుష్కరిణి |
| ప్రత్యక్షం | : | పాణిని, పతంజలి, పుండరీకఋషి, కణ్వఋషి |
| మంగళాశాసనం | : | తిరుమంగైఆళ్వారులు, కులశేఖర ఆళ్వారులు |
| ఆగమం | : | వైఖానసం |

**2) స్థలపురాణం-**

కళింగరాజు అనే ఒక మహారాజు ద్వాపరయుగంలో కఠోరతపస్సుద్వారా కావేరుడు అనే పుత్రుణ్ణి పొందాడు. కావేరుడు చేసిన తపఃఫలంగా పవిత్రమైన కావేరీనది అతనికి కూతురైనది. కావేరుని తండ్రి కళింగరాజు ముక్తిని పొందక అవస్థపడుతుండగ, కావేరుడు తండ్రికొరకు భగవదాజ్ఞతో ఈ తిల్లైవనానికి వచ్చి తపస్సు చేసి తన తండ్రికి ముక్తిని ప్రసాదింపజేశాడు.

**3) స్థలపురాణం-**

వీరశైవుడైన కులోత్తుంగచోళునికాలంలో మూలమూర్తిని సముద్రంలో పడవేయగా, ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి భక్తులచేత తిరుపతికి తీసుకునిరాగా విజయనగరసామ్రాజ్యరాజైన అచ్యుతరాయనికాలంలో భగవత్ రామానుజులద్వారా తిరుచ్చిత్తిరకూడ గోవిందరాజస్వామిని తిరుపతిలో ప్రతిష్ఠింపచేయడం జరిగినది. కనుక ఈనాడు తిరుపతిలో దర్శనభాగ్యాన్ని కలిగిస్తున్న గోవిందరాజస్వామివారు తిరుచ్చిత్తరకూడ భగవానుడు. ఇలా ఎన్నో స్థలపురాణాలు మనకు కనిపిస్తాయి. అలాగే కణ్వమహర్షి ఈ స్వామి అనుగ్రహంచేత ముక్తిని పొందాడు. పుండరీకవల్లి నాయికాసమేతుడైన గోవిందరాజస్వామిని దర్శించి భక్తులు తమ అభీష్టాల్ని పొందగలరని ఆర్యోక్తి.

**ధ్యానశ్లోకం**

దివ్యశ్రీచిత్రకూటే కనకమయసభా తత్ర గోవిందరాజః
మోదాత్ అద్యాపి నృత్యత్ పశుపతివినుతః భోగిభోగే శయానః
తత్ర శ్రీపుండరీకా అత్యభిమతఫలదా సాత్వికం తద్విమానం
తస్మిన్ కణ్వప్రసన్నో హరిదిగభిముఖః తత్పరః పుండరీకమ్॥

**గ్రంథసమీక్ష**

## శ్రీరామదర్శని

**(సరళసుందర వచన కథనం)**

రచయిత- జె.ఎస్.మూర్తి (విహారి); సైజు-1/8 డెమ్మీ; పుటలు-88; వెల-రూ.150/-; చిరునామా-ప్లాట్ నెం.103, జె.బ్లాక్(టెర్రా), రాజపుష్ప ఆత్రేయ, గోల్డెన్ మైల్ రోడ్, కోకపేట, హైదరాబాదు-500075. సెల్-98480 25600.

మానవజీవితాన్ని సంస్కరించగల మహాకావ్యం "శ్రీరామాయణం. మానవహృదయాలనుంచి ఎప్పటికీ చెరగని కథ. ''అమ్మానాన్నల అనురాగం; పుత్రుల అభిమానం, అన్నదమ్ముల అనుబంధం, భార్యాభర్తలసంబంధం, గురుభక్తి, శిష్యానురక్తి, స్నేహఫలం, ధర్మబలం, వినయంతో ఒదగడం, వివేకంతో ఎదగడం జీవకారుణ్యభావన, ప్రకృతిలాలన"-ఇలా జీవితపార్శ్వాలనెన్నింటినో పట్టి చూపిస్తుంది రామాయణం. ఇటువంటి వాల్మీకిరామాయణాన్ని ఆబాలగోపాలం చదివి అర్థం చేసుకోగల సరళవచనంలో బాలసాహిత్యరచనగాకూడా భాసించగలభాషలో, ఎనభైఎనిమిది పుటల్లో అందించడం అనేది అరుదైన విశేషం. అలాగని ఎక్కడా రామాయణ గత ఏ విశేషాంశాన్ని వదిలిపెట్టకుండా ఇంత క్లుప్తసుందరంగా అందించడం 'విహారి' గారి ప్రతిభా విశేషం.

తెలుగుభాషలో అతిసుందరంగా, ద్రాక్షాపాకంలో, సులభశైలిలో ఉన్న వచనగ్రంథమే 'శ్రీరామదర్శనం'.

వీరు రచించినదే మరొక గ్రంథం...

## శ్రీరామాయణసూక్తిసుధ(పద్యకృతి)

సైజు-1/8 డెమ్మీ; పుటలు-60; వెల-రూ.100/-;

ఇందులో ఇతివృత్తం శ్రీరామాయణంలోని సూక్తులను ఏర్చి చేర్చికూర్చి పద్యకావ్యంగా మలచారు. మొత్తం 212 పద్యాలు వ్రాశారు. అలతి అలతి పదాలతో అనల్పార్థన రచన చేసిన కావ్యమిది. సరళసుందరంగా, తేటతెలుగులో తేటగీతులరూపంలో రచియింపబడిన పద్యకృతి "శ్రీరామాయణసూక్తిసుధ". ప్రతి ఒక్కరు చదువవలసిన కావ్యం. ఇందులో చెప్పిన ఉత్తమధర్మాలను ఆచరిస్తే మనిషి మనీషిగా ఎలా ఎదగగలడో నేర్పుతుంది. చిన్నచిన్న పాత్రలద్వారా సమున్నతసందేశాన్నిస్తుంది. "రామో విగ్రహవాన్ ధర్మః సత్యధర్మ పరాక్రమః" అన్న మహితోక్తిని మారీచుని నోటి నుండి వాల్మీకి పలికించాడు. రామునివంటి ఆదర్శమూర్తి, రామాయణంవంటి ఆదర్శకావ్యం 'నభూతో నభవిష్యతి'. మనిషి ఉన్నంతకాలం రామాయణం ఉంటుంది.

వాల్మీకిరామాయణకథను సంక్షిప్తంగా అందించే ప్రయత్నమిది. సమున్నతసమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ముందు తరాల స్ఫూర్తికోసం చేసిన రచన ఇది.

**- శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు**

# మహాకుంభమేళా వైభవం

- డా॥ మైలవరపు లలితకుమారి



మాఘమాసంలో నిర్వహింపబడిన మహాకుంభమేళా ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మికసంగమం. ఈ మేళాలో ప్రత్యేకంగా నాగసాధువులు, సాధువులు విరివిగా పాల్గొంటారు. వారు శిబిరాలు వేసుకుని, ఊరేగింపులు చేస్తూ ఒక జాతరని తలపిస్తుందీ ప్రాంతం. దేశవిదేశాలనుంచి, పల్లెలు, పట్టణాల నుంచి వచ్చే జనం చిన్నపెద్ద, ధనిక పేద తేడా లేకుండా జరుపుకునే పండుగలాంటి జాతర.

కుంభం అంటే కుండ అని అర్థం. దీనినే కలశం అని కూడా అంటారు. 12సంవత్సరములకొకసారి గ్రహగతులననుసరించి నదులకు పుష్కరాలు జరుపుకున్నట్లే కుంభమేళానుకూడా గ్రహగతులను అనుసరించి జరుపుతారు.

దేవతలు శక్తిమంతులు కావడానికి అమృతంకోసం క్షీరసాగరాన్ని చిలకటానికి సిద్ధపడ్డారు. అమృతాన్ని చెరిసగం పంచుకోవాలన్న ఒప్పందంతో దేవతలు, రాక్షసులు ఇరువురు మంథరపర్వతాన్ని కవ్వంగా, సర్పరాజు వాసుకిని కవ్వపుతాడుగా చేసుకుని క్షీరసాగరాన్ని మథించడానికి సిద్ధపడ్డారు. చివరికి వారి ప్రయత్నం ఫలించి అమృతకలశం లభించింది. అప్పుడు ఇద్దరిమధ్య పోరు ప్రారంభమయ్యింది. అప్పుడు మహావిష్ణువు ఈ అమృతకుంభాన్ని తీసుకు వెళుతుండగా హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్, ప్రయాగలలోని నదులలో అందులోనుంచి కొన్ని బిందువులు పడ్డాయి. నాటినుంచి కుంభమేళాపేరుతో ఇక్కడ జాతర జరుగుతున్నది అంటారు.

సూర్యుడు, బృహస్పతిగ్రహాలయొక్క స్థానాల ఆధారంగా ఈ వేడుక జరుపుతారు. సూర్యుడు, బృహస్పతి సింహరాశిలో ఉన్నప్పుడు కుంభమేళా నాసిక్‌లోని త్రయంబకేశ్వర్‌లోను, సూర్యుడు మేషరాశిలో ఉన్నప్పుడు హరిద్వార్‌లో, బృహస్పతి వృషభరాశిలో, సూర్యుడు మకరరాశిలో ఉన్నప్పుడు ప్రయాగలోను, బృహస్పతి, సూర్యుడు వృశ్చికరాశిలో ఉన్నప్పుడు ఉజ్జయిని లోను కుంభమేళా నిర్వహించడం జరుగుతుంది.

సాధారణంగా కుంభమేళా ప్రతి నాలుగు సంవత్సరాలకొకసారి, అర్ధ కుంభమేళా ప్రతి ఆరు సంవత్సరాలకొకసారి హరిద్వార్ ప్రయాగలలో జరుగుతుంది. పూర్ణకుంభమేళా ప్రతి 12 సంవత్సరాలకొకసారి ప్రయాగ, హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్‌లలో జరుగుతుంది. 12 పూర్ణకుంభమేళాలు పూర్తయినతర్వాత అంటే 144 సంవత్సరాలకు ఒకసారి ప్రయాగరాజ్‌లోని త్రివేణిసంగమంలో మహాకుంభమేళా నిర్వహించబడుతుంది. ఇది ఈ సంవత్సరం మకరసంక్రమణం ఉత్తరాయణ పుణ్యకాలంనుండీ అంటే జనవరి 14వ తేదీనుండి మొదలై 45 రోజులపాటు నిరాఘాటంగా జరుపబడి ఫిబ్రవరి 26 మహాశివరాత్రీ, ఆ మరునాడు 27న మాఘ అమావాస్యవరకూ కొనసాగింది. ఈ 45 రోజులపాటు మనదేశంలోని వివిధ ప్రాంతాలనుంచే కాక ప్రపంచంలోని అనేకదేశాల నుంచి కూడా జనం తండోపతండాలుగా వచ్చి ప్రయాగలోని త్రివేణిసంగమంలో పవిత్రస్నానాలు ఆచరించి ఆరోగ్యాన్ని, ఆధ్యాత్మికశక్తిని పొందారు. దాదాపుగా ఈ సంవత్సరం జరిగిన మహాకుంభమేళాకి దాదాపు అరవైకోట్లమంది పుణ్యస్నానాలు ఆచరించినట్లుగా చెబుతున్నారు. అంతేకాక ఇక్కడ పితృదేవతలకు తర్పణాలు వదలటంవలన పితరులు పుణ్యలోకాలకు చేరుకుంటారని ఒకనమ్మిక.

మహాకుంభమేళా 45రోజులు తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయనిర్వాహకులు ప్రయాగ్‌రాజ్‌లో నమూనా ఆలయాన్ని ఏర్పాటుచేశారు. ఆలయాన్ని ఏర్పాటు చేయటమేకాక స్వామికి నిత్యార్చనలు, కల్యాణోత్సవాలు వైభవోపేతంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలు తి.తి.దే. వారి శ్రీవేంకటేశ్వర భక్తిఛానల్‌ద్వారా భక్తులు వీక్షించే అవకాశాన్ని కల్పించారు. మహాకుంభమేళాలో ఎక్కడెక్కడి నుంచో తరలివచ్చి పుణ్యస్నానాలు చేసిన ప్రతివారు కలియుగప్రత్యక్షదైవమైన ఆ శ్రీవేంకటేశ్వరస్వామిదర్శనంతో పునీతులయి ఆనందానుభూతిని పొందారు.

కుంభమేళా, అర్ధకుంభమేళా, పూర్ణకుంభమేళా, మహాకుంభమేళాలకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం యాత్రికుల సౌకర్యార్థం ప్రయాణ, వైద్యసౌకర్యాలు, ఆహారపానీయాలు కల్పించింది. భక్తులందరూ కూడా కుంభమేళాదర్శనంతో మానసిక ఆనందంతో దైవానుభూతిని పొందడం ఎంతో మహద్భాగ్యంగా వర్ణించొచ్చు.

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌వద్ద జరిగిన మహాకుంభమేళా పర్వదినాల సందర్భంగా 2025, జనవరి 08న తిరుమల నుండి బయలుదేరిన శ్రీవారి కల్యాణరథానికి పచ్చజెండా ఊపి ప్రారంభించిన తి.తి.దే.పాలకమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు మరియు తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్. అలాగే అక్కడ 2025, జనవరి 12న తిరుమల తిరుపతి దేవస్థానంవారిచే ఏర్పాటు చేయబడ్డ తిరుమల శ్రీవారి నమూనా ఆలయంలో వైభవంగా జరిగిన కైంకర్యాలు, విశేషార్చనల దృశ్యాలు































మహాకుంభమేళా పర్వదినాల సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్ వద్ద ఏర్పాటు చేయబడ్డ తి.తి.దే.వారి తిరుమల శ్రీవారి నమూనా ఆలయంలో 2025, ఫిబ్రవరి 03న వసంతపంచమి సందర్భంగా సరస్వతీ అలంకారంలో కొలువై ఉన్న తిరుమల శ్రీవారు. అలాగే, ప్రయాగరాజ్‌లోని దశాశ్వమేథఘాట్ గంగానదివద్ద 2025, జనవరి 16న శ్రీదేవిభూదేవిసమేత శ్రీనివాస స్వామికి వైభవంగా జరిగిన స్నపన తిరుమంజన కార్యక్రమవైభవం మరియు చక్రస్నానం వైభవ దృశ్యాలు.



మహాకుంభమేళా పర్వదినాల
సందర్భంగా
2025, జనవరి 18న
ప్రయాగరాజ్‌లోని
తిరుమల శ్రీవారి నమూనా ఆలయంలో
వైభవంగా జరిగిన
శ్రీనివాసకల్యాణోత్సవం
దృశ్యాలు



# జోల-లాలిపాటల మధురిమలు

- డా॥మైలవరపు లలితకుమారి

జోలపాటలు లాలిపాటలు అని రెండురకాలుగా చెబుతారు. ఈ పాటలు మహిళల ముఖతః వెలువడి ఒకరి నుండి మరొకరు నేర్చుకున్నవే. జానపదసాహిత్యంలో ఇవి అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇవి మౌఖిక సంప్రదాయసాహిత్యం అని చెబుతారు. ఈ రెండింటినీ భిన్న భిన్న సమయాలలో పాడుతారు.

చిన్నపిల్లలను నిద్రపుచ్చడానికి పాడేపాటలను జోల పాటలు అంటారు. పిల్లలు ఏడుస్తున్నప్పుడు ఏడుపు మాన్పించి, లాలించడానికి పాడే పాటలను లాలిపాటలు అంటారు. ఈ పాటలలో ఒక అందమైన లయ, తూగు ఉంటాయి. వీనిలో శబ్దాలంకారాలు ఎక్కువగా కనబడతాయి. ఊయలలో బిడ్డను పడుకోబెట్టి జోలలు పాడుతారు. బిడ్డను భుజంపై పడుకోపెట్టుకొని వీపుపై నెమ్మదిగా తట్టుతూ జోలపాడుతూ నిద్రపుచ్చడానికి ప్రయత్నిస్తారు. జోలపాటలలో ఊయలపాటలే మనకు ఎక్కువగా కనిపిస్తాయి.

**జోజో కమలదళేక్షణ**
**జోజో మృగరాజమధ్య! జోజో కృష్ణా**
**జోజో పల్లవకరపద**
**జోజో పూర్ణేందువదన! జోజోయనుచున్.**

అంటూ భాగవతంలో యశోదమ్మ బాలకృష్ణుని ఊయలలో పడుకోబెట్టి ఊపుతూ పాడిన పాటలో వాత్సల్యమును పోతనగారు అద్భుతంగా వర్ణించారు.

అలాగే అన్నమయ్య-

**జో అచ్యుతానంద జోజోముకుందా**
**లాలి పరమానంద రామగోవిందా** - అని


**తొలుత బ్రహ్మాండంబు తొట్టెగావించి**
**పలువైన ఫణిరాజు పానుపమరించి**
**చెలియదోలికలోన చేర్చిలాలించి**

అని తల్లి పిల్లలకు పాడే జోలపాటలో పౌరాణిక విషయాలెన్నో తెలిపేది. ఇది పసివాడిని నిద్రపుచ్చటానికి తల్లి ఊయల ఊపుతూ తల్లిపాడే జోలపాట.

లాలిపాటల విషయానికివస్తే పిల్లవాడు చంకదిగకుండా ఏడుస్తుంటే తల్లి ఆ పిల్లవాడి ఏడుపును ఆపటానికి ఎత్తుకొని చెట్టు, పుట్ట, చందమామని, ఎగిరేపిట్టని చూపిస్తూ లాలనచేస్తూ పాడే పాటలని లాలిపాటలు అంటారు. జోలపాటలు నిద్రపుచ్చటానికి పాడితే, లాలిపాటలు ఏడుపుని ఆపి పిల్లలను ఆడించటానికి, నవ్వించటానికి పాడేవారు.

"వటపత్రసాయికి-వరహాలలాలి" అన్నా, "లాలీజోలా లీజో-ఊరుకోపాపాయి'' అన్నా, ''చందమామరావే జాబిల్లిరావే" అన్నా ఏదైనా పసివారికి ఆనందాన్నందించే పాటలు. అంతేకాక మనవాళ్ళు ఒక ఊతపదంతో "చిచ్చో ళుళుళు" అని నాలుకతో ఒకరకమైన శబ్దాన్ని చేస్తూ పిల్లలను బుజ్జగించటానికి ప్రయత్నిస్తారు. ఆ శబ్దానికి ఆపసివాడు ఎంత ఏడుపులో ఉన్నవాడైనా ఏడుపునాపి ఆ శబ్దాన్ని ఆలకించి పకపకా నవ్వటానికి ప్రయత్నిస్తాడు, నవ్వుతాడు కూడా.

కాని కొందరు ఈ ''ఉళుళుళు'' అనే అక్షరాలపొందికకు అనేక అర్థాలనిచ్చి ఉన్నారు. ఉళుళుళు అంటే అంతా హుళక్కి అనే అర్థాన్ని కూడా పొందుపరిచారు. అంటే పసితనంలో తల్లిఒడిలో ఉండే సుఖం ఆనందం పెద్దవాడయిన తరువాత నీకు ఉండవు. అంటే బాధ్యతలు పెరిగిన తరువాత ఈ పసితనపు ఆనందాలకు దూరమవుతావనే అర్థాన్ని చెబుతారు.



"బూచివాడారార బుట్టల్లుకోరా
బుట్టలో బాబుని పట్టుకొని పోరా"

ఉళుళుళు అంటారు. నీవు భయంపడవాకు నిన్నెవ్వడయ్య ఎత్తుకోపోలేరు. నేనున్నాను అని తల్లి బిడ్డకు ధైర్యాన్నిస్తుంది.

"ఏడవకు ఏడవకు వె(ఱ్రి)నాగన్నా
ఏడిస్తే నీకళ్ళు నీలాలుకారు
నీలాలు కారితే నేనూరుకోను
పాలైన కారవే బంగారు కనుల" ॥

చిచ్చోళుళుళు అంటారు. అందులో మొదటి రెండు పాదాలు పిల్లవాడు ఏడుస్తున్నాడనే తల్లి బాధను, తరువాత రెండుపాదాలలో చక్కటి నీ కనులలో కన్నీరురానివ్వనని తల్లి చెప్పే ధైర్యం. ఇలాంటి పాటలు మన జానపదసాహిత్యంలో కోకొల్లలుగా కనిపిస్తాయి.

ఈ లాలి జోలపాటలనుపాడేటప్పుడు చరణము పూర్తి కాగానే లాలీ, లాలీ అని జోజో జోజో అనే చివర వచ్చే అక్షర శబ్దాలను 'రీ, సా" అనే (శంకరాభరణం) స్వరాలతో చేర్చి పాడతారు. 'స్వతో రంజయతీతి స్వరం" అనగా స్వరం. స్వరం ఒక్కటే తనంతట తానుగా ప్రకాశించగలదు."స రి గ మ ప ద ని" అన్న సప్తస్వరాలలో "స" మొదటి స్వరం. తరువాతి స్వరాలన్నిటికి ఇదే ఆధారం. శంకరాభరణం మానసిక ప్రశాంతతనిచ్చే రాగం. మొదటిస్వరమైన "స" ప్రశాంతతకు చిహ్నం. దాని తరువాత ఒక్కొక్క స్వరం ఒక్కొక్క స్థాయిలో పలుకుతారు. "రీ" అంటే కొంచెం పైకి పలుకుతుంది.

దానిలో 'స' లోని ప్రశాంతత తొలగి కొంత కలత వస్తుంది. తరువాత 'గ మ ప, ద, ని" అనే స్వరాలలో ఒక్కొక్కటి హెచ్చుతగ్గులతో ఒక్కొక్కరకంగా ఆలపిస్తారు. కాని చివరన మళ్లీ "స" స్వరంతో ముగిస్తారు. బిడ్డకి మొదటి స్వరమయిన "స" లో ఉండే ప్రశాంతతని తిరిగి అందించడమే దీని అర్థం. దీనికి "సా" అనే ఒక్కస్వరాన్నే నిరంతరంగా నెమ్మదిగా వినిపించడమే.

కాని ఇందువల్ల పని జరుగదు. అందుకే శంకరాభరణం జన్యురాగమయిన "నవరోజు" రాగముతో బిడ్డని నిమురుతూ చరణం చివర 'లా' 'రీ' అంటే 'లాలీ' అనే స్వరాన్ని నిలుపుతారు. ఈ స్వరాన్ని విన్నప్పుడు బిడ్డ తలనిమిరినట్లై, తరువాత "లి" అనే అక్షరంతో ప్రశాంతతని పొందుతాడు. ఈ రెండుస్వరాలు బిడ్డని ప్రశాంతమైన నిద్రలోకి దింపుతాయి. ఇలాంటి రాగాలాపనలతో చరణాలను ఆలాపనచేస్తే బిడ్డ ప్రశాంతంగా పడుకుంటాడు. "రీసా" అనే స్వరాలు "జో, జో" అనే సమానాక్షరశబ్దాలకంటే "లాలీ" అనే భేదాక్షరశబ్దాలతో చక్కగా అమరిపోతాయి. 'లా' లోని అకార దీర్ఘము, తనవలనే కలతని ఇముడ్చుకున్న 'రీ' తోను, 'లీ' లోని ఇకార దీర్ఘము తనవలె ప్రశాంతమైన 'సా' తోను కలిసిపోతాయి. ఈ సంగీతంలోని సప్తస్వరాలు తొలిపాటలు, జోలపాటలలో ఇమిడిపోయి పసివారికి ప్రశాంతతను కలిగిస్తాయి.

భగవంతుడికి సైతం ఏకాంతసేవసమయంలో పాడే గీతాలను లాలిపాటలుగా చెప్పవచ్చు. అందుకే అన్నమయ్యగీతాలలో ఈ లాలిపాటలు మనకు కనిపిస్తాయి.

లాలి లాలి లాలి- లాలమ్మ లాలి
లాలి యిందిరగూడి- లాలమ్మ లాలి
పాల మున్నీటిపై- ఫణిరాజు తొట్టెలలో
బాలవేదపు పఱపు- బాయలాలి
మేలి బంగరురేక- మించుమేల్కట్లలో
కాలమేఘునిబాగు- కననాయి లాలి ॥లాలి॥

అంటూ అన్నమయ్య ఆ వేంకటాచలనాథునికి అమ్మయై లాలి పాడాడు. లాలి-జోల పాటలకు మనసాహిత్యంలో అంతటి ప్రాముఖ్యత ఉన్నది.

ఏది ఏమైనా తెలుగుసాహిత్యంలో ఈ రెండుపాటలు ప్రముఖస్థానాన్ని ఆక్రమించాయి. పిల్లలు భగవంతుడితో సమానమని పెద్దలు చెబుతారు. మరి వారిద్దరికీ ప్రశాంతతను, ఆనందాన్ని చేకూర్చే శృతి-స్వర-లయ ప్రాధాన్యతను సంతరించుకున్న మన సాహిత్యమెంత గొప్పదో కదా!

"జోలాలి- జోలాలి- జోలాలి
రామయ్య- రామయ్య- జోలాలి
కృష్ణయ్య- మమ్ముగావ- రావయ్య
జోలాలి- జోలాలి- జోలాలి"

అని ఆ పరమాత్మకు లాలిపాడుతూ ఆనందాలను ఆస్వాదిద్దాం. ఆ స్వామిని దర్శించి తరిద్దాం.

# విశ్వాసం

– పి. శాలిని, 98856 77709


సుమారు డెబ్భైఏళ్లు దాటిన ఓ వృద్ధురాలికి రాముడే బలంగా, రామనామజపమే ఆధారంగా జీవిస్తూండేది. ఐతే ఆమె ఇంటిప్రక్కన పరమనాస్తికుడు ఉండేవాడు. అతడు అన్నింటినీ తర్కంతోనే ఆలోచిస్తూ ఉండేవాడు. తన వాదనతో ఏ విషయంలోనైనా తనదే పై చేయి ఉండేలా చూసుకునేవాడు. తన తర్కంతో ఆ వృద్ధురాలి రామభక్తికి విఘాతం కలిగించాలని ప్రయత్నించేవాడు. కానీ ఎన్నడూ ఆమెముందు ఆయన పప్పులుడకలేదు. ఆ భక్తురాలికి మాత్రం ఉదయం లేచింది మొదలు 'రామా! రామా! అని బిగ్గరగా రామనామాన్ని వల్లించు కుంటూ ఆ ధ్యానంలోనే ఉండడం అలవాటుగా మారిపోయింది.

'నిర్బలునికి బలం ఆ రాముడే' అన్న ప్రగాఢవిశ్వాసం ఆమె మనస్సునిండా ఉండేది. ఆమె విశ్వాసానికి తగ్గట్లు రోజూ ఆమెకు ఎవరో ఒకరు బయటనుంచి భోజనం తెచ్చి ఇస్తూ ఉండేవారు. అయితే ఆ నాస్తికుడికి ఇదంతా విడ్డూరంగా తోచేది.

ఒకరోజు కుండపోతవర్షం కురవసాగింది. ఆ వృద్ధ భక్తురాలు యథావిధిగా రామనామాన్ని జపిస్తూనే ఉంది. మధ్యాహ్నం దాటిపోతోంది. కుంభవృష్టితో ఆ రోజు ఎవరూ ఆమెకు భోజనం తీసుకురాలేకపోయారు. అయినా ఆ ధ్యాసే లేకుండా తాను ఆనందంగా రామనామస్మరణలోనే ఉంది. ఆ పక్కింటినాస్తికుడు ఈ పరిస్థితి అవకాశంగా తీసుకొని ఎలాగైనా ఆమెను రామభక్తినుండి మరల్చాలనుకున్నాడు. ఓ పళ్ళెంలో భోజనం పెట్టుకుని ఆమె ఇంట్లోకి వెళ్ళాడు.


"చూశావా అవ్వా! ఓ పక్క బోరున వర్షం. నువ్వేమో రామా! రామా! అంటూ నీమానాన నీవు పాడుకుంటున్నావు. కానీ నీ రాముడు భోజనంకూడా పంపలేకపోయాడు. ఇప్పటికైనా జపం మానుకో!" అంటూ భోజనపళ్ళెంను ఆమె ముందుంచాడు. ఆ మాట వినగానే ఆ వృద్ధురాలు అతడికి నమస్కరిస్తూ ఆనందబాష్పాలతో 'నా రాముడు ఎంత దయామయుడు! ఇంత వర్షంలోకూడా చివరకు ఓ నాస్తికుడిద్వారా భోజనం పంపించి నా ఆకలి తీరుస్తున్నాడు' అంటూ పరవశురాలైపోయింది.

ఆ నాస్తికుడు ఆమె విశ్వాసబలాన్ని చూసి ఖంగు తిన్నాడు. ఆ భక్తురాలి ఆత్మవిశ్వాసం ముందు తన తర్కం వృథా అని అర్థం చేసుకున్నాడు. కనుక అందరూకూడా అంతటి భక్తివిశ్వాసాల్ని కలిగి ఉండాలన్నదే ఈ కథార్థం.



## పరమ భాగవతోత్తములు

ప్రహ్లాద నారద పరాశర
పుండరీక వ్యాసాంబరీష శుక శౌనక,
భీష్మ దాల్భ్యాన్, రుక్మాంగదార్జున వశిష్ఠ విభీషణాదీన్
పుణ్యానిమాన్ పరమభాగవతాన్ స్మరామి॥



గృహలక్ష్మి

# తులసి పాతివ్రత్యము

- శ్రీ అవసరాల లక్ష్మీపతిరావు, 77991 77831

కశ్యపప్రజాపతి మనుమడు దంభుడు. విష్ణువు వరంవల్ల అతనికి శంఖచూడుడు కుమారుడుగా కలిగాడు. అతడు రాక్షసులగురువు శుక్రాచార్యునివద్ద విద్యనభ్యసించాడు. ఆ తరువాత అతడు వింధ్యపర్వతములవద్ద గొప్పతపస్సుచేసి, బ్రహ్మనుండి పెక్కువరాలు పొందాడు. ముల్లోకాలు జయించి పరిపాలించునట్లు వరం పొందాడు.

బ్రహ్మదేవుడి ఆదేశంతో శంఖచూడుడు తులసిని వివాహం చేసుకుని తనవెంట శోణితపురానికి తీసుకువెళ్లాడు.

శంఖచూడుడు అమరావతిపై దండెత్తి నలభైరోజులు ఘోరయుద్ధం సాగించాడు. యుద్ధంలో అలసిపోయిన దేవేంద్రుడు శంఖచూడునితో సంధి చేసుకున్నాడు. యజ్ఞ యాగాదులు నిర్వహించి హవిర్భాగాలను తానే గైకొన్నాడు. తపస్సంపన్నులను, స్త్రీలను బాధిస్తూ ఆనందిస్తూండేవాడు. దేవతలు శంఖచూడుని ఆగడాలు విష్ణువుకు విన్నవించారు. ఆతడు కాదనగానే శివునికి ఆ రాక్షసునిగురించి మొరపెట్టుకొన్నారు.


శివుడికి, శంఖచూడునికి ఘోరయుద్ధం జరిగింది. ఎంతకాలం పోరాడినా ఆ దానవుని ఈశ్వరుడు ఓడించలేక పోయాడు. ఈశ్వరుడు విష్ణువువద్దకెళ్లి శంఖచూడుణ్ణి జయించు ఉపాయం చెప్పమని ప్రార్థించాడు. అప్పుడు విష్ణువు శంఖచూడుడు నా అంశతోను, తులసి లక్ష్మి అంశతోను జన్మించారు. తులసి మహాపతివ్రత అని చెప్పాడు.

ఒకరోజు విష్ణువు శంఖచూడుడిరూపం ధరించి తులసి మందిరానికి వెళ్లాడు. తనభర్త యుద్ధంలో గెలిచివచ్చాడని పరమానందభరితురాలై ఆతనికి పరిచర్యలు చేసింది. కొంత సమయం తరువాత రాక్షసరూపంతో విష్ణువుకు కామరూపం తొలగి నిజరూపం వచ్చింది. ఆమె విష్ణువు చేసిన మాయగ్రహించి విష్ణువును రాయివి కమ్మని శపించింది. కైలాసపర్వతంమీద శివుడితో యుద్ధం చేస్తున్న శంఖచూడుడు శివుని గదాఘాతానికి రంకెలు వేస్తూ మరణించాడు.

విష్ణువు తులసి శాపవచనములనుండి తేరుకుని జరిగిందంతా ఆమెకు వివరించి నీ భర్త నా అంశతో పుట్టిన వాడే. ఆతడు యుద్ధంలో తనువు చాలించి గోలోకానికెళ్లాడు. నువ్వు నన్ను శపించావు గనుక నదివై ప్రవహించు అన్నాడు. ఆ నదే గండకీనది. నీ శాపానుసారం నేను నీతో ఉంటాను. శంఖచూడుడి అస్థికలు శంఖాలై ప్రవర్తిల్లుతాయి అన్నాడు.

సాలిగ్రామాన్ని ఎవరు శంఖంయొక్క ఉదకంతో అభిషేకించి తులసీదళంతో పూజిస్తారో వారికి అనేకసంపదలు, శుభములు కలిగి కోరిన కోరికలు నెరవేరుతాయి. నీవు తులసీ మాతగా ఉద్భవించి స్త్రీల పూజలందుకుంటావు. హిందువులకు తులసిమొక్క పూజనీయమై వర్ధిల్లుతుంది అన్నాడు.

తులసి వెంటనే హిమాలయాలలో గండకీనదిగా పారినది. శంఖచూడుడి అస్థికలు శంఖాలయ్యాయి. గండకీనదిలోని సాలిగ్రామాలే విష్ణుఅంశలుగా ప్రఖ్యాతి గాంచాయి.



# శరణాగతవత్సలుడు


- డా॥ ఎ.బి.సాయిప్రసాద్, 099805 67541

శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే।
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే॥

రాముడి శరణాగతవత్సలగుణం కారణంగానే ఆ పేరుకు అంత మహిమ ఆపాదించబడి ఉంది.

రమణి సీతను భక్తిప్రపత్తులతో సగౌరవంగా రాజ లాంఛనాలతో రాముడికి సమర్పించుకొని లంకను, వంశాన్ని కాపాడుకో అని విభీషణుడు అన్న రావణునితో సవినయంగా విన్నవించుకున్నాడు. మృత్యువు తలపై తాండవిస్తున్నకారణంగా విభీషణునిమాటలను రావణుడు పెడచెవిన పెట్టాడు. కోపంతో చాచి కాలుతో తన్నాడు. ఇక లాభంలేదని నలుగురి అనుచరులతో సముద్రం దాటి ఆకాశంనుండే రాముడున్న చోటు చేరాడు. అక్కడున్న వానరులను ఉద్దేశించి తన పరిచయం చేసుకుంటూ తాను శరణు కోరడానికి వచ్చిన విషయాన్ని రాముడికి తెలియజేయమని ప్రార్థించాడు. ఆ సందర్భంగా రాముడు అనన్యసామాన్యుడు. అతడు అందరికీ శరణు ఇవ్వగలవాడు అని పొగిడాడు. విష్ణుసహస్రనామంలో కూడా విష్ణుణ్ణి మూడులోకాలకు ఆశ్రయం ప్రసాదించేవాడని వర్ణించబడి ఉంది.

రాముడు ఆర్తత్రాణపరాయణుడు. అన్నీ తెలిసినవాడు. స్వయంగా నిర్ణయం తీసుకోగల సామర్థ్యం కలవాడు. రాజధర్మం, రాజనీతిపారంగతుడు కాబట్టి అక్కడున్న మంత్రిపుంగవులను తనకు కర్తవ్యం బోధించవల్సిందిగా కోరాడు. విభీషణుడు శత్రుపక్షానికి చెందినవాడు. అతణ్ణి నమ్మరాదు. మీరు పరీక్షించి ఆ తరువాత నిర్ణయం తీసుకోండి అని అంగదుడు తన అభిమతాన్ని తెలియజేశాడు.



రామా! మీ శరణు కోరుతున్నాడు. మీరు అతణ్ణి లంకకు రాజుని చేయగలరనికూడా అతడికి తెలుసు. అందుకని అతనికి ఆశ్రయం ఇవ్వడమే మంచిది అన్న ఆంజనేయుడి అభిప్రాయంతో ఏకీభవిస్తూ మిత్రభావంతో విభీషణుడు నన్ను ప్రస్తుతం సమీపించాడు. అలాంటివాడిని నేను విడిచిపెట్టలేను అని తన నిర్ణయాన్ని రాముడు తెలియజేశాడు. శరణుకోరి వచ్చినవాడిని త్యజించడంవల్ల స్వర్గవాసము, యశస్సు దక్కవని రాముడు సుగ్రీవుడికి తెలియజేశాడు.

సంసారసాగరంనుండి శరణు కోరితే నేను శరణు ఇవ్వగలను. పాపి ఎప్పుడూ నా ఎదుట పడలేదు. విభీషణుడు పాపి అయిఉంటే నన్ను కలవడానికి అసలు వచ్చేవాడు కాదు. రావణుడే ఈ విభీషణుడిని పంపాడే అనుకుందాం. అప్పుడు కూడా మనం భయపడవలసిన అవసరం లేదు. లోకంలో ఉన్న రాక్షసులందర్నీ లక్ష్మణుడు ఒక నిమిషంలో హతమార్చగలడు. విభీషణుడు భయభీతుడై వచ్చి ఉన్నాడు. అతణ్ణి ప్రాణంతో సమానంగా ఆదరించాలి. ఏది ఏమైనా, అతణ్ణి సాదరంగా ఆహ్వానించండి అని తన మనోనిర్ణయాన్ని తెలియజేశాడు. విభీషణుడికి అభయమిచ్చి రాముడు అతణ్ణి లంకకు రాజుగా అభిషిక్తుడ్ని చేశాడు. విభీషణునికి లంకనిచ్చాడు. మరి రావణుడొస్తే రాముడు ఏమి ఇవ్వగలడో తెలుసుకోవాలనుకున్నాడు సుగ్రీవుడు. ఆవిషయమే రాముణ్ణి అడిగాడు. అందుకు రాముడు ఏమాత్రం ఆలోచించకుండా, రావణుడు శరణుకోరితే నేను అతడికి అయోధ్యనిస్తానన్నాడు. రాముడి శరణాగతవత్సలగుణాన్ని ఈ మాటలు శిఖరాగ్రంవరకు తీసుకెళ్లాయి. సత్యసంధుడూ, ఆడినమాట తప్పనివాడూ, పితృవాక్యపరిపాలకుడూ, శరణాగతవత్సలుడూ ఐన రాముడు మనకు ఆదర్శపురుషుడు.

యువత

# స్నేహం



– డా॥డి. ఊర్మిళాదేవి

స్నేహం అనేది మానవ సంబంధాలలో కీలకపాత్ర పోషిస్తుంది. స్నేహం అనేది ఒక లోతైన సంక్లిష్టమైన భావన. ఇది ఆప్యాయత, అనుబంధం, విధేయతను కలిగి ఉన్న భావన. ఈ వ్యక్తులను కలిపి వారిలో అనంతమైన ప్రేమను, అనుబంధాన్ని పెంచుతుంది. స్నేహం రొమాంటిక్ ప్రేమకు మాత్రమే పరిమితం కాదు. స్నేహాలు, కుటుంబబంధాలు మరియు తనకు తానుకూడా అనుభవించడం, ఈ నిస్వార్థ మరియు నిరాడంబర భావోద్వేగం జీవితాలను మార్చగలదు. స్నేహానికి సరైన నిర్వచనం ఇవ్వడం గొప్ప సాహసం. స్నేహం అద్భుతమైనది. నిజమైన మిత్రులకు మించిన ఆస్తి లేదు. స్నేహానికి ఎల్లలు లేవు. స్నేహం ఓ మధురమైన అనుభూతి. దీనికి వయస్సుతో నిమిత్తం లేదు. ఆటపాటలాడే బాల్యమందు మధ్య, వృద్ధాప్యంవరకు అందరిలో స్నేహభావన ఉంటుంది. స్నేహాన్ని అనుభవిస్తూ అనుభూతిని పొందితే వాటిలోని మాధుర్యం అర్థం అవుతుంది. సృష్టిలో నా అనేవారు, బంధువులు లేనివారైనా ఉంటారేమోకానీ స్నేహితులు లేనివారు ఉండరు. ఇంట్లో చెప్పలేని సమస్యలు బాధలు సైతం వీరితో ఎటువంటి దాపరికం లేకుండా చెప్పుకుని ఓదార్పు పొందుతాం. అదే స్నేహం. స్నేహం ప్రకృతివంటిది. అది ఆహ్లాదంతోపాటు ఎంతో హాయినిస్తుంది. జీవనయానంలో స్నేహం మధురమైనది. అమ్మ ప్రేమ, స్నేహం ఈ రెండు జీవితంలో ముఖ్యం.

స్నేహంగురించి ఎన్నోరకాల నిర్వచనాలు వారికి కలిగిన అనుభవాలనుబట్టి గొప్పవారు నిర్వచించారు.

కష్టకాలంలోనే మిత్రుడు ఎవరో తెలుస్తుంది. ఇచ్చింది మరచిపోవడం, పుచ్చుకున్నది జ్ఞాపకం ఉంచుకోవడమంటేనే స్నేహం.

శత్రువు ఒక్క ఒక్కడైనా ఎక్కువే. మిత్రులు వందమంది అయినా తక్కువే. స్నేహానికి విశ్వాసం పునాది.

చెడ్డమిత్రులకన్నా మిత్రుడు లేకపోవడమే నయం.

స్నేహం అద్భుతమైనది. నిజమైన మిత్రులకు మించిన ఆస్తి లేదు. స్నేహానికి ఎల్లలు లేవు. అది సరిహద్దుల్ని చెరిపేస్తుంది. వికాసానికి బాటలు వేస్తుంది. మంచి మిత్రుడు తోడుంటే ఆయుధం ధరించినంత ధైర్యం ఉంటుంది. స్నేహం అనేది ఇద్దరు వ్యక్తులమధ్య ఉండే మంచి అనుబంధం.

స్నేహంలో ఇద్దరిమధ్య ఏ విధమైన కల్మషం, అపార్థం లేకుండా ప్రేమ, శ్రద్ధ, ఆప్యాయతలు కలిగి ఉంటారు. సాధారణంగా ఒకేరకమైన భావాలు, మనోభావాలు, అభిరుచులు ఉన్నవారిమధ్య స్నేహం జనిస్తుంది. స్నేహానికి వయస్సు, లింగము, స్థానం, కులం, మతమనేది ఏ విధమైన బేధాలు ఉండవు. కొన్ని కొన్నిసార్లు అధిక అసమానతలు లేదా ఇతరబేధాలు స్నేహాన్ని పాడుచేస్తాయి.

## 2025, మే నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 02 | శ్రీరామానుజజయంతి, శ్రీశంకరజయంతి |
| 03 | శ్రీరామజయంతి, మొదలియాండాన్ వర్షతిరునక్షత్రం |
| 06-08 | శ్రీపద్మావతీ శ్రీనివాసుల పరిణయోత్సవం, తిరుమల |
| 09-12 | శ్రీపద్మావతీతాయార్ల వసంతోత్సవం, తిరుచానూరు |
| 11 | నృసింహజయంతి, తరిగొండ వెంగమాంబ జయంతి |
| 11-19 | శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివార్ల బ్రహ్మోత్సవాలు, హృషీకేశ్, నారాయణవనం |
| 11-19 | శ్రీనారాపుర వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం, జమ్మలమడుగు |
| 12 | కూర్మజయంతి, అన్నమాచార్యజయంతి |
| 13 | తిరుపతి గంగజాతర |
| 19-27 | శ్రీవేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవం, కార్వేటినగరం |
| 22 | హనుమజ్జయంతి |

స్నేహమేరా జీవితం

స్నేహమేరా శాశ్వతం.


స్నేహమేరా జీవం.

స్నేహం అద్భుతమైనది. హృదయపుతలుపులు ఒకసారి తడితే అందులోని మాధుర్యమంతా ప్రతిహృదయంలో గుబాళిస్తుంది. ప్రతిఫలాన్ని ఆశించక ఆ బంధం మొగ్గలా ప్రారంభమై మహావృక్షంలా ఎదిగి జీవితాంతం తోడునిస్తుంది.

స్నేహంకన్నా మిన్న లోకాన లేదు రా, కడదాకా నీడలాగా నిన్ను విడిపోదు రా.

వాస్తవంగా దోస్త్ - నువ్వే నా ప్రాణం అంటూ సినీ కవులు కవిత్వం రాసినా స్నేహానికి ఉన్న గొప్పదనం ఎన్ని రకాలుగా చెప్పినా వర్ణించేందుకు వీలుకానిదే. కష్టసమయంలో కలతచెందిన మనసుకు వెన్నెల చల్లదనాన్ని, ప్రశాంతతను అందించే దివ్య ఔషధం స్నేహం. మనసుకు దగ్గరగా ఉండేది స్నేహం. ప్రతిరోజూ మాట్లాడకుండా అవసరమైనప్పుడు మనసుకు ధైర్యం ఓదార్పు చెప్పే నేస్తం ఉన్నాడని నమ్మకం, కొండంత ధైర్యాన్ని మనసుకు ఉపశమనాన్ని ఇస్తుంది.

**నిజమైన స్నేహితుడు-** ఇద్దరు స్నేహితులు సెలవురోజు షికారుకు వెళ్లారు. దారిలో మాట్లాడుకుంటూ ఏదో విషయంపై అభిప్రాయం కుదరక ఇద్దరు వాదించుకున్నారు. వాదన ఎక్కువై మొదటివాడు రెండోవాడిని చెంపపై కొట్టాడు. దెబ్బతిన్నవాడు అక్కడున్న ఇసుకపై ఈ రోజు నా స్నేహితుడు నా చెంపపై కొట్టాడు అని వ్రాశాడు. మళ్లీ ఇద్దరు ముందుకు నడిచారు. మరికొంతదూరం వెళ్ళాక ఇద్దరికీ దాహం వేసి ఒక మడుగుదగ్గరకు వెళ్లారు. చెంపదెబ్బతిన్న మిత్రుడు ముందు నీళ్లలోకి దిగాడు. అక్కడ ఊబి ఉంది. అతడు ఊబిలోకి కూరుకుపోయిన స్నేహితునికి వెంటనే తన బట్టలు విప్పి మిత్రుడికి అందించి బయటకు లాగాడు మొదటిమిత్రుడు. బయటపడ్డాక రెండోమిత్రుడు ఓ బండరాయిపై "ఈ రోజు నా మిత్రుడు ప్రమాదంనుండి రక్షించాడు" అని చెక్కాడు. మొదటివిషయాన్ని ఇసుకపై, రెండోవిషయాన్ని బండమీద ఎందుకు వ్రాశావు అని అడగ్గా, ఇసుకమీద ఏదైనా వ్రాస్తే గాలిగాని, నీరుగాని వస్తే చెదిరిపోతుంది. అందుకే బండమీద వ్రాస్తే అది శాశ్వతంగా నిలిచిపోతుంది అని అన్నాడు.



**ఒకబానిస మరియు సింహము**

ఒక బానిస తన యజమాని పెట్టే బాధలు భరించలేక పారిపోయాడు. దారిలో అడవిలో ఒక సింహం బాధను తట్టుకోలేక అరుస్తోంది. దీన్ని గమనించిన అతను సింహాన్ని గమనించగా దాని పంజాకు ముళ్ళు గుచ్చుకొని రక్తం కారుతుండడం గమనించి, పంజానుంచి ముల్లును తొలగించి సహాయం చేయడంవల్ల వారిద్దరిమధ్య స్నేహం ఏర్పడింది. తర్వాతకాలంలో యజమానికి ఆ బానిస దొరికిపోయాడు. పగతో రగులుతున్న యజమాని అతణ్ణి సింహపుబోనులోకి పంపగా, ఆ సింహం అతనిదగ్గరికి వెళ్లి గమనించి ఇతనే కదా నన్ను ఆ రోజు బాధనుంచి కాపాడినవాడని తన స్నేహితుడిగా భావించి అతనికి అపాయం తలపెట్టక స్నేహభావాన్ని ప్రకటించింది. ఇక్కడ క్రూరజంతువైన సింహం స్నేహం ఎంత గొప్పదో కదా! అదే కదా స్నేహమంటే మరి.



# స్వామి చల్లనిచూపు..

- శ్రీ నీలంరాజు రాధాకృష్ణమూర్తి, 99638 03015

మా కుటుంబానికి శ్రీస్వామివారు చూపిన విచిత్ర అనుభవం. మేమంతా తిరుపతి వెళ్దామని ఆరోజు ఉదయం బయలుదేరి ప్రక్కనే ఉన్న బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్ళాం. అక్కడికి ఆ రోజుల్లో జయంతి జనతా ఎక్స్‌ప్రెస్ వచ్చేది. ఆ రోజుకూడా వచ్చింది. హడావుడిగా అందరితోపాటు మేము ఎక్కడానికి ప్రయత్నించాం. చివరికి ముందు ఏమున్నాయో చూచుకోకుండా ట్రైన్ ఎక్కాం. ఆ తొందరలో ప్లాట్‌ఫామ్‌పై పెద్ద పెద్ద ఇనుపపట్టాలు ఉన్నాయి. అవి తగిలి నాకు కుడి బొటనవ్రేలుకు దెబ్బ తగిలి బాగా రక్తం వచ్చింది. వెంటనే నా భార్య తన రుమాలును తడిపి కాలికి చుట్టింది. కానీ, రక్తం ఆగలేదు. ఇంకొక బట్ట తడిపి గట్టిగా కట్టింది. మాతో ఎక్కిన ఒక నర్సు ఆమెవద్ద ఉన్న ఒక మాత్ర నొప్పి తగ్గడానికి ఇచ్చారు. వెంటనే వేసుకున్నాను. బాగా నొప్పిగా ఉంది. అలాగే మీరు 24 గంటల లోపల సెప్టిక్ కాకుండా ఇంజెక్షన్ తీసుకోమని చెప్పారు.

తిరుమలలోని అశ్విని హాస్పిటల్‌కెళ్లి డ్రెస్సింగ్ చేయించుకున్నాను. ఆ తర్వాత తలనీలాలు సమర్పించుకొన్నాం. తర్వాత శ్రీవేంకటేశ్వరుని దర్శనం చేసుకొన్నాం. అక్కడే తీర్థం, స్వామి ప్రసాదం తీసుకొని తదుపరి నిత్యాన్నదానప్రసాదకేంద్రానికెళ్లి అక్కడ అన్నప్రసాదాన్ని తీసుకొన్నాం.

కాలు నొప్పిగానే ఉన్నది. తిరిగి తిరుపతికి చేరాం. బస్సులో ఎక్కిన తర్వాత కూడా కాలికి కట్టిన డ్రెస్సింగ్ బాగానే ఉంది. తరువాత, కొద్దిసేపటికి యాదృచ్ఛికంగా నా కాలికట్టువైపు చూశాను. కాలికి కట్టిన డ్రస్సింగ్ క్లాత్ లేదు, నొప్పికూడా చేతితో తీసేసినట్లు అయింది. నేను వెళ్లలేనిస్థితిలోకూడా మమ్మల్ని రప్పించుకొన్నారు స్వామివారు. ఇదంతా ఆ శ్రీవేంకటేశ్వరుని మహిమేనని అందరమూ సంతోషించాం. మేము బయలుదేరినసమయంనుండి శ్రీస్వామివారిదయతో తిరుపతియాత్రను సుఖంగా చేయగలిగాం. అంతా ఆయన చల్లనిచూపే కాని మరొకటి కాదు.

## తిరుమల శ్రీవారి ఆలయంలో శ్రీరామపట్టాభిషేకోత్సవం



తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిసన్నిధానంలో ప్రతిసంవత్సరం చైత్రశుద్ధదశమీశుభదినం శ్రీరామస్వామివారికి పట్టాభిషేకోత్సవాస్థానం జరుగుతుంది. శ్రీవేంకటేశ్వరస్వామివారికి ప్రాతఃకాలారాధనం, మాధ్యాహ్నికారాధనం పూర్తైనతర్వాత సాయంకాలం శ్రీసీతారామలక్ష్మణులను ఒక బంగారుతిరుచ్చిలోను, ఆంజనేయస్వామివారిని ఇంకొకతిరుచ్చిలోను వేంచేపు చేస్తారు. ఆ సమయంలో విశేషాభరణాలు, వస్త్రాలు, పుష్పమాలికలతో అలంకరిస్తారు. శ్రీరామస్వామివారికి, శ్రీఆంజనేయస్వామివారు అభిముఖంగా ఉండేట్లు ఏర్పాటుచేస్తారు. అలా నాలుగుమాడవీథుల్లో, సర్వపరివారాలతో, మంగళవాద్యాలతో ఉత్సవం జరుగుతుంది. పిమ్మట శ్రీస్వామివారు బంగారువాకిలిముందున్న ఆస్థానమండపంలో సర్వభూపాలవాహనంలో వేంచేస్తారు. కపికులచక్రవర్తి సుగ్రీవుడు, యువరాజు అంగదుడు, శ్రీఆంజనేయస్వామివారు శ్రీవారికి ఎడమవైపు దక్షిణాభిముఖంగా వేరుపీఠాలమీద వేంచేస్తారు. ఆస్థానమందు ఆరాధనం, ఆరగింపు జరుగుతుంది. లోకరక్షణార్థమై శ్రీసీతాదేవితో రత్నఖచితసింహాసనం అలంకరించిన శ్రీరామచక్రవర్తి పట్టాభిషేకమంగళములను పౌరాణికులు శ్రీరామచంద్రుని పాదారవిందములవద్దనున్న శ్రీమద్రామాయణంలోని శ్రీరామపట్టాభిషేకఘట్టాన్ని పురాణ కాలక్షేపం చేస్తారు. ఆ సమయంన శ్రీరామచక్రవర్తిపాదాలవద్దనున్న పుష్పమాలికలను, రత్నహారాలను సుగ్రీవాంగద ఆంజనేయస్వామివారలకు సమర్పిస్తారు. మర్యాదలు జరుగుతాయి. ఆపై హారతులు జరుగుతాయి. తర్వాత చందన తాంబూల ప్రసాదవినియోగం జరుగుతుంది. ఆస్థానమర్యాదపూర్వకంగా గోష్ఠి జరుగుతుంది. ఆ తర్వాత శ్రీవార్లు శ్రీస్వామివారిసన్నిధిలోకి వేంచేస్తారు. ఇదీ తిరుమల ఆలయంలో జరిగే శ్రీరామస్వామివారి పట్టాభిషేకోత్సవాస్థానం.

*2025, ఏప్రిల్ - 07 శ్రీరామపట్టాభిషేకాస్థానోత్సవం సందర్భంగా..*

*గత సంచిక తరువాయి భాగం....*

ధారావాహిక



# మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు

ఆంగ్ల మూలం- శ్రీ లక్ష్మీనరసింహన్ శ్రీధర్
తెలుగు- శ్రీదేవీ మురళీధర్

ఒకవారం గడిచింది; రాజపరివారం, రాజుగారి శ్రేయోభిలాషులు శ్రీవైష్ణవాన్ని స్వీకరించారనే వార్త జైనసన్యాసులందరికీ ఎంతో కోపం కలిగించింది. ఇకపై రాజ్యంలో తమ మాటకు ఎటువంటి విలువ ఉండదని వారు భావించారు.

అప్పుడు వేలాదిమంది జైనసన్యాసులు విష్ణువర్ధన రాజుతో సమావేశమయ్యారు. కొండపై ఉన్న యోగనరసింహస్వామి ఆలయానికి చేరుకొని, వారు జగదాచార్య రామానుజుల ధర్మాన్ని, శ్రీవైష్ణవమతప్రవృత్తిని ప్రశ్నించారు. జైనసన్యాసులు రామానుజులను శాస్త్రచర్చ ఎదుర్కొమ్మని సవాలుచేశారు. యతిరాజు తక్షణమే అంగీకరించారు. నిర్ణీతరోజున చర్చ జరపాలని నిర్ణయించారు.

## రామానుజులు వెయ్యిమంది జైనసన్యాసులను శాస్త్ర చర్చలో ఓడించుట

శాస్త్రచర్చ నిర్ణీతమైననాడు శ్రీరామానుజులు నంబి నారాయణసన్నిధిలో తమ నిత్యానుష్ఠానం ముగించుకుని, శిష్యకోటి వెంటరాగా పార్థసారథి పెరుమాళ్ఆలయం చేరుకొని స్వామికి మంగళాశాసనం చేసి, యోగనరసింహఆలయం చేరుకున్నారు. నరసింహునికి సాష్టాంగదండప్రణామాలు సమర్పించి, సన్నిధి బయట కూర్చుని తమచుట్టూ ఒక తెర కట్టమని ఆదేశించారు.

రామానుజాచార్యులు ఒక్కొక్కరితోను, సామూహికంగా వెయ్యిమంది జైనసన్యాసులతో ఏకకాలంలో శాస్త్రచర్చ, వాదనలు నిర్వహించారు. అదేసమయంలో ఒక జైనసాధువు ఆచార్యుల విద్వత్తుపట్ల సంశయంతో తెర తొలగించి చూడగా ఒక మహాద్భుతం గోచరించింది. అతడు మూర్ఛపోగా మరికొందరు సన్యాసులు తెరవెనుక ఏముందోనని చూడగా రామానుజులు తమ నిజరూపమైన వెయ్యిపడగల ఆదిశేషుని రూపంలో జైనసన్యాసులతో శాస్త్రచర్చకు తలపడటం కనిపించింది. చివరకు జైనసాధువులు తమ ఓటమిని అంగీకరించడంతో చర్చ ముగిసింది.

శ్రీకరస్వామి ఎంతో భావోద్వేగంతో ఈ సన్నివేశాన్ని వర్ణిస్తూ ప్రస్తుతం యోగనరసింహసన్నిధి బయట రామానుజుల మూర్తి ఉన్న సన్నిధిలోనే ఆచార్యులు సాక్షాత్తు ఆదిశేషులుగా కూర్చుని శాస్త్రచర్చలో పాల్గొన్నారని చెప్పారు. శ్రీకరస్వామి తన ఉపన్యాసాన్ని కొనసాగిస్తూ ఎందరో జైనసన్యాసులు శ్రీవైష్ణవ ధర్మం స్వీకరించి, ఆచార్యుల శిష్యులైనారని చెబుతారు.

ఆచార్యుల ఆదేశానుసారం విష్ణువర్ధనమహారాజు రెండుకొండలమధ్య యాదవనదిపై ఆనకట్ట నిర్మించాడు. మరొక ఐతిహ్యం ఆ ఆనకట్ట యతివరులు స్వహస్తాలతో నిర్మించిన అద్భుతమని చెబుతుంది. *(ఇంకా ఉంది)*

# అన్నమయ్య కళ్యాణకీర్తనలు





- డా॥యస్.పద్మావతి, 96762 69300

**2025, ఏప్రిల్ 10 నుండి 12 వరకు తిరుమల స్వామి వసంతోత్సవాల సందర్భంగా...**

కలియుగ ప్రత్యక్షదైవం, భక్తుల కొంగుబంగారం శ్రీవేంకటేశ్వరుని భక్తాగ్రేసరుడు తాళ్లపాక అన్నమయ్య. ఆ స్వామిపై అపరిమితభక్తితో ముప్పైరెండువేల సంకీర్తనలు రచించి అర్చించిన అపూర్వ అర్చకుడు. స్వామి మహిమలను, స్వామివైభవాన్ని, స్వామి ధరించిన వివిధ అవతారాల విశేషాలను వర్ణించడంతోపాటు స్వామికి జరిగే నిత్యసేవలను, ఉత్సవాలనుకూడా కమనీయంగా కీర్తించాడు. ఈ క్రమంలో స్వామివారి కల్యాణాన్ని కడురమణీయంగా కీర్తిస్తూ వివాహవేడుకలోని వివిధఘట్టాలను అనేకకీర్తనల్లో కళ్ళకు కట్టినట్లుగా వర్ణించాడు. వీటిద్వారా వివాహవేడుకలోని ఆచారాలు, సంప్రదాయాలు, తిరుమలలో స్వామివారి కల్యాణం జరిగినతీరు మనకు అవగతమవుతాయి. అన్నమయ్య సంకీర్తనల్లోని కల్యాణకీర్తనలివి:

మొదట్లో స్వామివారి కల్యాణం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఒకరోజు (పదోరోజు) జరిగేది. ఆ కీర్తన :

"తిరువీథుల మెరసీ దేవదేవుడు
గరిమల మించిన సింగారములతోడను
తిరుదండెలపైనేగీ దేవుండిదే తొలు నాఁడు
..................................................
పెనచి పదోనాఁడు పెండ్లిపీట" (7-192)

వివాహనిశ్చయం జరిగాక పెండ్లికి రండని అందరినీ ఆహ్వానించడం మొదటిపని పెండ్లిపిలుపు.

"పసిడి యక్షింతలివె పట్టరో వేగమే రారో,
దెసల పేరంటాండ్లు దేవుని పెండ్లికిని" (3-194)

అంటూ స్వామి పెండ్లికి రండని దేవతలను, మునులను, అన్ని లోకాలలోని యావన్మందినీ ఆహ్వానిస్తున్నాడు. వధువు తండ్రిగా (ఆ భక్తకవి భావనలో) వివాహానికి రండి అని అందరిని తనే స్వయంగా అక్షతలిచ్చి మరీ ఆహ్వానిస్తున్నాడు. తాంబూలమిచ్చి ఆహ్వానించడంకూడా మరో కీర్తనలో చూడవచ్చు.

"యెత్తిరి గరుడధ్వజమిందిరాపతి పెండ్లికి
యిత్తలు సురలు మునులిందరూ రారో
హత్తి సేనాపతి యిచ్చెనదె కప్పురవిడేలు" (12-4)

పై కీర్తనలో స్వామివారి సేనాపతియైన విష్వక్సేనుల వారు అన్నిలోకాలకు వెళ్ళి స్వామివారి పెండ్లికి రండని తాంబూలమిచ్చి అందరినీ ఆహ్వానించడం తెలుస్తోంది. అలాగే ఈ వివాహమహోత్సవానికి ముందుగా స్వామివారి గరుడ ధ్వజమును ఆరోహణం చేయడంగురించికూడా ప్రస్తావించాడు.

బంధుమిత్రులు, పెద్దలందరూ తరలివచ్చి వివాహ వేడుకలు జరిపించడంగురించి చాలా కీర్తనలలో విస్తృతంగా కీర్తించాడు.

"గరుడ ధ్వజంబెక్కె కమలాక్షు పెండ్లికి
పరుషలదివో వచ్చెఁ బైపై సేవించను" (3-21)

స్వామికల్యాణం అంకురార్పణంతో మొదలవుతుంది.

"వెలయఁగ లక్ష్మీవిభుని పెండ్లికిని
బలసి అంకురార్పణమదివో
కలగొన నిచ్చేరు గంధాక్షతలవె
చెలఁగి కైకొందరో శ్రీవైష్ణవులు" (22-96)

స్త్రీపురుషులకు వివాహసంబంధం చూసేటప్పుడే వధూ వరుల జాతకాలు కలుస్తాయా లేదా అన్నది చూస్తారు. దీనినే పొంతనాలు చూడడం అని అంటారు. ఈ పొంతనాలు కలిస్తేనే ఆ వ్యక్తులిద్దరికి పెళ్లి. లేకుంటే లేదు.

నెలత కమలవాసి నీవు కమలాక్షుఁడవు
పొలతికి నీకు గూడె పొంతనాలు (20-201)

**పూలదండలు మార్చుకోవడం గురించి...**

వివాహంలో వధూవరులు పూలదండలు మార్చుకోవడం ఒక ప్రధానఅంశం. పెద్దలసమక్షంలో పురోహితుడు మంత్రోచ్చారణ చేస్తూ ఈ తంతు జరిపిస్తారు.

మంచి ముహూర్తమున శ్రీమంతులిద్దరు
చంచుల బూవుదండలు చాతుకొనే రదివో (14-110)

**బాసికాలు:**

వివాహంలో బాసికాలు కట్టుకోవడం అనేది చాలా ముఖ్యాంశం. బాసికాలు కట్టడంతోనే వధూవరులకు ఒక క్రొత్త కళ వస్తుంది.

"పచ్చి ముత్యాలనే కట్టె బాసికము" (5-189)

**మంత్రాలు చదవడం, సేసలు వేయడం, కట్నములు చదవడం, పాటలు పాడడం, హారతులివ్వడం, మంగళవాయిద్యాలు:**

వివాహ ఆచారాల్లో ఇవన్నీ చాలా ముఖ్యమైనవి.

సొరిదిఁ బేరటాండ్లు సోబాన బాడ గాను
హరియు సిరియు బెండ్లియాడేరదే

తొర యంతటా దేవదుందుభులు మొరియంగ
గరిమ బాసికములు గట్టుకొనే రదివో
మునులు మంగలాష్టకములు చదువుచుండగ
పెనగుచు సేసలు పెట్టేరదే

ఘనులు బ్రహ్మాదులు కట్నములు చదువగ
వొనరి పెండ్లి పీటపైనున్నారదివో
అమరాంగన లేల్లాను ఆరతులియ్యగాను..
కొమరార విడేలందుకొనేరదివో (14-110)



స్వామివారి వివాహానికి మునులు విచ్చేసి పెండ్లిలో మంగళాష్టకాలు (పెండ్లిమంత్రాలు) చదివారు. బ్రహ్మాదిదేవతలు కట్నములు చదివారు. సేసలు పోశారు. పేరాంటాండ్లందరూ పెండ్లిపాటలు ఆలపించారు. అప్సరస్త్రీలందరు స్వామికి, అమ్మవారికి హారతులిచ్చారు.

**కానుకలివ్వడం, తలంబ్రాలు పోయడం:**

వేసిరి కానుకలెల్ల వేవేలు కొప్పెరల
పోసిరదె తలఁబాలు పుణ్యసతులు (3-21)

**వధూవరులు తలంబ్రాలు పోసుకోవడం గురించి...**

వివాహంలో వధూవరులు పరస్పరం తలంబ్రాలు పోసుకోవడమనేది చాలా సరదాగా సాగే ఉత్సాహవంతమైన ఘట్టం.

కందర్ప జనకునికిఁ గమలాదేవికి పెండ్లి
పందిలి లోపలఁ దలబ్రాలు నేడు (3-194)

**పెండ్లివిందు:**

పెండ్లిలో విందు అనేది అతిముఖ్యమైన అంశం. పెండ్లికి వచ్చినవారందరికి నచ్చేలా, సంతృప్తి కలిగించేలా పెండ్లివిందు ఉండాలి. అందులో ఎవ్వరికీ మర్యాదల్లో ఏ విధమైన అసంతృప్తిగాని, అవమానంగాని కలగకూడకు. అలాగే ఎవ్వరికీ మర్యాదల్లో లోటు ఉండకూడదు. అందుకే పెండ్లి విందు పర్యవేక్షణబాధ్యతను సమర్థవంతులైన పెద్దలు నిర్వహిస్తారు.

వెలయు భాష్యకారులు విందు చెప్పెఁ బెండ్లికి
నెలవై బువ్వాలవారు నెమ్మది రారో (12-4)

స్వామి పెండ్లిలో విందు ఏర్పాట్లు చూసే బాధ్యతను భాష్యకారులవారు నిర్వహించినట్లు పై కీర్తనద్వారా తెలుస్తోంది.

**వధూవరులమధ్య తెర, కొంగులు ముడివెయ్యడంగురించి:**

వధూవరుల శిరస్సులమీద జీలకర్ర బెల్లం పెట్టేవరకు వధూవరులమధ్య తెరకట్టి ఉంచడం ఒక ముఖ్యమైన ఆచారం.

నిక్కినిక్కి చూచేరదే, నెరిఁదెర దియ్యర్లో
వొక్కటైరి కొంగు ముళ్ళు వొనరఁగ వేయరో (14-365)

"వధూవరులు తెరమీదనుంచి ఒకరినొకరు నిక్కి నిక్కి చూసుకొంటున్నారు. అలా చూసుకోడానికి వాళ్ళు చాలా కష్టపడుతున్నారు. వాళ్ళను ఇంకా కష్టపెట్టడమెందుకు; ఆ తెర

తీసేయ్యండి" అంటూ వధూవరుల కొంగులు ముడివేయండి అంటూ పురమాయిస్తున్నాడన్నమయ్య.

**వసంతాలు పోసుకోవడంగురించి...**

వివాహవేడుకల్లో వసంతాలు పోసుకోవడం అనేది ఒక ముఖ్యఘట్టం. చాలా సరదాగా సాగే వేడుక. పసుపు కలిపిన నీళ్ళలో పూరేకులు, పరిమళద్రవ్యాలు వేసి పెద్ద పెద్ద బిందెలలో నింపి ఉంచగా వాటిని వధూవరులు ఒకరిపై ఒకరు పరస్పరం పోసుకుంటారు. అందరూ వారిని ఉత్సాహపరుస్తూ ఉంటారు.

**పొందుగ కనకావతి భోగావతీ నదుల**
**సందడి వసంతముగా చల్లులాడుచు (18-436)**

స్వామీఅమ్మవార్లు వసంతాలు పోసుకోడానికి కనకావతి, భోగావతీనదులే తరలివచ్చి సందడి చేస్తుండగా ఆ నదీజలాలతో స్వామీఅమ్మవార్లు వసంతాలు పోసుకున్నారు.

**నాగవల్లి, కంకణధారణ గురించి...**

వివాహంలో నాగవల్లి కట్టడం, కంకణాలు ధరించడ మనేవి కూడా చాలా ముఖ్యమైన ఘట్టాలు.

**"నేడే పెండ్లివేళ నేడే నాగవల్లి**
**ఆడుచు సొభానఁ బాడుమనరే చెలులు**
**.................................**
**ఘనమైన కంకణము గట్టరే చెలులు" (17-537)**

**"నాలుగో దినము నేడు నాగవల్లి వేళ" (20-182)**

స్వామివారి వివాహంలో నాలుగోరోజు నాగవల్లిధారణ వేడుక జరిగినట్లు పై కీర్తనద్వారా స్పష్టంగా తెలుస్తోంది.

**వరుడు వధువుపాదం తొక్కడంగురించి..**

పెండ్లిలో వరుడు వధువు పాదమును తొక్కడమనేది మరో ముఖ్యమైన అంశం. వివాహం జరిపించే పురోహితుడు వరునిచెంత నిలబడి "ఒకసారి అమ్మాయిపాదాన్ని తొక్కు నాయనా!" అని చెప్పి మరీ తొక్కిస్తాడు. ఈ సన్నివేశాన్ని వీక్షిస్తూ వేదికవద్ద ఉన్నవారందరూ ఆనందిస్తారు. స్వామివారి కల్యాణంలోని ఈ సరదాసన్నివేశాన్ని అన్నమయ్య ఎంతో అందంగా కీర్తించాడు.

**"దోమటి దొడికి ముందే తొక్కెఁబాదాలు**
**యీ మేటి వేంకటేశుడిన్ని విధాలా మెఱసె" (13-100)**

పై కీర్తనలో వరుడైన స్వామివారు అమ్మవారి పాదాలు తొక్కినాడన్న విషయం చాలా అందంగా చెప్పాడు. "అమ్మవారి పాదాలను స్వామి మునుపే తొక్కాడు. ఎందులోనైనా మా స్వామి మేటి" అంటూ అందంగా చమత్కరించాడన్నమయ్య.

**శోభనము- వధువును సింగారించడం:**

పెండ్లిలో అతి ముఖ్యమైన ఘట్టం శోభనము. ఈ శోభనముతోనే వధూవరులు మనసు విప్పి మాట్లాడుకుంటారు. పరస్పరం, పరాయిభావనపోయి సొంతభావనతో ఏకమవుతారు. శోభనమునకు వధువును చాలా అందంగా, ముగ్ధమనోహరంగా అలంకరిస్తారు.

**"పేరంటాండ్లు వాడరే పెండ్లి వేళ**
**సారె సారె నిద్దరికి సంతోష వేళ**
**చిత్తజు తల్లికి వేగసింగారించరె మీరు**
**తత్తరించెరిదె ముహూర్తపు వేళ" (20-182)**


**"సుదతులకితనికి సోబన వేళ**
**వుదుటునఁ జెలులెల్ల నూడిగాలు శాయరే" (13-100)**

పై కీర్తనల్లో "ఇవాళ మన స్వామికి అమ్మవారికి శోభన ముహూర్తముంది. అమ్మవారిని సింగారించండి. అలాగే ఈ సంతోషవేళ మీరందరూ చక్కగా గానం చేయండి. నృత్యం చేయండి. ఇంకా అవసరమైన సేవలు చేయండి" అంటూ అక్కడున్న స్త్రీలను ప్రేరేపిస్తూ ప్రోత్సహిస్తున్నాడన్నమయ్య.

ఈ విధంగా ఆనాడు వాడుకలో ఉన్న ఆచారాల ప్రకారం స్వామి కల్యాణోత్సవం జరిగేది. స్వామివారి కల్యాణోత్సవాన్ని ప్రత్యక్షంగా తిలకించి పులకించిన అన్నమయ్య ఆ వివాహమహోత్సవంలోని వివిధఅంశాలను, సన్నివేశాలను వరుసక్రమంలో వర్ణిస్తూ కీర్తించాడు. ఇవన్నీ ఇలా వరుసక్రమంలో కళ్లకు కట్టినట్లుగా వర్ణించడంవల్ల ఆ కల్యాణ మహోత్సవాన్ని ఇప్పుడు మనమూ ప్రత్యక్షంగా వీక్షిస్తున్న అనుభూతి కలుగుతోంది. అంత గొప్ప సంకీర్తనలు రచించి లోకానికి అందించిన అన్నమయ్య ధన్యుడు.

అన్నమయ్య ప్రస్తావించిన వివాహ ఆచారాలన్నీ ఇప్పటికీ అలాగే కొనసాగుతున్నాయి. స్వామికల్యాణం నేడు ఆర్జితసేవగా నిత్యం కొనసాగుతూంది. స్వామికల్యాణం జరిపించే ప్రతి భక్తుడు ఒక అన్నమయ్యే. స్వామివారి నిత్యకల్యాణమహోత్సవాన్ని జరిపించి తరిద్దాం.

ధారావాహిక



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*(గత సంచిక తరువాయి భాగం...)*

మంగళాశాసనము చేయవలెనన్న తలంపువలనను కలికాలదోషమువలన వృద్ధిపొందుచున్న బాహ్యకుదృష్టితో సిద్ధాంతమంతయు నశించిపోవలెనను తలంపుతోడను శ్రీవేంకటాచలపతి అనుజ్ఞవడసి వారి మ్రోల శ్రీభగవద్రామను జాచార్యులవారి విగ్రహప్రతిష్ఠ చేయించియు వారిపాదుకలకు (శఠకోపమువంటిది) తననామధేయము (ఆనందాళ్వాన్) పెట్టియు ఇట్లు శేషాద్రిపై అనేక శ్రీవైష్ణవధర్మములను ప్రవర్తిల్ల జేసి ‘రామానుజార్యదివ్యాజ్ఞా వర్ధతా మభివర్ధతామ్’ (భగవద్రా మానుజాచార్యులవారి దివ్యాజ్ఞ వర్ధిల్లుగాక, మిక్కిలి వర్ధిల్లుగాక!) అనినచొప్పున భగవద్రామానుజుల ఆజ్ఞచొప్పుననే శ్రీవేంకటాచల వైభవము ప్రతిదినమును సుస్థిరమై అలరారునట్లు మంగళాశాసనాసక్తులై శ్రీనివాసవిషయకమైన గుణాను భవకైంకర్యములను లోపము లేకుండ అనుష్ఠింపజేయుచు సుఖముండినారు.

శ్రీమనవాళమహామునులు శ్రీపాదముల నాశ్రయించిన శ్రీరామానుజసిద్ధాంతప్రవర్తకులగు అష్టదిగ్గజముల (ఉద్దండ పండితుల) నామధేయములు!

వానాద్రియోగివర వేంకటయోగివర్య
శ్రీభట్టనాథముని వాదిభయంకరార్యాః,
రామానుజార్య వరదార్య నతార్తిహారి
శ్రీదేవరాజగురవోఽష్టదిశాగజాస్తే.

(వానాద్రియోగివరులు (వానమామలైజియ్యరు), వేంకటయోగివర్యులు (తిరువేంగడరామానుజజియ్యరు), శ్రీభట్టనాథమునులు (పరవస్తుభట్టర్‌పిరాన్‌జియ్యరు), వాది భయంకరార్యులు (ప్రతివాదిభయంకరఅణ్ణా), రామానుజా చార్యులు (అప్పిళ్లై), వరదార్యులు (కోయిల్‌కందాడైఅణ్ణన్), ప్రణతార్తిహరులు (కిడాంబిఅప్పుళ్లాన్), శ్రీదేవరాజగురువులు (ఎఱుంబియప్పా))

పూర్వకాలమందు విషయోపభోగవిరక్తులగు బ్రాహ్మ ణులు పరివేష్టించి వసించియుండు శ్రీరంగమని చెప్పతగినట్లుగా పరమైకాంతులకు ఆవాసభూమియగు శ్రీరంగదివ్యక్షేత్రమున నిత్యనివాసియగు శ్రీరంగనాథస్వామి శ్రీపాదములందు అచంచల భక్తిగల ‘ఆళ్వారరైయర్’ అను ప్రబంధగాయకులు ఒకానొక సమయమున తిరుమలయాత్ర చేసికొనుచు కొండపై విజయము చేసి స్వామిపుష్కరిణియందు స్నానముచేసికొని, సమస్తాను ష్ఠానములుచేసికొని జ్ఞానవరాహస్వామికి మ్రొక్కులిడి పెద్ద ద్వారమగు ‘అవావఱచ్చూళ్‌న్దాన్’ శ్రీద్వారమును సేవించి, లోనికి జని శ్రీతింత్రిణీవృక్షమును, శ్రీరంగనాథస్వామిమండపమును గూడ సేవించి శ్రీబలిపీఠము చెంతనిలచి ప్రణమిల్లి అక్కడ (ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థకాముడు, జ్ఞాని అనెడు) చతుర్విధ పురుషార్థులగు ఆశ్రితులను కటాక్షించుచు మానసికాహ్లాదముతోడ లోన ప్రవేశించి పాకశాలయందు పాకశాలనాచ్చియారుకు నమస్కరించి శ్రీమహామణిమండపమునకు పోయి ‘ఆనంద మయాయమండపరత్నాయ నమః’ (ఆనందమయమైన మండప రత్నమునకు నమస్కారము) అని ప్రణమిల్లి ప్రదక్షిణక్రమముగా పోయి విష్వక్సేనులను, భగవద్రామానుజాచార్యులను, వేంకటాద్రి నరసింహస్వామిని సేవించాడు.

*(ఇంకా ఉంది)*



# జ్ఞాన, మోక్షధామం- రామేశ్వరము

- శ్రీ వడ్డిరాజు జనార్దనరావు, 99893 50596

శ్రీరాముడు ఆదర్శవంతమైన జీవనం సాగించాడు. అన్ని ధర్మాలను చక్కగా ఆచరించాడు. మనకు దారి చూపించాడు. ఒక మానవుడు ఎలా జీవించాలో చెప్పాడు. తాను ధర్మాన్ని ఆచరిస్తూ, ఆచరింపజేశాడు. 'యతోధర్మ స్తతో జయః' ఎక్కడ ధర్మముందో అక్కడ జయముంది అని అర్థం. శ్రీరాముడు రావణునిపై విజయాన్ని సాధించి తిరిగి వచ్చాడు. రామాయణ ఇతిహాసానికి రామేశ్వరానికి ఒక ప్రత్యేక సంబంధం ఉంది. రామేశ్వరం మోక్షమార్గానికి దారి అని చెబుతారు.

శ్రీరాముడు తాను నిర్వర్తించిన రాజధర్మానుగుణంగా శత్రుసంహారం చేశాడు. అయితే ఆ శత్రువు బ్రాహ్మణుడు అయినందున బ్రాహ్మణహత్యాపాతకంనుండి విముక్తికోసం గురువుల సూచనమేరకు శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. ఆ ప్రదేశమే రామేశ్వరం.

మానవజీవనం సుసంపన్నం చేయడానికి తెలిసో తెలియకో చేసే తప్పులను ప్రక్షాళన చేసుకోవడానికి అనేక తరుణోపాయాలను శాస్త్రం సూచిస్తుంది.

గృహస్తు ముఖ్యంగా గృహస్తుధర్మాన్ని ఆచరించే విధానంలో జరిగే తప్పులను, పాపాలను ప్రక్షాళన చేసుకోవడానికి ఋషులు సూచించిన మార్గాలను అనుసరించాలి.

శ్రీరాముడు ఒక సామాన్యపౌరునిగా, గృహస్తుగా, ఒక రాజుగా బ్రహ్మహత్యపాతకం అనే పాపప్రక్షాళన ఎలా చేసుకోవాలో తాను స్వయంగా ఆచరించి చూపాడు. ఆ ప్రదేశమే రామేశ్వరం.

## మోక్షపురి రామేశ్వరం

బ్రహ్మహత్యాపాతకంనుండి బయటపడటానికి గురువుల సూచనప్రకారం శివలింగాన్ని ప్రతిష్ఠించడంకోసం కైలాసంనుంచి శివలింగాన్ని తేవాలని నిర్ణయించి హనుమకు చెప్పాడు రాముడు. అప్పుడు హనుమ వెంటనే కైలాసానికి వెళ్లాడు. కానీ అతను రావడంలో ఆలస్యం అవడంవల్ల ఇంతలో సీతమ్మ అక్కడ ఉన్న ఇసుకతో చేసిన శివలింగాన్ని ప్రతిష్ఠించడం జరిగింది. హనుమంతుడు తెచ్చిన శివలింగాన్ని కూడా ప్రతిష్ఠించాడు. ఇది విశ్వనాథార్ పేరిట పూజలందుకుంటోంది.

రామేశ్వరఆలయాన్ని రామనాథస్వామిఆలయం అని కూడా పిలుస్తారు. 12 జ్యోతిర్లింగాల్లో ఇది ఒకటి. శివునికి అంకితం చేయబడిన ప్రసిద్ధ హిందూదేవాలయంగా కొలుస్తారు.

చారిత్రక, ఆధ్యాత్మికప్రాముఖ్యత కలిగిఉన్న ఈ రామేశ్వరం ఆలయంలోపల 21బావులతోఉన్న పవిత్ర పుణ్యక్షేత్రం. ప్రజలపాపాలను నశింపచేసే పుణ్యధామం. శ్రీరాముడు బాణాలతో నిర్మించిన ఈ బావుల్లో స్నానమాచరించడం ఎంతో ముక్తిదాయకం. అనేక ప్రాకారాలతో, గుడులతో అలరారుతున్న ఆలయం రామేశ్వరం. తమిళనాడు సముద్రతీరంలో ఉన్న ఈ ఆలయం త్రేతాయుగంనాటిది.

మన దేశంలోని ఇటువంటి క్షేత్రాల్లో, ఆలయాల్లో మానవజీవనవికాసానికి కావలసిన ఎన్నో రహస్యాలు, మార్గాలు నిండి ఉన్నాయి. వాటిని జ్ఞానమార్గంలో తెలుసుకుని జీవితాన్ని సుసంపన్నం చేసుకుందాం.



# కోదండపాణి

**- డా॥ ఎన్.సి.హెచ్. సుధామైథిలి**

ఒకటే మాట, ఒకటే బాణం, ఒకటే భార్యకే కట్టుబడ్డ సిద్ధాంతం రాముడిది. ఏక బాణం- ఒక్క రామబాణం ఎలాంటి విధ్వంసం అయినా చేయగలదు. రాముడు దుష్టశిక్షణలో భాగంగా అనేకసందర్భాలలో తన తిరుగులేనిబాణాలతో అసురసంహారం కావించి లోకానికి శ్రేయస్సు కలిగించాడు.

రాముడు మొదట విశ్వామిత్రునితో యాగరక్షణకోసం వెళ్ళినపుడు తాటకిని,...... తరవాత సుబాహుడిని, వనవాసంలో మొదట విరాధుడు అనే రాక్షసుడిని, జనస్థానంలో ఖర దూషణాదులతోపాటు 14000మంది రాక్షసులని, సీత మనసు ఆకర్షించడానికి బంగారులేడిగా వచ్చిన మారీచుడిని, సీతాపహరణంతరవాత కబంధుడిని, సుగ్రీవుడికి ఇచ్చిన మాటకోసం వాలిని, యుద్ధంలో కుంభకర్ణుడు మొదలగు రాక్షస వీరులని,కడకు తన చావు తానే తెచ్చుకున్న రావణుడిని తన బాణంతోనే తుదముట్టించి, లోకకల్యాణం చేశాడు.

శ్రీరాముని విల్లును కోదండం అంటారు. ఇది చాలా ప్రసిద్ధిచెందిన విల్లు. అందుకే శ్రీరాముడిని కోదండపాణి అని కూడా అంటారు. 'కోదండ' అంటే వెదురుతో చేసినది అని అర్థం. ఈ విల్లును ఎత్తడం సామాన్యులకు సాధ్యం కాదు. ఈ విల్లునుంచి సంధించిన బాణం, ఎదురుగా ఉన్న లక్ష్యాన్ని ఛేదించకుండా తిరిగి రాదు.

ఒక కథనంప్రకారం, ఒకప్పుడు, దేవరాజు ఇంద్రుని కుమారుడు జయంతుడు, శ్రీరాముని బలాన్ని పరీక్షించడానికి అహంకారంతో కాకిరూపాన్ని ధరించాడు. ఈ కాకి సీతాదేవి కాలికి గాయం చేసి అక్కడినుంచి ఎగరడం ప్రారంభించింది. దీంతో ఆ కాకిని చంపడానికి రాముడు తన విల్లునుంచి బాణం సంధించినప్పుడు, ఇంద్రుని కుమారుడు జయంతుడు భయపడ్డాడు. తనను ఎవరూ రక్షించలేరని తెలుసుకుని రాముని వద్దకు వెళ్లి క్షమించమని అడిగాడు. అప్పుడు రాముడు అతనిని క్షమించి వదిలివేశాడు. అలాంటి శక్తివంతమైనది రాముని బాణం.

ఈ విల్లు సహాయంతోనే రాముడు సముద్రంపై బాణాలు వేసి నీటిని తగ్గించి లంకకు వెళ్లేందుకు మార్గం సుగమం చేశాడు. ఈ విల్లు- బాణంతో, వనవాసంలో ఉన్నప్పుడు ఆయన చాలామంది రాక్షసులను సంహరించాడు. దానిసహాయంతో రావణునిసైన్యాన్ని మట్టుబెట్టాడు.

సాధారణంగా 'రామబాణం' అంటే గురి తప్పనిది అని మనమంతా అనుకుంటాం. కానీ దీనివెనుక దాగిన నిజమైన కథ వేరు. లక్ష్మణుడు అన్ని దివ్యాస్త్రాలూ ప్రయోగించినప్పటికీ ఇంద్రజిత్తు మరణించడం లేదు. దాంతో లక్ష్మణుడు 'ధర్మాత్మా సత్యసంధశ్చ రామో దాశరథిర్యది పౌరుషే చాప్రతిద్వందహా తద్దైనం జహి రావణమ్' అంటూ ఒక బాణాన్ని సంధించగానే ఇంద్రజిత్తు తల తెగిపడిపోయింది. లక్ష్మణుడు చదివిన ఆ శ్లోకానికి 'నా సోదరుడు రాముడు ధర్మాత్ముడు, నిజాలు మాట్లాడేవాడు, పౌరుషవంతుడు, దశరథుని కొడుకే గనుక అయితే ఈ బాణం ఇంద్రజిత్తును సంహరించు గాక!' అని అర్థం. అంటే రామునిమీద ఒట్టుపెట్టుకుని ప్రయోగించే ఈ బాణం రాముడంతటి శక్తిని కలిగి శత్రువును నిర్మూలిస్తుందని భావం. అప్పటినుంచే రామబాణం అనే పదప్రయోగం

వాడుకలోకి వచ్చింది. జనబాహుళ్యంలో రామబాణం అంటే ఏడుతాటిచెట్లను నరికేసే శక్తి కలది అనే అపోహ ఉంది. కానీ నిజానికి రామనామానికి ఉన్న శక్తిని చెప్పడానికి వాడే పదమే ఈ రామబాణం.

దేవాలయాలలో మనం చూసే కోదండరాముని ప్రతిమ త్రిభంగియై, అంటే మూడువంపులుగా ఉంటుంది.

రామ రావణసంగ్రామంలో.. అసురులు విజృంభించిన వేళ.. ఆ మారణహోమమునకు జడిసి వానరులంతా రాముని వెనుక చేరారు. ఇక తానే స్వయంగా కోదండపాణి తన ధనుస్సుకు పని చెప్పగా అది పుష్కలావర్తకమేఘములు వర్షించినవిధంగా ఎడతెరిపి లేకుండా బాణవర్షాన్ని కురిపించింది. రాముని ధనుస్సునుండీ వెలువడే బాణాలు రాముడు ధనుస్సును వంచునో! మరి కవ్వములా గిరగిర

## ఫిబ్రవరి నెల క్విజ్-31 సమాధానాలు

| | |
|---|---|
| 01) శివుడు | 09) దేవవ్రతుడు |
| 02) శ్రీనాథుడు | 10) సాల్వుడు |
| 03) రథం | 11) మనోనిగ్రహానికి |
| 04) చండేశ్వరుడు | 12) తాళ్లపాక తిమ్మక్క |
| 05) వసంత పంచమి | 13) కందుకూరి రుద్రకవి |
| 06) హంస | 14) మాసశివరాత్రి |
| 07) నేపాల్ | 15) మహాశివరాత్రి |
| 08) కోటప్పకొండ తిరునాళ్లు | |

**సరైన సమాధానాలు వ్రాసినవారు-**

01) బి.షణ్ముఖవిరాట్, బెంగళూరు
02) కె.సాకేత్, హైదరాబాద్
03) తనిష్క, బెంగళూరు
04) సిహెచ్.చిన్మయి, మేడ్చల్
05) ఎన్.సుహాంత్ అమర్త్య, తిరుపతి
06) పి.మధుశ్రీ, రాజమహేంద్రవరం
07) పి.చైత్ర, హనుమకొండ
08) బి.పూజిత, శ్రీకాకుళం
09) ఎమ్.రాగలహరి, హైదరాబాదు
10) టి.జైవీర్‌వరుణ్, హైదరాబాదు
11) వి.తన్మయి, రాజమహేంద్రవరం
12) వై.శ్రీనివాససత్కృత్, బెంగళూరు

త్రిప్పునో! ఖడ్గములా ఝళిపించునో! ఎవరికీ కనపడదు! కానీ ప్రతి రాక్షసుని శరీరమును అవి అన్నివైపులనుండి తూట్లు పొడిచి ఛిద్రము చేశాయి.

వింటినారిలాగినప్పుడు ఉరుములా..!

బాణము వదలినప్పుడు మెరుపులా..! వచ్చి తాకునప్పుడు వేయిమణుగుల పిడుగులా! అన్నట్లు ఆ బాణవర్షముంటుంది.. బాణాలు వేసే రాముడి ఆకారము కనపడక ఒక తేజఃపుంజము గిర్రున తిరుగుతున్నట్లుగా వారికి కనబడింది.

అద్భుతమైన లాఘవము!

కనులు మిరుమిట్లు గొలిపే బాణప్రయోగం

రాముడొక్కడే వీరుడు! మహా ధానుష్కుడు!

అని యుద్ధము చూడవచ్చిన దేవసమూహాలు ఆశ్చర్యంతో నోళ్ళు వెళ్ళబెట్టాయి.

అవి బాణములా, కావు!

త్రినేత్రుడి రుద్రజ్వాలలు!

క్షణంలో ఆ యుద్ధభూమి రుద్రభూమిగా మారి లయకారకుడు ప్రళయనృత్యం చేసే వేదికగా మారిందని, రావణసైన్యమంతా బూడిదకుప్పగా మారిపోయిందని రాముని యుద్ధపరాక్రమాన్ని వర్ణించారు కవులు.

అంత యుద్ధం చేసినా అలసట అన్నది ఎరుగని శౌరి రాముడు..

రావణాసురుడంతటివాడిని సంహరించే మహా యజ్ఞంలో రాముని పరాక్రమానికి మరింత ఊతమయ్యింది కోదండం.. అటువంటి కోదండం జగద్రక్షకుడైన భగవంతునికి అలంకారమై, ఆయుధమై కోదండపాణిగా, కోదండరామునిగా స్వామిపేరులో చేరి ధన్యతనొందింది. రాముడు నడిచిన దారి, నమ్ముకున్న ధర్మం, ఆయన గుణగణాలు ఆయనను సాక్షాత్తు దేవుడి అవతారంగా నిలబెట్టాయి. అటువంటి ఆదర్శపురుషుని అడుగుజాడలలో మనమూ పయనిద్దాం. కోదండపాణిని మనసారా భజిద్దాం.. రామనామాన్ని అనుక్షణం తలచి ధన్యులమవుదాం..



స్థిరమైన లక్ష్యం లేనివాడు తెగిన గాలిపటం వంటివాడు

*2025, ఏప్రిల్ 30న*
*పరశురామజయంతి సందర్భంగా...*

బాలనీతి

# తన కోపమే తన శత్రువు


- శ్రీ జె.నరసింహారావు,
98857 04685


శ్రీరాముడు సీతతో పరిణయమాడి తన సోదర బంధు మిత్ర సపరివారసమేతంగా ఆనందంగా మిథిలానగరంనుండి రథంపై అయోధ్యకు బయలుదేరాడు. పౌరులు ఆ వేడుకల్లో ఆనందపారవశ్యులైన సమయంలో అకస్మాత్తుగా అక్కడ భార్గవరాముడు వైష్ణవధనుస్సు, గండ్రగొడ్డలితో ప్రత్యక్షమయ్యాడు. ఆగ్రహావేశంతో ఉన్న ఆయనను వివిధరకాల దశరథమహారాజు శాంతించాల్సిందిగా ప్రార్థించాడు. ఎవరో నా పేరు కలిగిన రాముడట, శివధనుస్సును విరిచాడట. అది తెలిసి అతణ్ణి చూడటానికి వచ్చానన్నాడు. శ్రీరామచంద్రుడు భార్గవరాముని సమీపించి చిరుమందహాసంతో వినయంగా రెండుచేతులు జోడించి భార్గవరామునికి ఈ దశరథరాముడు నమస్కరిస్తున్నాడని ప్రణమిల్లాడు. దాంతో సంతసించక భార్గవరాముడు తను చేసిన ఘనకార్యాలను మరియు తన బలపరాక్రమాలను తాను ఇరవైఒక్కసార్లు భూమండలాన్ని చుట్టి ఏ విధంగా క్షత్రియరాజులను సంహరించాడో వాటి పూర్వాపరాలతో సహా చెప్పాడు. అంతేకాక వైష్ణవధనుస్సు మరియు గండ్రగొడ్డలిని చూపించి భయం కలిగించటానికి ప్రయత్నించాడు. ఐనా ఆ పరాత్పరుడు చిరుమందహాసంతో భార్గవునిచూచి నవ్వుతూ ఎదుటనిలిచిన తన అంశ తనతో ఏ విధంగా సంభాషిస్తోందో కదా అని ఆశ్చర్యంగా చూస్తున్నాడు. భార్గవుడు శ్రీరామునితో ఈ సృష్టిలో "రామ" అను పేరు కలిగిన ఇద్దరు వ్యక్తులు ఉండటానికి వీలులేదు. మన ఇద్దరిలో ఎవరో ఒకరు మాత్రమే ఉండాలన్నాడు. నీవు భుజబలశాలి, పరాక్రమవంతుడైన ఈ భార్గవరామునితో యుద్ధం చేయలేవు. అందువల్ల నీవు ఈ నా వైష్ణవధనుస్సుతో శరమును సంధించు అది చాలు అని చెప్పగా శ్రీరాముడు అతనినుండి వైష్ణవధనుస్సు తీసుకొంటూ అతనిశక్తినికూడా పూర్తిగా తీసేసుకొన్నాడు. ఆ క్షణంలో భార్గవుని అహం నశించి ఎదుట నిలిచిన శ్రీమహావిష్ణువుగా సత్యం గ్రహించి అహంకారం నశించినవాడై మహేంద్రపర్వతాలకు తిరుగు ప్రయాణమయ్యాడు. శ్రీరామునివల్ల పరాభవం పొందిన భార్గవరాముడు అత్యంత నిర్వేదం చెంది మార్గంలో ఇలా చింతిస్తూ వెళ్తున్నాడు. ప్రబలశత్రువైన క్రోధంచేత 'మోహం' అనే పెద్దగోతిలో పడిపోయి ఇలా తయ్యారయ్యానే. తపస్సు చేసేవాడికి క్రోధమే మృత్యువు కదా! క్రోధంగలవానినుండి ఆలోచన అనేది దూరంగా వెళ్లిపోతుంది. క్రోధం మనిషిని మృగంగా మారుస్తుంది. వాడు పిశాచంవలె ఏ నీచకార్యమైన చేయగలడు. పిశాచానికి క్రోధంగలవానికి భేదము లేదు కదా! మా తండ్రి జమదగ్నిమహర్షిని ఎవరో రాజు సంహరించగా నేను ఆ కోపంతో ఎందరో రాజులను సంహరించానే. అభిమానం క్రోధానికి మూలం. ఆ అభిమానంవల్లనే నేను పెద్ద అజగరం (కొండచిలువ)వంటి క్రోధసర్పంచేత మ్రింగబడ్డానే అని వగస్తూ వెళ్లిపోయాడు.



పై కథద్వారా మనకు తెలిసిన నీతి ఏమంటే మానవుడు ఆధ్యాత్మికఉన్నతిని సాధించాలంటే అరిషడ్వర్గాలను జయించాలి. ప్రముఖంగా కోపాన్ని అదుపులో ఉంచుకోవాలి. దానికి సులభమైనమార్గం ఒక్కటే. అది ఏమంటే "ధ్యానం". దీని ద్వారానే మనిషి కోపాన్ని జయించి ఆధ్యాత్మికఉన్నతిని సాధించగలడు.

నీ కుటుంబంలోని వారే కాదు నీ మనుషులు తోటివారు కూడా మనుషులేనని గుర్తించు

చిత్ర కథ

# సుగుణాభిరాముడు

కథ-శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు
చిత్రాలు-శ్రీ కె.వి.కోటిలింగాచారి

పిల్లలకొరకు రామాయణంలోని రాముని గురించి తెలియపరిచే కథాదృశ్యమాలిక...



దశరథుని కుమారులు రామలక్ష్మణభరతశత్రుఘ్నులు అన్నదమ్ముల అనురాగానికి ప్రతీకలు



రామునివంటి శిష్యుడు, విశ్వామిత్రునివంటి గురువు సృష్టిలోనే లేరు. గురుశిష్యబంధానికి వారిద్దరు పతాకలు



తండ్రి మాట జవదాటని రాముడు తన భార్య సీతతోను, తమ్ముడు లక్ష్మణునితో కలసి 14 ఏళ్లు వనవాసం చేయడానికి వెళ్లారు.



మహర్షుల ఆజ్ఞలను శిరసా వహించి రాక్షసులబారినుండి మహర్షులను రక్షించిన ఆశ్రితవత్సలుడు



గౌతమాశ్రమంలో చలనరహితంగా పడిఉన్న అహల్యకు తన పాదం సోకినంతనే శాపవిమోచనం కల్గించిన పతితపావనుడు.



అహల్యాగౌతముల ఆశీస్సులను అందుకుని ధన్యులైన రామలక్ష్మణులు.



తన తండ్రి స్నేహితుడైన జటాయువుకు మరణానంతరం ఉత్తరక్రియలు చేసి మోక్షాన్నిచ్చిన భక్తవత్సలుడు.



వానరరాజైన సుగ్రీవునితో స్నేహం చేసి స్నేహధర్మానికి అద్దం పట్టిన సద్గుణరాశి.



తన భక్తుడు ఐన హనుమంతునిపై అపార పుత్రవాత్సల్యం చూపిన కారుణ్యధాముడు.



వానరుల సహాయసహకారాలతో దక్షిణదిక్కునున్న సముద్రంపై వారధిని నిర్మించిన విజ్ఞాన శాస్త్రవేత్త.



లంకాధిపతి దశకంఠుడైన రావణాసురుణ్ణి యుద్ధంలో హతమార్చిన లోకోపకారకుడు.



ఒకటే మాట- ఒకటే భార్య- ఒకటే బాట- ఒకటే బాణం అనే నిష్ఠా గరిష్ఠత కల్గి 11 వేల సంవత్సరాలు అయోధ్యరాజ్యాన్ని పరిపాలించిన జగదభిరాముడు. అందుకే 'రామరాజ్యం' అనే ఖ్యాతి కల్గింది.


# బాలవినోదం

## పిల్లలూ.. గేయం పాడుదాం రండి!!

'అ' అక్షరం దిద్దుదాం - అమ్మమాట విందాం
'ఆ' అక్షరం దిద్దుదాం - ఆటలకు పరుగెడుదాం
'ఇ' అక్షరం దిద్దుదాం - ఇల్లు శుభ్రంగా ఉంచుదాం
'ఈ' అక్షరం దిద్దుదాం - ఈశ్వరుని కొలుద్దాం
'ఉ' అక్షరం దిద్దుదాం - ఉట్టికొట్టి ఆడుదాం
'ఊ' అక్షరం దిద్దుదాం - ఊయల్లో ఊగుదాం
'ఋ', 'ౠ' అక్షరాలు దిద్దుదాం - ఋషులపేర్లు స్మరిద్దాం
'ఎ' అక్షరం దిద్దుదాం - ఎవరితోడ కయ్యమాడకుందాం
'ఏ' అక్షరం దిద్దుదాం - ఏనుగునెక్కి ఊరేగుదాం
'ఐ' అక్షరం దిద్దుదాం - ఐ ఉంటూ సంబరంగా ఆడుదాం
'ఒ' అక్షరం దిద్దుదాం - ఒకరికొకరం తోడుందాం
'ఓ' అక్షరం దిద్దుదాం - ఓంకారమంత్రం పఠిద్దాం
'అం' అక్షరం దిద్దుదాం - అందరం కలిసుందాం
'అః' అక్షరం దిద్దుదాం - అః అః అంటూ నవ్వుతూ హాయిగుందాం. గురువుగారు చెప్పిన పాఠాలు విందాం.
అమ్మనాన్నలు చెప్పిన మంచిపనులు చేద్దాం.
బామ్మతాతలు చెప్పిన నీతికథలు విందాం.
అందరం కలుద్దాం! ఆనందంగా ఉందాం!!



దేవతలు, వారి ఆయుధాలు, వాయిద్యాల చిత్రాలు క్రింద ఇవ్వబడ్డాయి. ఆ దేవతలపేర్లు, వారి ఆయుధాలు, వాయిద్యాలపేర్లు కనుక్కొని జతపరచి వ్రాయండి.



జవాబులు: 01)శ్రీకృష్ణుడు- పిల్లనగ్రోవి 02)సరస్వతీదేవి- వీణ 03)మహాశివుడు- డమరుకం 04)నారదమహర్షి- తంబూర 05)శ్రీరాముడు- శివధనుస్సు 06)మహావిష్ణువు- సుదర్శనచక్రం

ఆయుర్వేదం

# పరిపూర్ణ ఆరోగ్యానికి బాదం

- డా॥చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

బాదంపప్పు శరీరపోషణకు ఆరోగ్యసౌందర్య పరిరక్షణకేకాకుండా నిత్యజీవితంలో మనం ఎదుర్కొనే ఎన్నో అనారోగ్యసమస్యలకు చక్కటి పరిష్కారం చూపే ఔషధంగా ఉపయోగపడుతుంది.

**గమనిక:** బాదంపప్పుని వేడినీటిలో వేసి రెండుగంటలు నానించి పై పొట్టు తీసి పప్పుని ఎండించి ఔషధంగా ఉపయోగిస్తే వాటి ఔషధగుణాలు సంపూర్ణంగా పొందగలం.

**నిద్ర బాగాపట్టేందుకు :** బాదంపప్పులపొడి, పటికబెల్లంపొడి సమానంగా కలిపి ఉంచుకొని రోజూ రాత్రి పడుకునేటప్పుడు 100మి.లీ. గోరువెచ్చనిపాలలో ఒకటీస్పూనుపొడిని కలిపి సేవిస్తుండాలి. ఇలా వాడటంవల్ల బాగా నిద్రపట్టటమేకాక మానసిక, శారీరక అలసటకూడా తగ్గుతాయి. మరియు అధిక మద్యపానసేవనంవల్ల కలిగే నరాల నిస్సత్తువ, బలహీనత తగ్గుతాయి.

**మొటిమలు, మచ్చలు తగ్గేందుకు:** ఒకభాగం బాదంపప్పుపొడిని నాలుగుభాగాలపన్నీరులో కలిపి మెత్తగానూరి ముఖంపై లేపనంగా పూసి, గంటసేపాగి కడిగేస్తుంటే మొటిమలు, మచ్చలు తగ్గిపోయి ముఖం కోమలంగా, నాజూగ్గా, సౌందర్యవంతంగా తయారవుతుంది.

**చర్మసమస్యలకు సుగంధస్నానచూర్ణం:** 200గ్రా. బాదంపప్పు పొడిలో 15గ్రాములచొప్పున పచారికొట్లలో దొరికే మంజిష్ఠ, కస్తూరిపసుపు, జటామాంసిచూర్ణాలను కలిపి ఉంచుకొని స్నానంచేసేసమయంలో తగినంతపొడిలో కాస్తనీరు లేదా పాలు



చేర్చి ఒంటికి రుద్దుకుని ఆరినతర్వాత స్నానంచేస్తుంటే చర్మంపై ఉన్న మచ్చలు, గుల్లలు, మొటిమలు, దురదలు తగ్గటంతోపాటు ఒంటిదుర్వాసనకూడా తగ్గుతుంది.

**తలనొప్పులు తగ్గేందుకు:** బాదంపప్పుపొడి, గసగసాలను వేయించిచేసినపొడి, ఎండుఖర్జూరపెచ్చులచూర్ణం, పటిక బెల్లంపొడి ఒక్కొక్కటి 50గ్రాములు, ఏలకులపొడి 5గ్రాముల చొప్పున కలిపి ఉంచుకుని రోజూ రెండుపూటలా పూటకి 100మి.లీ.నీటిలో అరటీస్పూన్‌పొడి కలిపి సేవిస్తుంటే తల నొప్పులు, తలపోటు, తలబరువుగాఉండటం, తలదిమ్ము లాంటి శిరోవ్యాధులు తగ్గుతాయి.

**కంటిచూపు మెరుగయ్యేందుకు:** బాదంపప్పు, సోంపుగింజలు, పటికబెల్లంచూర్ణాలను సమానంగా కలిపిఉంచుకుని రాత్రి పడుకునేటప్పుడు 1/2-1టీస్పూనుపొడివరకు 100మి.లీ. వేడి పాలలో కలిపి సేవిస్తుంటే నేత్రదృష్టి మెరుగవుతుంది. మరియు ఒంటినొప్పులు, శరీరతిమ్మిర్లు, బలహీనత, మతిమరుపుసమస్య తగ్గుతాయి.

**ఉబ్బసవ్యాధికి:** బాదంపప్పులపొడి, ఎండుకిస్‌మిస్, ఎండు ఖర్జూరంపెచ్చులపొడి, పటికబెల్లంపొడి ఒక్కొక్కటి 100గ్రా., తేనె 200గ్రా. కలిపి మెత్తగా దంచి నిల్వ ఉంచుకుని రోజూ రెండుపూటలా పూటకు ఒకటీస్పూన్ ఔషధాన్ని చప్పరించి గోరువెచ్చనినీరు సేవిస్తుంటే ఉబ్బసం ముఖ్యంగా వేసవికాలంలో వచ్చే ఉబ్బసతీవ్రత తగ్గుతుంది.

**జ్ఞాపకశక్తికి:** రోజూ ఒకసారి 200 మి.లీ. పాలలో ఆరుబాదం పప్పులు, నాలుగుమిరియాలు నలగ్గొట్టివేసి పొయ్యిపైపెట్టి మూడుపొంగులు వచ్చునట్లు మరిగించి దించి వడబోసి తగినంత పటికబెల్లంపొడి కలిపి సేవిస్తుంటే ఏకాగ్రత, ధారణా శక్తి, జ్ఞాపకశక్తి పెరుగుతాయి.

# క్విజ్ 33

01) శ్రీరాముడినుండి గోవుల స్వీకర్త? జ)..............................
02) రేణుక భర్తపేరు? జ)..............................
03) 'హోతారం'నకు అర్థం? జ)..............................
04) లయకారకుడు? జ)..............................
05) ముక్కోటిదేవతలు కొలువై ఉన్న జంతువు? జ)..............................
06) ఉదయగిరి పాలకుడు? జ)..............................
07) వివాహఘట్టంలో ప్రధానమైనది? జ)..............................
08) ముత్యం ఏ గ్రహానికి సంకేతం? జ)..............................
09) 'తుంబురుతీర్థం'నకు మరో పేరు? జ)..............................
10) అన్ని జన్మల్లోకి ఉత్తమమైనది? జ)..............................
11) సర్పరాజు? జ)..............................
12) తమిళనాడులోని సుబ్రహ్మణ్యస్వామి ప్రసిద్ధక్షేత్రం? జ)..............................
13) 'భుజంగస్తోత్రం' పఠనకర్త? జ)..............................
14) 'భక్త రామదాసు' అసలు పేరు? జ)..............................
15) వేంకటాచలనాథునికి లాలి పాటలు పాడినవాడు? జ)..............................
16) తులసి భర్త పేరు? జ)..............................
17) వెయ్యిపడగల ఆదిశేషునిరూపంతో శాస్త్రచర్చకర్త? జ)..............................
18) త్రేతాయుగంనాటి ప్రసిద్ధ ఆలయం? జ)..............................
19) ఇంద్రుని కుమారుడు? జ)..............................
20) రావణుని దేశము? జ)..............................

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.
02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.
03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.
04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.
05) జవాబులు చేరాల్సిన చివరితేది **25-04-2025**.
06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.
07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.
08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.
09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.
10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.
11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .............................. వయస్సు: ..............
పాఠశాల: .............................. తరగతి: ..............
పేరు: ..............................
చిరునామా: ..............................
..............................
..............................
.............................. పిన్‌కోడ్: ..............
ఫోన్ సంఖ్య: ..............................

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి.ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

ఏప్రిల్, 2025

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** సంపద, ఆస్తి, విలాసవంతమైన సౌకర్యాలు అనుభవిస్తారు. వ్యాపారపరంగా లాభాలను ఆర్జిస్తారు. ఆశావహంగా ఉంటారు. తన వాక్కుతో ఇతరులను మెప్పించి కార్యజయం పొందుతారు.



**వృషభం–** అనుకూలమైన కాలం. ఆర్థికంగా బలపడతారు. కుటుంబసభ్యుల సహకారం బలమైన ఆర్థిక పరిస్థితికి దోహదం చేస్తుంది. సమాజంలో గౌరవమర్యాదలు పెరుగుతాయి.



**మిథునం–** ఆరోగ్యంగా, ధనవంతులుగా మరియు తెలివైనవారుగా రూపుదిద్దుకుంటారు. జన్మరాశిలో గురుసంచారం జ్ఞానం, సంపద మరియు శ్రేయస్సును పెంపొందిస్తుంది. ఆర్థికపరిస్థితులు గణనీయంగా పెరుగుతాయి.



**కర్కాటకం–** కుటుంబపరమైన ఖర్చులు పెరుగుతాయి. విదేశీప్రయాణం, కుటుంబానికి దూరంగా ఉండటం, వృత్తి వ్యాపారాలలో ఆటంకాలు అధిగమిస్తారు.



**సింహం–** కుటుంబంలో శాంతి, సామరస్యం ఉంటుంది. వృత్తిలో ప్రోత్సాహకాలు పెరుగుతాయి. ఉద్యోగంలో ప్రమోషన్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. అదృష్టకాలంగా ఉంటుంది.



**కన్య–** గురుబలం ఉంది. కలలను సాకారం చేసుకోవడానికి ప్రణాళిక రచిస్తారు. లక్ష్యం సాధించేవరకు దృఢనిశ్చయంతో కృషిచేస్తారు. ఇతరులపై ఆధారపడకుండా స్వయంశక్తితో విజయం సాధిస్తారు. దైవబలంతో అనుకున్న కార్యాలను సాధిస్తారు. ఇతరులకు తమ వంతు సహాయం చేస్తారు.



**తుల–** ఆర్థిక పరిపుష్టి కల్గుతుంది. బంధుమిత్రుల సమాగమం కలుగుతుంది. ఎంత కఠినమైన పని అయినా ఎంతో సులువుగా చేయగలుగుతారు.



**వృశ్చికం–** గృహంలో కల్యాణాది శుభకార్యనిర్వహణ జరుగుతుంది. కార్యసిద్ధి అవుతుంది. దీర్ఘకాలిక ప్రణాళికలలో ముందంజ వేస్తారు.



**ధనుస్సు–** జీవితంలో ప్రతి కార్యకలాపాన్ని చురుకుగా నిర్వర్తించడానికి ఉత్సాహాన్ని కలిగి ఉంటారు. ఉన్నత ఆశయాలను విజయవంతంగా చేరుకుంటారు. సమాజం, కుటుంబం, స్నేహితులతో బాగుంటారు.



**మకరం–** మేధస్సు మరియు జ్ఞానం వృద్ధి అవుతుంది. జీవితంలోని అనేకరంగాలలో విజయానికి దారితీసే ఉన్నతస్థాయి ధీశక్తి పెరుగుతుంది. అన్ని రంగాలలోనూ విజయం సాధిస్తారు.



**కుంభం–** గృహం కొనడంలాంటి ప్రయోజనాలు నెరవేరతాయి. ధనాన్ని శుభవిషయాలకై మాత్రమే వెచ్చిస్తారు. దుబారాఖర్చులను అదుపులో ఉంచగల్గుతారు. పుత్రసంతానం కల్గుతుంది. ధనవృద్ధి అవుతుంది.



**మీనం–** ఆత్మవిశ్వాసంతో కార్యనిర్వహణ మరియు పదిమందిని ప్రోత్సహించి ముందుకు నడిపించే సామర్థ్యాన్ని కలిగిఉంటారు. ఆర్థికంగా పెద్దగా ప్రయోజనం ఉండదు. ఇతరులతో ఆర్థికపరమైన లావాదేవీలవిషయంలో జాగ్రత్త అవసరం.

రాశిఫలాలు చదివి ఊరకే కూర్చోవటం కాదు. నిరంతర శ్రమతోనే మన రాతలు మార్చుకోవచ్చు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1. పేరు మరియు చిరునామా :**
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

______________________________

______________________________

______________________________

(పిన్‌కోడ్ తప్పనిసరి) | | | | | | |

సెల్ నెం. | | | | | | | | | | | |

**2. కావలసినభాష :**
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3. సంవత్సరచందా :** ☐ రూ.240/-
జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4. విదేశాలకు సంవత్సరచందా :** ☐ రూ.1030/-


**5. చందా పునరుద్ధరణ :**
(అ) చందానెంబరు :
(ఆ) భాష :

**6. చెల్లించిన మొత్తం :**
డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :
........................................ తేది :..................

ప్రదేశం :
తేది :
చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.
2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.
3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.
4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".
5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 111



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం** 1)చైత్రశుద్ధనవమిరోజున జరిపేపండుగ(6); 4)భరతుని భార్య(3); 7)శల్యునికుమారుడు(5); 8)వేదాలలో ఒకటి(2); 9)కద్రువకుమారుడు(3); 14)ఉగ్రసేనునికుమార్తె(4); 15)దక్షునికుమార్తె కనుక ఈవిధంగా పిలుస్తారు(4); 17)రావణుని దేశము(2); 19)కేవలునిపుత్రుడు(5); 21)జంభాసురుని కూతురు(2); 22)బ్రహ్మ(8)

**నిలువు** 1)అంబరీషునికుమార్తె(3); 2)కుబేరునిభార్య(4); 3)చైత్రబహుళఏకాదశి(4); 5)దీర్ఘతమసుడి మరో పేరు(4); 6)అష్టవసువులలో ఒకడు(3); 10)ఈ క్షేత్రం తెలంగాణలో గోదావరినదిఒడ్డున ఉంది(4); 11)శ్రీరాముని తల్లి(3); 12)చైత్ర శుద్ధఏకాదశి(3); 13)భూమి(3); 16)శ్రీకృష్ణుణ్ణి పెంచిన యాదవ స్త్రీ(3); 18)తలలేని రాక్షసుడు(4); 20)మన్మథుడు(3)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., P.G. Dip. in Ephigraphy, Dip. in Yoga on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



మహాకుంభమేళా సందర్భంగా 2025, ఫిబ్రవరి 18న వారణాసిలోని
బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలోని బిర్లామందిర్‌లో
అంగరంగవైభవంగా నిర్వహించిన శ్రీనివాసకల్యాణోత్సవ సందర్భంగా
పట్టువస్త్రాలు సమర్పించిన తి.తి.దే. కార్యనిర్వహణాధికారి
శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., దంపతులు



శ్రీరామకృష్ణతీర్థముక్కోటి పర్వదినం సందర్భంగా
2025, ఫిబ్రవరి 12న వేడుకగా
జరిగిన ఉత్సవంలో పాల్గొన్న అశేషభక్తజనం



శ్రీశైలంలో మహాశివరాత్రి శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల
సందర్భంగా 2025, ఫిబ్రవరి 22న
తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి తరపున పట్టువస్త్రాలు సమర్పించిన
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., దంపతులు



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా
తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి తరపున
2025, ఫిబ్రవరి 28న పట్టువస్త్రాలు సమర్పించిన
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., దంపతులు



తిరుమల శ్రీవారి దర్శనార్థమై 2025, ఫిబ్రవరి 10న తిరుమలకు విచ్చేసిన
ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ దంపతులకు
తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకులమండపంలో
స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందించిన
తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి, శ్రీ సి.హెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్.



తి.తి.దే. పాలకమండలి ఎక్స్ అఫిషియోసభ్యుడుగా 2025, ఫిబ్రవరి 23న
ప్రమాణస్వీకారం చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దేవదాయ కార్యదర్శి
శ్రీ వి.వినయచంద్, ఐ.ఏ.ఎస్., దంపతులకు తిరుమల శ్రీవారి ఆలయంలోని
రంగనాయకులమండపంలో చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించిన
తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్.

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthnams
Printing on 25-03-2025 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under
RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT
No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 5th of Every Month.

